V3 NEWS
www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# విశ్వంభర
అక్షరం సాక్షిగా..
శుక్రవారం
09-08-2024
సంపుటి : 01 । సంచిక : 97 । పేజీలు : 12 । వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్


డా॥ కాచం సత్యనారాయణ
CMD

## ఆమె రాక మరింత ఆలస్యం

- సునీతా విలియమ్స్.. 2025 ఫిబ్రవరి వరకు అంతరిక్షంలోనే..
- నాసా తాజా ప్రకటన విడుదల
- వ్యోమగాములను తీసుకొచ్చేందుకు ప్రణాళికలు



**విశ్వంభర, సాంకేతికం:**

మూడోసారి రోదసిలోకి వెళ్లిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్ సాంకేతిక కారణాలతో రోజుల తరబడి అక్కడే చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే. ఆమె రాక మరింత ఆలస్యం కానున్నట్లు తెలుస్తోంది. మరో ఎనిమిది నెలల పాటు అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు నాసా తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. 8 రోజుల మిషన్లో భాగంగా సునీత, మిగతా2లో...

## కంచు మోగించిన భారత్



### నాలుగుకు చేరిన భారత్ పతకాల సంఖ్య

- 52 ఏళ్లలో తొలిసారి వరుసగా రెండు కాంస్యాలు
- నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ భారత హాకీకి ఊపిరి
- ఉద్వేగానికి గురైన శ్రీజేశ్...

**పారిస్:** ఒలింపిక్స్ లో గతంలో తిరుగులేని విజయాలతో చరిత్ర సృష్టించిన భారత హాకీ జట్టుకు మళ్లీ మంచిరోజులు వచ్చినట్లు కనబడుతోంది. క్రితం టోక్యో ఒలింపిక్స్లో కంచు పతకాన్ని సొంతం చేసుకున్న భారత హాకీ సేన.. పారిస్ లోనూ అద్భుత ఆట తీరుతో మరోసారి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. గురువారం జరిగిన కాంస్య పతక పోరులో 2-1తో స్పెయిన్ పై గెలుపొందింది. కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ (30వ నిమిషం, 33వ నిమిషం) రెండు గోల్స్ చేసి భారత్ విజయంలో కీలకపాత్ర పోషించాడు. మిగతా2లో...

## బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత

- 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలు
- అత్యంత సాధారణ జీవితాన్ని గడిపిన కమ్యూనిస్టు యోధుడు
- శ్వాసకోశ సమస్యతో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు



2

## హైదరాబాద్‌లోకి బంగ్లాదేశీయులు?

- కోల్‌కతా నుంచి రైళ్లలో అక్రమంగా రాకపోకలు
- ముమ్మరంగా పోలీసుల తనిఖీలు
- 1000 మందికి పైగా వచ్చి ఉండొచ్చని పోలీసుల అంచనా



2



## హైదరాబాద్‌లో ఛార్లెస్ స్క్వాబ్

### కొత్తగా టెక్నాలజీ డెవెలప్మెంట్ సెంటర్

- డల్లాస్‌లో సీఎంతో కంపెనీ ప్రతినిధుల చర్చలు
- ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి హామీ

**విశ్వంభర, ఢల్లాస్:**

ఫైనాన్షియల్ సర్వీసెస్లో ప్రపంచంలో పేరొందిన చార్లెస్ స్క్వాబ్ కంపెనీ హైదరాబాద్లో టెక్నాలజీ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. భారత్లోనే ఈ కంపెనీ నెలకొల్పే మొదటి సెంటర్ ఇదే కావటం విశేషం. అమెరికా పర్యటనలో భాగంగా డల్లాస్ లో ముఖ్యమంత్రి ఏ.రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబుతో ఈ కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్లు డెన్నిస్ హోవార్డ్, రామ బొక్కా సారథ్యంలో ప్రతినిధులు చర్చలు జరిపారు. ఈ సందర్భంగా టెక్నాలజీ అండ్ డెవెలప్మెంట్ సెంటర్ ఏర్పాటుపై కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హైదరాబాద్‌లో ఈ కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తగిన సహకారం అందిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. కంపెనీ కార్యకలాపాలను వేగవంతం చేసేందుకు అవసరమైన మార్గదర్శనం చేస్తామని చెప్పారు. తమ కంపెనీ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతుకు కంపెనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ టెక్నాలజీ సెంటర్ ఏర్పాటుకు ఛార్లెస్ స్క్వాబ్ తుది అనుమతుల కోసం వేచి చూస్తోంది. మిగతా2లో...



## సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే

### గత ప్రభుత్వ డిజైన్ లోపం వల్లే కూలింది

కూలే గోడలు కట్టించి మరొకరిపై బురద జల్లే యత్నం

డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క

2

## దండం పెట్టిన ధన్‌ఖడ్

### రాజ్యసభ నుంచి వాకౌట్.. విపక్ష సభ్యులపై సీరియస్

సభలో వాతావారణం ఆమోదయోగ్యంగా లేదన్న చైర్మన్

**న్యూఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్‌లో రెజ్లర్ వినేశ్ ఫోగట్‌ను అనర్హురాలిగా ప్రకటించిన అంశంలో రాజకీయ కుట్ర ఉన్నదని, దానిపై చర్చ చేపట్టాలని బుధవారం రాజ్యసభలో విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభ చైర్మెన్ జగదీప్ ధన్ ఖడ్, విపక్ష సభ్యుల మిగతా2లో...





## నాగార్జున సాగర్‌కు వరద ఉద్ధృతి

### 26 గేట్లు ఎత్తి నీటి విడుదల

- కూలిపోయిన సుంకిశాల రిటెయినింగ్ వాల్..
- క్షణాల్లో జల దిగ్బంధమైన పంప్ హౌస్

**విశ్వంభర, నాగార్జున సాగర్:** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ఉద్ధృతి కొనసాగుతోంది. దీంతో మొత్తం 26 గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. 22 గేట్లు 5 అడుగులు, 4 గేట్లు 10 అడుగుల మేర ఎత్తి నీటిని విడిచి పెడుతున్నారు. ప్రాజెక్టుకు 2.53 లక్షల క్యూసెక్కుల ఇన్ఫ్లో వచ్చి చేరుతోంది. 2.69 లక్షల క్యూసెక్కుల ఔట్ ను దిగువకు విడుదల చేస్తున్నారు. నాగార్జునసాగర్ పూర్తి స్థాయి నీటి మట్టం 590 అడుగులు కాగా.. ప్రస్తుత నీటి మట్టం 585.30 అడుగులుగా ఉంది. పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలు కాగా.. మిగతా2లో...

## 77 వయస్సులో ఇంజినీరింగ్ మాస్టర్స్ డిగ్రీ

2

మరిన్ని తాజా వార్తల కోసం స్కాన్ చేయండి

## ఐదుగురు ఐపీఎస్‌లకు డీజీలుగా పదోన్నతి




**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో సీనియర్ ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. ఐదుగురికి డీజీలుగా పదోన్నతి ఇస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్ సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి, ఇంటెలిజెన్స్ అదనపు డీజీ శివధర్రెడ్డి, జైళ్ల శాఖ డీజీ సౌమ్య మిశ్రా, తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయల్, అభిలాష బిస్త్‌కి డీజీలుగా పదోన్నతి కల్పించారు. మిగతా2లో...

## మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

### కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి విధి విధానాలపై అధ్యయనం

- చైర్మన్ గా మంత్రి ఉత్తమ్,
- సభ్యులుగా పొంగులేటి, దామోదర రాజనర్సింహ



**విశ్వంభర, హైదరాబాద్:** కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీ కోసం మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటైంది. పౌరసఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్, దామోదర రాజనర్సింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సభ్యులుగా మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేశారు. ఇటీవల కేబినెట్ నిర్ణయం మేరకు సీఎస్ శాంతి కుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త రేషన్ కార్డులు, హెల్త్ కార్డుల జారీకి అర్హతలు, విధివిధానాలను మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేయనుంది. రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు వేర్వేరుగా ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. రేషన్ కార్డుల కోసం వార్షికాదాయం, భూ పరిమితి తదితర అంశాలపై సబ్ కమిటీ అధ్యయనం చేయనుంది.



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 75 | రిటైల్ ₹ 97 |
| స్కిన్ ₹ 141 | స్కిన్ లెస్ ₹ 160 |

## బయో బిటుమెన్ మిశ్రమంతో రోడ్లు



- రూ.10వేలకోట్ల వరకు ఆదా చేయాలని లక్ష్యం
- ప్రపంచంలోనే అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ భారత్‌ది
- వెల్లడించిన కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ..!

2



10

## నాటి హీరోలు అడవులను కాపాడితే.. నేడు నరికేస్తున్నారు: పవన్ కళ్యాణ్

# 77 వయస్సులో ఇంజినీరింగ్ మాస్టర్స్ డిగ్రీ

**విశ్వంభర, హైదరాబాద్:** ఆయన వయసు 77 ఏళ్లు.. ట్రిపుల్ ఐటీ హైదరాబాద్లో పనిచేస్తూ ఇటీవల ఇంజినీరింగ్లోమాస్టర్స్ డిగ్రీ చేసి చదువుకు వయసుతో పనిలేదని నిరూపిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లోని గుడివాడకుచెందిన ఎస్. లక్ష్మీనరసింహ శాస్త్రి ఈ ఘనతను సాధించారు. ట్రిపులటీలో కార్యనిర్వఇంజినీర్ గా గతంలో పదవీవిరమణ పొందిన ఆయనను అనంతరం కూడా కొనసాగిస్తున్నారు. ఓవైపు విధులు నిర్వహిస్తూనే అక్కడే ఎంఎస్ పూర్తిచేశారు. 'ఎర్త్ క్వేక్ ఇంజినీరింగ్'లో పరిశోధన పత్రాన్ని సమర్పించి జులై నెలలో పట్టా అందుకున్నారు. ట్రిపుల్ ఐటీ ఆలోచన నుంచి ప్రారంభంవరకూ శాస్త్రి ఇంజనీర్ గా విధులు నిర్వహించారని.. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన భవనాలు,ప్రయోగశాలలను నిర్మించడంలో కీలకపాత్ర పోషించారని ప్రశంసిస్తూ ట్రిపుల్టీ హైదరాబాద్అధికారులు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. విజయవాడలో సివిల్ ఇంజినీరింగ్ డిప్లొమా పూర్తిచేసిన ఆయన విజయవాడ, కర్నూలులలో విధులు నిర్వహించాక హైదరాబాద్కు వచ్చారు.1998లో నాటి ఉమ్మడి ఏపీ సీఎం చంద్రబాబు అభ్యర్థన మేరకు ట్రిపుల్ఐటీ నిర్మాణ బాధ్యతలను చేపట్టారు. ట్రిపుల్ఐటీ హైదరాబాద్ చిహ్నంలో మర్రి చెట్టు ఉండాలని శాస్త్రి ప్రతిపాదించారు.విధుల్లో ఉంటూనే మరింత చదవాలన్న ఆసక్తితో రెండేళ్ల క్రితం మాస్టర్స్ డిగ్రీలో చేరి ఉత్తీర్ణులయ్యారు.

## నాగార్జున సాగర్‌కు వరద ఉద్ధృతి

**(మొదటి పేజీ తరువాయి)**
ప్రస్తుత నీటి నిల్వ 298.30 టీఎంసీలుగా నమోదైంది.

**కూలిపోయిన సుంకిశాల రిటెయినింగ్ వాల్..**

నాగార్జునసాగర్ వద్ద సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలిపోయింది. ఆగస్టు 1న జరిగిన ఈ ఘటనను అధికారులు గోప్యంగా ఉంచారు. కార్మికులు షిఫ్టు మారే సమయంలో ఈ ఘటన జరగడంతో పెను ప్రమాదం తప్పింది. సుంకిశాల రిటెయినింగ్ వాల్ కూలడంతో పంప్ హౌస్ క్షణాల్లో జల దిగ్బంధమైంది. హైదరాబాద్లో తాగునీటి అవసరాల కోసం సుంకిశాల పథకం చేపట్టారు. సొరంగాల్లోకి జలాలు రాకుండా రక్షణగా రిటెయినింగ్ వాల్ నిర్మించారు. సాగర్ జలాశయం డెడ్ స్టోరేజీ నుంచి జలాల తరలింపునకు సుంకిశాల పథకం చేపట్టారు.

## దండం పెట్టిన ధన్‌ఖడ్

**(మొదటి పేజీ తరువాయి)**
మధ్య వాగ్వాదం జరిగింది. విపక్ష సభ్యులను ఓదార్చే క్రమంలో చైర్మన్ జగదీప్ కొంత అసహనానికి గురయ్యారు. ఆ సమయంలో ఆయన తన చైర్ నుంచి లేచి.. సభ్యులకు దండం పెట్టి, సభ నుంచి వాకౌట్ అయ్యారు.సాధారణంగా విపక్షాలు వాకౌట్ చేస్తుంటే, చైర్‌లో కూర్చుండే చైర్మన్ జగదీప్.. ఇవాళ విన్నూత రీతిలో విపక్ష సభ్యులపై తన ఆక్రోశాన్ని చూపించారు. కాంగ్రెస్ ఎంపీ జయరాం రమేశ్ నవ్వుతున్న తీరును ధన్‌కర్ తప్పుపట్టారు. నీ ప్రవర్తన నాకు తెలుసన్నారు. చైర్ పట్ల గౌరవం లేకుండా వ్యవహరిస్తున్నట్లు చెప్పారు. తనను కాదు.. చైర్‌పర్సన్ పోస్టును ఛాలెంజ్ చేస్తున్నారని, చైర్‌లో కూర్చున్న వ్యక్తి సమర్థుడు కాదన్న ఉద్దేశంతో విపక్ష సభ్యులు వ్యవహరిస్తున్నట్లు ధన్‌ఖడ్ ఆరోపించారు. జైరాం రమేశ్ దిక్కుకు చూస్తూ.. ఇప్పుడు తనకు ఆప్షన్ లేదని, ఇవాళ జరుగుతున్న పరిణామాలను గమనిస్తుంటే, ఇక్కడ కూర్చునే స్థితిలో తాను లేనట్లు అనిపిస్తోందని జగదీప్ తెలిపారు. ఆ తర్వాత లేచి నిలబడ్డ ఆయన, చేతులు జోడించి దండం పెట్టి, సభ నుంచి వాకౌట్ చేశారు. మళ్లీ కాసేపయ్యాక వచ్చిన ధన్ ఖడ్.. సభలో వాతావరణం ఆమోదయోగ్యంగా లేదన్నారు. తనకు తాను ఆత్మపరిశీలన చేసుకున్నానని, ఆ తర్వాతే ఫ్లోర్ లీడర్ల భేటీకి పిలుపు ఇచ్చినట్లు చెప్పారు.

## హైదరాబాద్‌లో ఛార్లెస్ స్క్వాబ్


**(మొదటి పేజీ తరువాయి)**
త్వరలోనే తమ ప్రతినిధి బృందాన్ని హైదరాబాద్కు పంపించనున్నట్లు తెలిపింది. ఈ కంపెనీ విస్తరణతో ఆర్థిక సేవల రంగంలోనూ హైదరాబాద్ ప్రపంచం దృష్టిని ఆకర్షించనుంది.

## నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన తొండ గ్రామవాసి గొలుసుల వెంకటేష్



**విశ్వంభర, సూర్యాపేట:** సూర్యాపేట జిల్లా, తిరుమలగిరి మండలం, తొండ గ్రామానికి చెందిన గొలుసుల వెంకటేష్ ఒకేసారి నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలిచారు. ఇందులో రెండు గెజిటెడ్ స్థాయి ఉద్యోగాలు కావడం గమనార్హం. ఇటీవలే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ప్రకటించిన ఫలితాల్లో వెంకటేష్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ), పాలిటెక్నిక్ లెక్చరర్, అసిస్టెంట్ ఇంజనీర్, గ్రూప్-4 కు ఎంపికై పలువురికి స్ఫూర్తిగా నిలిచారు. ఓ వైపు ఒక ప్రభుత్వ ఉద్యోగ నియామక పోటీ పరీక్షల కోసం చదువుతూ వివిధ ప్రైవేట్ సంస్థల్లో సివిల్ సైట్ ఇంజనీర్ గా పని చేశారు. కష్టపడి చదువుతూ నీటిపారుదల (I& CAD) శాఖలో కొలువు సాధించారు. వెంకటేష్ తిరుమలగిరి మండల కేంద్రంలోని శ్రీవాణి విద్యామందిర్ లో ప్రాథమిక విద్య, హైస్కూల్ విద్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివాడు. బీటెక్, ఎం.టెక్ సివిల్ ఇంజనీర్ విద్యను హైదరాబాద్‌లోని మల్లారెడ్డి ఇంజనీరింగ్ కాలేజీ, ఎం.టెక్ మర్రి లక్ష్మణ్ రెడ్డి కాలేజీల్లో పూర్తి చేశాడు. ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో తల్లిదండ్రులు గొలుసుల వసంత, కొండయ్య, భార్య మానస, సోదరుడు మహేష్, తొండ గ్రామస్తులు వెంకటేష్‌ను అభినందించారు.

# కంచు మోగించిన భారత్



**(మొదటి పేజీ తరువాయి)**
దీంతో ఈ ఒలింపిక్స్‌లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది. తొలి క్వార్టర్స్ లో ఇరు జట్లు గోల్ చేయలేకపోయాయి. రెండో క్వార్టర్ ఆరంభంలో (18వ నిమిషం) స్పెయిన్ ఆటగాడు మార్క్ మిరల్లెస్ పెనాల్టీ స్ట్రోక్‌న్ను గోల్ గా మార్చాడు. దీంతో ఆ జట్టు ఆధిక్యంలోకి వెళ్లింది. 29వ నిమిషంలో భారత్కు పెనాల్టీ కార్నర్ లభించింది. దానిని హర్మన్ ప్రీత్ గోల్ గా మలిచేందుకు ప్రయత్నించినా స్పెయిన్ గోల్ కీపర్ అడ్డుకున్నాడు. వెంటనే మరో పెనాల్టీ కార్నర్ లభించగా భారత్ దానిని సద్వినియోగం చేసుకుంది. ఈ సారి హర్మన్ ప్రీత్ ఎలాంటి పొరపాటు చేయకుండా బంతి గోల్ పోస్ట్‌కి పంపి స్కోరును 1-1తో సమం చేశాడు. మూడో క్వార్టర్ మొదలైన కాసేపటికే పెనాల్టీ కార్నర్తో హర్మన్ ప్రీత్ మరో గోల్ చేశాడు. దీంతో భారత్ 2-1తో ఆధిక్యంలోకి వెళ్లింది. తర్వాత మూడు పెనాల్టీ కార్నర్లు సాధించిన ఇండియా వాటిని మలచలేకపోయింది. మ్యాచ్ మరో నిమిషంలో ముగుస్తుందనగా స్పెయిన్కు ఓ పెనాల్టీ కార్నర్ లభించింది. భారత గోల్ కీపర్ శ్రీజేశ్ దానిని అద్భుతంగా అడ్డుకున్నాడు. 60వ నిమిషంలో ప్రత్యర్థికి మరో పెనాల్టీ కార్నర్ రాగా.. సద్వినియోగం చేసుకోలేకపోయింది. ఇలా 52 ఏళ్ల తర్వాత ఒలింపిక్స్‌లో వరుసగా రెండుసార్లు కాంస్య పతకం సాధించి పూర్వ వైభవాన్ని కొనసాగించే ప్రయత్నం చేసింది.దీంతో ఈ ఒలింపిక్స్లో భారత్ పతకాల సంఖ్య నాలుగుకు చేరింది.

**ఉద్వేగానికి గురైన శ్రీజేశ్...**

ఈ మ్యాచ్ అంతర్జాతీయ కెరీర్కు ముగింపు పలికిన శ్రీజేశ్ భారత్ గెలిచిన అనంతరం ఉద్వేగానికి గురయ్యాడు. ఆనందంతో గోల్ పోస్టు ఎక్కి సంబరాలు చేసుకున్నాడు. భారత కెప్టెన్ హర్మన్ ప్రీత్ సింగ్ అతడిని తన భుజాలపై ఎత్తుకుని మైదానమంతా కలియ తిరిగాడు. ఇతర ఆటగాళ్లు కూడా శ్రీజేశను అభినందించారు.

**ఆధునిక ఒలింపిక్స్ లో భారత్ విజయాల పరంపర..**

ఆధునిక ఒలింపిక్స్ మొదలైన తర్వాత 1928 అమ్‌స్టర్డమ్ ఒలింపిక్స్లో తొలిసారి స్వర్ణం సాధించిన భారత హాకీ జట్టు.. తన జైత్ర యాత్రను అలాగే కొనసాగించింది. లాస్ఏంజెల్స్ (1932), బెర్లిన్ (1936), లండన్ (1948), హెల్సింకీ (1952), మెల్బోర్న్ (1956) విశ్వక్రీడల్లో బంగారు పతకాలు కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. రోమ్ (1960)లో రజతం, టోక్యో (1964)లో మళ్లీ స్వర్ణం సాధించింది. మెక్సికో సిటీ (1968), మ్యూనిక్ (1972) లోనూ కాంస్యంతో సరిపెట్టుకుంది.చివరిసారిగా మాస్కో (1980) ఒలింపిక్స్లో పసిడి పతకాన్ని సాధించిన భారత్.. అనంతరం హాకీలో భారత్ ప్రాభవాన్ని కోల్పోయింది. నాలుగు దశాబ్దాల తర్వాత మళ్లీ టోక్యో(2020)లో మెరిసి కాంస్యం కైవసం చేసుకొని భారత హాకీకి మళ్లీ ఊపిరి పోసింది. తాజా పారిస్ ఒలింపిక్స్లోనూ దూకుడు కొనసాగించినప్పటికీ సెమీస్ లో బోల్తా పడింది. చివరకు మరోసారి కాంస్యంతో హాకీ ఆనందాన్ని నింపింది.

# హైదరాబాద్‌లోకి బంగ్లాదేశీయులు?

**విశ్వంభర, హైదరాబాద్:** బంగ్లాదేశ్ లో నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో పెద్దఎత్తున ఆ దేశీయులు హైదరాబాద్ నగరంలోకి ప్రవేశిస్తున్నారనే సమాచారంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. బాలాపూర్, కాటేదాన్, మైలార్దేవ్‌పల్లి, పహడీషరీఫ్, ఫలక్నుమా తదితర ప్రాంతాలలో పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. కొంతమంది అనుమానితులను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. గతంలో అధిక సంఖ్యలో నగరానికి అక్రమంగా వలస వచ్చిన రోహింగ్యాలు, బంగ్లాదేశీయులు చిరువ్యాపారులుగా, పరిశ్రమలు, భవన నిర్మాణరంగంలో కార్మికులుగా పనిచేస్తూస్థానికంగా స్థిరపడ్డారు. పలువురు వీలుచిక్కినప్పుడల్లా అక్రమంగా బంగ్లాకు వెళ్లి వస్తున్నట్లు పోలీసు ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. ఇటీవల వారి రాకపోకలు ఎక్కువ కాగా పోలీసులు అప్రమత్తమయ్యారు. హైదరాబాద్ సహా పలు ప్రాంతాలకు చాలాకాలంగా బంగ్లాదేశ్ నుంచి పలువురు అక్రమంగా వస్తున్నారు. రెండు నెలల క్రితం కోల్కతా నుంచి ఖమ్మం చేరిన బంగ్లాదేశకు చెందిన ఐదుగురు మైనర్లను.. బాల కార్మికులను గుర్తించే 'ఆపరేషన్ ముస్కాన్'లో పట్టుకున్నారు. వారంతా భవన నిర్మాణ కార్మికులుగా పనిచేస్తున్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఓ స్వచ్ఛంద సంస్థ సహాయంతో ఆదేశానికి పంపారు. కాగా ఇటీవల సికింద్రాబాద్లో ఓ మైనర్ సహా ఐదుగురు పట్టుబడ్డారు. వారిని అరెస్టు చేసిన పోలీసులు ఎందుకొచ్చారని ప్రశ్నించగా.. చాంద్రాయణగుట్టలో ఉన్న తమ బంధువులు రప్పించినట్లు చెప్పారు. వీరిని అరెస్ట్ చేసినట్టు తెలియగానే వారిని రప్పించిన బంధువులు అజ్ఞాతంలోకి వెళ్లినట్లు సమాచారం.

**దళారులుగా మారుతున్న బంగ్లాదేశీయులు**

ఇప్పటికే అక్రమంగా చేరిన బంగ్లాదేశీయులు కొందరు దళారులుగా మారుతున్నారు. పహడీషరీఫ్, మైలార్దేవ్‌పల్లి, కాటేదాన్, బాలానగర్ తదితర ప్రాంతాల్లోని ప్రైవేటు పరిశ్రమల్లో పనిచేసేందుకు తమవారిని నగరానికి రప్పిస్తున్నారు. అక్రమంగా సరిహద్దు దాటించి రైళ్లలోకి చేర్చేంతవరకూ బంగ్లాదేశ్,పశ్చిమబెంగాల్ లోని ఏజెంట్లు ఈ దళారులకు సహకరిస్తారు. దీనికి ప్రతిఫలంగా ఒక్కొక్కరికీ రూ.5-6 వేల వరకు కమీషన్ ఇస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్ నుంచి మాల్దా ద్వారా సరిహద్దు దాటి కోల్కతా చేరవేస్తారు. అక్కడ నకిలీ ఆధార్, ఓటరు గుర్తింపు కార్డులను తయారుచేసి వీరికిస్తారు. పోలీసులకు చిక్కబోమనే ధీమా వచ్చాక కోల్ కతా నుంచి రైలుమార్గంలో తెలంగాణకు తరలిస్తున్నట్లు ఇటీవల పట్టుబడిన నిందితులు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు సమాచారం. ఇలా గత రెండేళ్లలో 1000 మందికి పైగా బంగ్లా నుంచి అక్రమంగా వచ్చి ఉండొచ్చని పోలీసులు అంచనా వేస్తున్నారు. తాజా పరిణామాల నేపథ్యంలో వారంతా ఎక్కడున్నారు? వారిని తీసుకొచ్చిన దళారులు ఎవరో తెలుసుకునే పనిలో పోలీసులున్నారు.

## బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య కన్నుమూత



**విశ్వంభర, కోల్ కతా:** పశ్చిమ బెంగాల్ మాజీ సీఎం బుద్ధదేవ్ భట్టాచార్య (80) గురువారం ఉదయం తుదిశ్వాస విడిచారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోన్న ఆయన కోల్కతాలోని తన నివాసంలో కన్నుమూశారు. ఈమేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్ సలీం వెల్లడించారు. భట్టాచార్య 2000-2011 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆయనకు భార్య, కుమారుడు సుచేతన్ ఉన్నారు.
సీపీఎంలో నిర్ణయాధికార విభాగం పొలిట్బ్యూరోలో కీలకంగా వ్యవహరించారు. కమ్యూనిస్టు యోధుడు జ్యోతి బసు తర్వాత 2000 సంవత్సరంలో బెంగాల్ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 2011లో జరిగిన ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని ప్రభుత్వం అధికారాన్ని కోల్పోయింది. 34 ఏళ్ల కమ్యూనిస్టు రూల్ కు ప్రస్తుత ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ చెక్ పెట్టింది. దీంతో క్రమంగా భట్టాచార్య ప్రజాజీవితం నుంచి దూరమయ్యారు. కొన్ని సంవత్సరాలుగా ఆయన ఆరోగ్యం సరిగా లేదు. చూపు మందగించింది. ఊపిరితిత్తుల వ్యాధితో బాధపడుతున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలతో కొంతకాలంగా చికిత్స పొందుతున్నారు. బుద్ధదేవ్ కోల్కతాలోని ప్రెసిడెన్సీ కాలేజ్ పూర్వ విద్యార్థి. ఆయన పూర్తిస్థాయిలో రాజకీయాల్లోకి అడుగుపెట్టేముందు ఉపాధ్యాయుడిగా పనిచేశారు. 1977లో తొలిసారి కాశిపుర్-బెల్గాచియా నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అంచలంచెలుగా తన వృత్తి జీవితంలో ఎదిగిన బుద్ధదేవ్.. జ్యోతిబసు ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2001, 2006లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీని విజయ తీరాలకు చేర్చారు. ఆయన అత్యంత సాధారణ జీవితాన్ని గడిపారు. బాలీగంజ్లోని చిన్న ఇంట్లోనే నివసించేవారు. సీఎంగానూ అక్కడి నుంచే విధులు నిర్వర్తించారు. ఇప్పుడు అక్కడే తుదిశ్వాస విడిచారు.

# ఆమె రాక మరింత ఆలస్యం

**(మొదటి పేజీ తరువాయి)**
విల్మోర్ జూన్ 6న బోయింగ్ స్టార్‌లైనర్ క్యాప్సుల్లో అంతరిక్ష కేంద్రానికి (ఐఎస్ఎస్) వెళ్లిన సంగతి తెలిసిందే. వాస్తవానికి జూన్ 14వ తేదీన వీరిద్దరూ భూమికి తిరుగుపయనం కావాల్సి ఉండగా.. వ్యోమనౌకలో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఆ సాంకేతిక సమస్యను ఇంకా సరిదిద్దకపోవడంతో గత రెండు నెలలుగా వీరిద్దరూ ఐఎస్ఎస్ లోనే ఉండిపోయారు. ఈ క్రమంలోనే వ్యోమగాముల రాకపై నాసా బుధవారం ఓ అప్డేట్ ఇచ్చింది. "బోయింగ్ స్టార్‌లైనర్ తిరిగి భూమ్మీద ల్యాండ్ అయ్యేందుకు సురక్షితంగా లేకపోతే.. వ్యోమగాములను తీసుకొచ్చేందుకు ఎంచుకున్న ఆప్షన్లలో ఒకటి 2025 ఫిబ్రవరిలో ఉంది. అది కూడా స్పేస్ఎక్స్ క్రూ డ్రాగన్ వ్యోమనౌకతో.." అని నాసా పేర్కొంది. దీన్నిబట్టి చూస్తుంటే సునీత , విల్మోర్ మరో ఎనిమిది నెలల పాటు ఐఎస్ఎస్లోనే ఉండే అవకాశాలు కన్పిస్తున్నాయి. వారిని తీసుకొచ్చేందుకు నాసా అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. స్పేస్ క్రూ-9 మిషన్లో భాగంగా ఇద్దరు వ్యోమగాములతో క్రూ డ్రాగన్ను పంపించే అవకాశాలున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరులో ఈ ప్రయోగం ఉండొచ్చని సమాచారం. ఈ వ్యోమనౌకతో వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సునీత, విల్మోర్ను భూమ్మీదకు తీసుకురావాలని నాసా భావిస్తున్నట్లు సమాచారం. అయితే, స్టార్‌లైనర్లోనే వారిని తీసుకురావాలా? లేదా క్రూ డ్రాగన్ను ఉపయోగించాలా? అన్నదానిపై వచ్చే వారం నాసా నిర్ణయం తీసుకోనున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. వ్యోమగాములు అంతరిక్ష కేంద్రంలో సురక్షితంగానే ఉన్నారని, వారికి కావాల్సిన సౌకర్యాలు ఉన్నాయని నాసా తెలిపింది. అయితే, ఇలా ఎక్కువ రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉంటే వీరికి అనారోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా.. సునీతా విలియమ్స్ కు ఇది ముచ్చటగా మూడో రోదసి యాత్ర. గతంలో ఆమె 2006, 2012లో ఐఎస్ఎస్కు వెళ్లారు. మొత్తం 50 గంటల 40 నిమిషాల పాటు స్పేస్వాక్ నిర్వహించారు. 322 రోజుల పాటు అంతరిక్షంలో గడిపారు. ఐఎస్ఎస్లో ఓసారి మారథాన్ కూడా చేశారు. ఈసారి అంతరిక్ష కేంద్రంలోకి వెళ్లగానే ఆమె ఆనందంతో డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ అయ్యింది.

# బయో బిటుమెన్ మిశ్రమంతో రోడ్లు..

**న్యూఢిల్లీ:** రోడ్ల నిర్మాణంలో 35శాతం వరకు బయో బిటుమెన్ మిశ్రయం ఉపయోగించనున్నట్లు కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. దాంతో ప్రభుత్వం రూ.10వేలకోట్ల వరకు ఆదా చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. పెట్రోలియం ఆధారిత బిటుమెన్‌లో 35శాతం వరకు లిగ్నిన్‌ను కలిపేందుకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందని.. ఇందులో ఎక్కువ భాగం ఇతరదేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. బిటుమెన్ అనేది ముడి చమురు నుంచి వెలువడిన నల్లటి పదార్థం. రోడ్లతో పాటు పైకప్పులను నిర్మించేందుకు విస్తృతంగా ఉపయోగిస్తారు. రాజ్యసభలో ఓ ప్రశ్నకు గడ్కరీ సమాధానం ఇస్తూ.. ప్రపంచంలోనే అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ భారత్‌ది అని తెలిపారు. 90శాతం వరకు బిటుమెన్ వినియోగిస్తున్నట్లు తెలిపారు. 2023-24లో 88 లక్షల టన్నుల వినియోగం ఉందని.. 2024-25లో 50శాతం వరకు దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు. వార్షిక దిగుమతి నుంచి రూ.25వేల నుంచి రూ.30వేల కోట్లు ఉంటుందని చెప్పారు. రైతులు ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయడంతో పాటు ఇంధన ఉత్పత్తిదారులుగా మారుతున్నారని తెలిపారు. సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సిఆర్ఆర్ఐ), ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం డెహ్రాడన్ వరిగడ్డి నుంచి బయో బిట్‌మిట్‌ను అభివృద్ధి చేశాయని చెప్పారు. వరిగడ్డిని దహనం చేస్తుండడంతో ఢిల్లీలో వాయు కాలుష్యం ఇబ్బందికరంగా మారుతుందన్నారు. టన్ను వరిగడ్డి పొట్టు నుంచి 30శాతం వరకు బయో బిటుమెన్, 350 కిలోల బయో గ్యాస్ వస్తుందన్నారు. బయో బిటుమెన్‌ను తారుగా మార్చడం విజయవంతమైందన్నారు. దాంతో రూ.10వేలకోట్ల విదేశీ మారకద్రవ్యం ఆదా అవుతుందన్నారు. పేటెంట్ కోసం ఇప్పటికే దరఖాస్తును సమర్పించామన్నారు. పెట్రోలియం ఆధారిత తారు కిలో రూ.50 పలుకుతుందన్నారు. బయో మాస్‌తో తయారు చేసిన బిటుమెన్ ధర కిలో రూ.40కే వస్తుందన్నారు. పానిపట్‌లో వరి గడ్డితో రోజుకు లక్ష లీటర్ల ఇథనాల్‌ను తయారు చేసే ప్రాజెక్ట్‌ను ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు ఉందని తెలిపారు. రోజుకు 150 టన్నుల బయో బిటుమెన్, సంవత్సరానికి 88వేల టన్నుల బయో ఏవియేషన్ ఇంధనం సైతం తయారు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మనకు 450 ప్రాజెక్టులు ఉన్నాయని.. గడ్డిని బయో సీఎన్‌జీగా మారుతున్నామని.. లిగ్నిన్‌ను సైతం పొందుతున్నామన్నారు. ఈ 450 ప్రాజెక్టులు హర్యానా, పంజాబ్, పశ్చిమ ఉత్తరప్రదేశ్‌లో ఉన్నాయని.. ఇక్కడ బయోమాస్ (స్టబుల్) బయో-సీఎన్‌జీగా మారుస్తుందని.. లిగ్నిన్ లభిస్తుందన్నారు. దాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. ఆర్డర్లు సైతం ఇస్తున్నామన్నారు. దిగుమతులను తగ్గించడంతో పాటు వాయు కాలుష్య సమస్యను సైతం పరిష్కరించబోతుందన్నారు. రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా చాలా పర్యావరణ అనుకూల నిర్ణయాలు తీసుకుందని.. ఫ్లై యాష్‌ని సైతం వినియోగిస్తున్నట్లు తెలిపారు.

## వినేశ్ ఫోగాట్‌ను రాజ్యసభకు నామినేట్ చేయాలి

**ఢిల్లీ:** పారిస్ ఒలింపిక్స్ రెజ్లింగ్ ఫైనల్కు చేరిన వినేశ్ ఫోగాట్ పతకం సాధిస్తుందని గంపెడంత ఆశతో ఎదురుచూసిన భారతీయులకు 'అనర్హత' రూపంలో షాక్ తగిలింది. ఈ క్లిష్ట సమయంలో ఆమెకు దేశమంతా అండగా నిలిచింది. హరియాణా మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత భూపిందర్ సింగ్ హుడా ఒక అడుగు ముందుకు వేసి, ఆమెను రాజ్యసభకు నామినేట్ చేయాలన్నారు.అలాగే ఆయన కుమారుడు దీపిందర్ సింగ్ హుడా కూడా ఇదే తరహాలో స్పందించారు. "ఫైనల్కు చేరిన వినేశ్ ఆట నుంచి వైదొలగాల్సి వచ్చినప్పటికీ.. కోట్లాది మంది ప్రజల హృదయాలను గెల్చుకున్నారు. క్రీడా వ్యవస్థ ఓడిపోయింది. బంగారు పతక విజేతలకు ఇచ్చే సౌకర్యాలనే ఆమెకు కల్పించాలి. ధైర్యం, స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన ఆమే ఈ పదవికి తగిన వ్యక్తి" అని దీపిందర్ హుడా అన్నారు.దీనిపై వినేశ్ పెదనాన్న మహవీర్ ఫొగాట్ స్పందించారు. "మరి భూపిందర్ సింగ్ హుడా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గీతా ఫొగాట్ (మహవీర్ కుమార్తె)ను ఎందుకు రాజ్యసభకు పంపలేదు..?" అని ప్రశ్నించారు.ఒలింపిక్స్ ఫైనల్లో అనర్హతకు గురైన భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ రెజ్లింగ్కు రిటైర్మెంట్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఎక్స్లో పోస్టు చేసింది. మీద గెలిచి గా నేను ఓడిపోయాను. నన్ను క్షమించండి. మీ కల, నా ధైర్యం విచ్ఛిన్నమయ్యాయి. ఇక పోరాడే బలం లేదు. మీ అందరికి ఎప్పటికీ రుణపడి ఉంటా" అని పేర్కొంది. పారిస్ ఒలింపిక్స్లో ఫైనల్ చేరిన వినేశ్.. అనూహ్య రీతిలో అదనపు బరువుతో అనర్హతకు గురికావడం ఆమెపై తీవ్ర ప్రభావం చూపింది.ఇదిలా ఉంటే.. రాజ్యసభలో ఖాళీ అయిన 12 స్థానాలకు సోమవారం ఉప ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 14న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు ఈ నెల 21 తుది గడువు. సెప్టెంబర్ 3న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 వరకూ పోలింగ్ జరగనుంది. అదే రోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# సుంకిశాల పాపం బీఆర్ఎస్‌దే



**విశ్వంభర, హైదరాబాద్:** సుంకిశాల బీఆర్ఎస్ హయాంలోనే నిర్మించారని, వాటి డిజైన్లు సైతం లోపభూయిష్టంగా ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మండిపడ్డారు. అది తాము కట్టించింది కాదని, ఉన్నది లేనట్టు లేనిది ఉన్నట్టు భ్రమలు సృష్టించి బీఆర్ఎస్ ప్రభుత్వ తప్పిదాలు తమపై వేయాలని చూస్తున్నారని ధ్వ జమెత్తారు. బీఆర్ ఎస్ తమపై బురదజల్లే ప్రయత్నం చేస్తుందని, వాటిని ప్రజలు క్షమించరని అన్నారు. సుంకిశాలపై విచారణ చేసి వివరాలు అందజేయాలని అధికారులకు స్పష్టం చేశామన్నారు. టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం అనంతరం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మీడియా సమావేశంలో మాట్లాడారు. గురువారం కూలినగోడ గత బీఆర్ ఎస్ హయాంలో కట్టించినదేనని స్పష్టం చేశారు. సుంకిశాల నిర్మాణంతో ప్రజల సొమ్మును వృథా చేశారని ఆయన ఆరోపించారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల మాత్రమే కాదని, బీఆర్ ఎస్ కృష్ణా నదిని కూడా వదిలిపెట్టలేదు అని ఆగ్రహం వ్యక్తంచేశారు. అంతకుముందు జీహెచ్ఎంసీ పరిధిలో ఉన్న విద్యుత్ శాఖ ఎస్పీడీసీఎల్ సీఎండీ, డైరెక్టర్స్, ఎస్సీలు, ఏడీలతో సమావేశం నిర్వహించామని చెప్పారు.
హైదారాబాద్ మహా నగరంలో అనేక సంస్థలు పెట్టుబడులు పెట్టేందుకు వస్తుంటాయని, వాటికి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని భట్టి ఆదేశించామన్నారు. నగర ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా కొనసాగించేలా ముందుకు వెళ్లాలని అధికారులకు స్పష్టం చేశామని తెలిపారు. వర్షాకాలంలో భారీ వర్షాలు, వరదల కారణంగా స్తంభాలు పడిపోవడం, చెట్లు కూలిపోయే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించామని తెలిపారు.
విద్యుత్ శాఖలో పదోన్నతులపై చర్యలు చేపట్టాలని సీఎండీలను ఆదేశించామని భట్టి తెలిపారు. విద్యుత్ శాఖలో గత ఏడెనిమిది ఏళ్లుగా పదోన్నతులు లేవని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని చెప్పామని వివరించారు. అనేక అంతర్జాతీయ సంస్థలు వస్తుంటాయని, వాటికి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని ఆదేశించామని తెలిపారు. వినియోగదారుల కోసమే నిరంతరం విద్యుత్ సిబ్బంది పని చేస్తున్నారని, విద్యుత్ సమస్యలు తలెత్తితే 1912 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణమే విద్యుత్ శాఖ స్పందిస్తుందన్నారు.
సుంకిశాల ప్రాజెక్టు బీఆర్ఎస్ హయాంలోనే చేపట్టారు కానీ సాగర్‌లో నీళ్లు వచ్చినందునే గోడ కూలిందని ఆరోపిస్తున్నారు. నీళ్ల కోసమే కదా సాగర్ కట్టింది అని చెప్పారు . గత ప్రభుత్వ ప్రాజెక్టు డిజైన్లు ఎంత లోపభూయిష్టంగా ఉన్నాయో దీని ద్వారా అర్థమవుతోందన్నారు . మీ కట్టడాలు, మీ పాలన ఏ రకంగా ఉందో స్పష్టంగా అర్థమవుతోంది. సుంకిశాల ప్రా జెక్టు మేం కట్టింది కాదు, మా హయాంలో చేపట్టిన ప్రాజెక్టు కాదు. మేడిగడ్డతో పాటు సుంకిశాల పాపం మీకే చెందుతుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు.



# సమాచార హక్కు వికాస సమితిలో నియామకాలు

## సమాచార హక్కు వికాస సమితి రాష్ట్ర కార్యదర్శిగా కొదుమూరి దయాకర్ రావు

**విశ్వంభర, హైద్రాబాద్ :** సమాచార హక్కు చట్టం -2005 ప్రజలందరికీ అవగాహన పెంచేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి అవినీతి రహిత పాలన, ప్రజా పాలన ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అర్హులు పొందాలని, ఆ దిశగా నియామకం అయిన సభ్యులు కృషి చేయాలని సమాచార హక్కు వికాస సమితి గౌరవ అధ్యక్షులు డాక్టర్ కాచం సత్యనారయణ, వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ యర్రమాధ కృష్ణారెడ్డితెలిపారు. గురువారం నాడు హైద్రాబాదు, చైతన్యపురి లోని రాష్ట్ర కార్యాలయంలో వికాస సమితి రాష్ట్ర కార్యదర్శిగా కోదుమూరి దయాకర్ రావు, కేవీ రంగారెడ్డి జిల్లా కమిటీ కార్యదర్శిగా వంగవీటి శ్రీనివాస్ రావు, అబ్దుల్లాపూర్ మెట్ మండల కమిటీ కార్యదర్శిగా ఎన్నమల్ల శ్రీకాంత్ లను నియామకం చేసి వారికి నియామకం పత్రాలు,గుర్తింపు కార్డులను అందజేశారు. సమాచార హక్కు వికాస సమితి ప్రజా సమస్యల పరిష్కారానికి, భూముల సమస్యల పరిష్కారానికి, పరిష్కార మార్గాలను ఫోన్ ద్వారా సంప్రదించిన వారికి ఉచితంగా సలహాలు ఇస్తున్నట్టు ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని, చట్టంపై అవగాహన పెంచుకోవాలని కోరారు. సమాచార హక్కు చట్టం అమలులోకి వచ్చిన అక్టోబర్ 12న హైద్రాబాద్ లో భారీ అవగాహన సదస్సును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఆసక్తి కలవారు సభ్యులుగా చేరడానికి ఈ నెంబర్ కు 9949649766 కాల్ చేయాలని అన్నారు.

# మహిళా సంఘాల డబ్బులు కాజేసిన ఎస్బీఐ సీఎస్పీ నిర్వాహకుడు

- రూ.35 లక్షలలో రూ.30 లక్షలు రికవరీ
- మహిళల డబ్బులకు డోకా లేదంటున్న ఐకేపీ అధికారిణి

**చిట్యాల, విశ్వంభర:** సమభావనా సంఘాల మహిళల డబ్బులను ఎస్ బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ (సీఎస్పీ) నిర్వాహకుడు కాజేసిన సంఘటన చిట్యాలలో జరిగింది. పొదుపు సంఘాల బాధ్యులు డబ్బులను తమ సంఘాల రుణ ఖాతాలలో జమ చేయమని సెంటర్ నిర్వాహకునికి ఇవ్వగా అతను వారికి సాదారణ రశీదును ఇచ్చి అట్టి డబ్బులను జమ చేయకుండా తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం వాడుకున్నాడు. ఇలా దాదాపు సంవత్సర కాలంగా దాదాపు యా.30 లక్షల వరకు సొంతానికి వాడుకున్నాడు. ఈ విషయం వారం క్రితమే బ్యాంకు అధికారులకు, ఐకేపి అధికారులకు తెలిసినప్పటికి వారు ఆ విషయాన్ని గోప్యంగా ఉంచి ఆ నిర్వాహకుని నుండి డబ్బులు రికవరీ చేస్తున్నారు. అలా అతను సంవత్సర కాలంగా డబ్బులను దుర్వినియోగం చేస్తున్నప్పటికి అటు బ్యాంకు, ఇటు ఐకేపీ అధికారులు గుర్తించలేకపోయారు. చిట్యాల్ ఏసిటీ సమీపంలో చౌటుప్పల్కు చెందిన ఓ వ్యక్తి ఎస్బీఐ సీఎస్పీ నిర్వాహణ ఏజెన్సీ ద్వారా ఎంపిక కాబడి సీఎస్ పీని నిర్వహిస్తున్నాడు. ఎస్బీఐలో చిన్నచిన్న లావాదేవీలను చేసే వారు ఈ సెంటర్ ద్వారా తమ లావాదేవీలు జరుపుకుంటారు. అలాగే మహిళా సంఘాల సభ్యులు తమ పొదుపు డబ్బులు ఈ ఏజెన్సీ ద్వారా తమ సంఘంలో జమ చేయటం, రుణాలకు సంబంధించిన చెల్లింపుల వంటివి ఈ సెంటర్ ద్వారా నిర్వహిస్తారు. ఇటీవల ఓ సంఘానికి సంబంధించిన సభ్యురాలు తమకు లోను కావాలని బ్యాంకుకు వెళ్లగా మీరు గతంలో తీసుకున్న లోను డబ్బులు చెల్లించనందున లోను ఇవ్వటం కుదరదని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో ఆమె ఆ సంఘం అధ్యక్షురాలికి విషయం తెలుపగా ఆమె తాను క్రమం తప్పకుండా సీఎస్పీలో డబ్బులు చెల్లిస్తున్నట్లు బ్యాంకు అధికారులకు తెలిపింది. దీంతో అప్రమత్తమైన ఐకేపీ, బ్యాంకు అధికారులు సీఎస్పీ ఏజెన్సీ ద్వారా ఆ సెంటర్ నిర్వాహకున్ని విచారించటంతో అతను అసలు విషయాన్ని ఒప్పుకున్నాడు. ఎస్బీఐలో 145 సంఘాలు ఉండగా పిట్టంపల్లి, పెద్దకాపర్తి, ఆనుగూడెం గ్రామాలలోని 35 సంఘాలకు సంబంధించిన దాదాపు రూ.30 లక్షలు వాడుకున్నట్లు ఒప్పుకున్నాడు. దీంతో అతని అతని వద్ద నుండి కొంత డబ్బులను రికవరీ చేసినప్పటికి ఎంత అనేది ధృవీకరించలేదు. దుర్వినియోగం అయిన డబ్బులు కూడ ఇంకా ఎక్కువ ఉండవచ్చునని తెలుస్తుంది. రూ. లక్ష లోపు ఉన్న డబ్బులను ముందుగా సంబంధిత సంఘాలకు జమచేస్తున్నట్లు ఐకేపీ అధికారులు తెలిపారు.

**సంఘాల డబ్బులకు డోకా లేదు : పద్మ**

ఐకేపీ ఏపీఎం మహిళా సంఘాల సభ్యులు తాము చెల్లించిన డబ్బులకు ప్రూఫ్ ఉంటే ఇప్పటికి వరకు దుర్వినియోగం అయినట్లు గుర్తించిన డబ్బులను ఆ సంఘాల ఖాతాలలో జమ చేస్తున్నామని, తదుపరి కూడ ఎవరి డబ్బులైనా దుర్వినియోగం అయినట్లు ఆదారాలతో చూపిస్తే ఆ డబ్బులకు బ్యాంకు బాధ్యత వహిస్తుందని ఆమె వివరించారు.

# బీఆర్ఎస్ నేతల కళ్లు మండుతున్నాయి

- ముఖ్యమంత్రి అమెరికా పర్యటనతో రాష్ట్రానికి ప్రయోజనాలు
- సుంకిశాల పై సమగ్ర విచారణకు అదేశించాం దోషులు ఎవరైనా వదిలిపెట్టం..
- బీఆర్ఎస్ తప్పులను ప్రజల ముందుంచుతాం: మంత్రి పొన్నం ప్రభాకర్

**విశ్వంభర, హనుమకొండ:**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విదేశాలకు వెళ్లి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకువస్తుంటే బీఆర్ ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు రైతు వేదికలో గురువారం రైతుల అవగాహన సదస్సులో పాల్గొన్న మంత్రి పొన్నం, అనంతరం మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ప్రయోజనాల కోసం రాష్ట్ర ఉన్నత అధికారులతో కలిసి ముఖ్యమంత్రి విదేశాలకు వెళ్తే, బీఆర్ ఎస్ నాయకులు సీఎం కుటుంబపరమైన అంశాలను తీసుకువచ్చి ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. గత పదేళ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రానికి పెట్టుబడులు తేవడానికి ఒక్కసారి కూడా విదేశాలకు వెళ్లలేదని, ఈ



విషయమై బీఆర్ఎస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకోవాలని మంత్రి పొన్నం పేర్కొన్నారు. బీఆర్ఎస్ అనుకూల పత్రికలో సుంకిశాల గోడ విరిగిపడిందని, దానితో లింకు పెడుతూ తమ ప్రభుత్వాన్ని బద్నాం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సుంకిశాల బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పిదమని, దీనిపై సమగ్ర విచారణకు ఆదేశిస్తున్నామని పేర్కొన్నారు. బాధ్యులు ఎవ రైనా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలన వైఫల్యాలను తమ ప్రభుత్వం సరి చేసుకుంటూ వస్తుంటే, గులాబీ నాయకులు ఓర్వలేక తమపై బట్టకాల్చి మీద వేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతిపక్షంగా బీఆర్ఎస్ నిర్మాణాత్మక సలహాలిస్తే స్వీకరిస్తాం కానీ బట్టకాల్చి మీద వేస్తే చూస్తూ ఊరుకునే ప్రభుత్వం తమది కాదని మంత్రి పొ న్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ కానీ వారి పక్షాన బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని నిలదీయాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అంటున్నారని, కేంద్ర బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం జరిగితే మాట్లా డడం చేతగాని కేంద్రమంత్రి ఆ యన అని ఎద్దేవా చేశారు. రైతులకు రుణమాఫీ కాకపోతే లోపాలను సవరణ చేసుకునే అవకాశం రైతులకు ఇస్తున్న ప్రభుత్వం తమదని గుర్తుంచుకోవాలన్నారు.

బిఆర్ఎస్ డిఫెన్స్ లో పడి అసెంబ్లీ లో గిరిజన మహిళా సీతక్క అని చూడకుండా పోస్టులు పెట్టారని తెలిపారు. శాసనసభలు సరైన జవాబులు చెప్పలేక బిఆర్ఎస్ పారిపోయిందని పేర్కొన్నారు. స్పీకర్ దళితుడనే అధ్యక్ష అనాల్సి వస్తుందనే దొర తనంతో అసెంబ్లీ కి రాలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న గ్యారంటీల్లో 200 యూనిట్ల ఉచిత విద్యుత్,500 కి గ్యాస్ రాని వారి వివరాలు సమర్పించి ఎడిట్ చేసుకోవాలని సూచించారు. 2 లక్షల రైతు రుణమాఫీ ఒకేసారి చేస్తున్నామని ఇప్పటి వరకు లక్ష 50 వేల వరకు రుణమాఫీ పూర్తైందన్నారు. రైతులకు రుణమాఫీ వర్తించని వారు వివరాలు వ్యవసాయాధికారులకు ఇవ్వాలన్నారు. ఒక్క భిమదేవరపల్లి మండలంలోని లక్ష రూపాయల లోపు రుణమాఫీ కోసం 21 కోట్లు రూపాయలు విడుదలయ్యాయన్నారు. పార్లమెంట్ లో సున్నా సీట్లు వచ్చినందునే బిఆర్ఎస్ నేతలు అసహనంతో మాట్లాడుతున్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా రుణమాఫీ తెలంగాణ లో అమలు చేశామని తెలిపారు. నిర్మాణాత్మక సలహాలు ఇస్తే స్వీకరిస్తమన్నారు.

### మహాత్మా గాంధీ మెమోరియల్

# ప్లాజా సందర్శన



**ఢల్లాస్:** అమెరికాలోని టెక్సాస్‌లోని డల్లాస్‌లోని అతిపెద్ద 'మహాత్మా గాంధీ మెమోరియల్ ప్లాజా'ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు డి. శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డిలుసందర్శించారు. ఫ్రిస్కో, డల్లాస్‌లోని హోటల్ హయత్ రెసిడెన్సీలో జరిగిన "సిఎమ్‌ల ఆత్మీయ సమ్మేళన్ విత్ డల్లైట్స్"కు హాజరయ్యారు. ఈ కార్యక్రమాలలో ఇమ్మ పాస్ట్ ఛైర్మన్ ,మాజీ ఎస్‌డిజి ఎర్ బి బ్రహ్మ రెడ్డి, ఎంజిఎంఎఫ్ వ్యవస్థాపకుడు & 'తానా' మాజీ అధ్యక్షుడు డాక్టర్ ప్రసాద్ తోటకూర పాల్గొన్నారు.

# ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తున్నారు

- స్పీకర్ హక్కులపై అఖిలేష్ వ్యాఖ్యలు
- నిప్పులు చెరిగిన అమిత్ షా



**దిల్లీ:** పార్లమెంట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే లోక్ సభలో కేంద్రమంత్రి అమిత్షా , సమాజ్వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ మధ్య మాటలయుద్ధం నడిచింది. స్పీకర్ హక్కులకు భంగం కలిగిస్తున్నారంటూ అఖిలేశ్ చేసినవ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారి తీశాయి."లోక్సభ స్పీకర్ ఓం బిర్లా హక్కులతో పాటు ప్రతిపక్ష ఎంపీల హక్కులను కాలరాస్తున్నారు. మీ (స్పీకర్) హక్కులను లాక్కొంటున్నారు. మీ తరపున మేము పోరాడేందుకు సిద్ధంగా ఉన్నాం" అని అఖిలేశ్ యాదవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దీనిపై స్పందించిన అమిత్ షా ఆయన వ్యాఖ్యలను ఖండించారు. ఇది సభాపతిని అవమానించడమే అంటూ నిప్పులు చెరిగారు. స్పీకర్ హక్కులకు ప్రతిపక్షాలు పరిరక్షకులు కాదంటూ మండిపడ్డారు."సభలో అఖిలేశ్ యాదవ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నా. ఇది స్పీకర్ పదవిని అవమానించడమే అవుతుంది. ప్రతిపక్ష ఎంపీలు స్పీకర్ హక్కుల పరిరక్షకులు కాదు. మీరు ఇలాంటి వ్యాఖ్యలు చేయకండి" అంటూ షా ధ్వజమెత్తారు. అనంతరం ఇదే అంశంపై స్పీకర్ ఓం బిర్లా స్పందించారు. స్పీకర్ను ఉద్దేశించి ఎటువంటి వ్యాఖ్యలు చేయకూడదంటూ అఖిలేశ్కు సూచించారు. కాగా.. కేంద్ర ప్రభుత్వం లోక్సభలో వక్ఫ్ చట్టం సవరణ బిల్లును ప్రవేశపెట్టింది. సభలో చర్చ ప్రారంభించారు.






# ప్రజాభిమానమే పెట్టుబడిగా రాజకీయాల్లో ఎదిగిన

# యోధుడు బుద్ధదేవ్ భట్టాచార్య

బుద్ధదేవ్ భట్టాచార్య 1944 మార్చి 1న ఉత్తర కోల్‌కతాలో బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. ఆయన తాత కృష్ణచంద్ర స్మృతితీర్థ స్వస్థలం ప్రస్తుత బంగ్లాదేశ్‌లోని మదరిపూర్ జిల్లా. ఆయన గొప్ప సంస్కృత పండితుడు, రచయిత. ఆయన పురోహిత్ దర్పణ్ అనే అర్చక మాన్యువల్‌ను సిద్ధం చేశారు. ఇది పశ్చిమ బెంగాల్‌లోని బెంగాలీ హిందూ పూజారులలో ప్రసిద్ధి చెందింది. బుద్ధదేవ్ తండ్రి నేపాల్‌చంద్ర అర్చకత్వంలోకి ప్రవేశించకుండా.. హిందూ మతపరమైన వస్తువులను విక్రయించడానికి అంకితమైన కుటుంబ ప్రచురణ సరస్వత్ లైబ్రరీలో కొనసాగారు.భట్టాచార్య శైలేంద్ర సిర్కార్ విద్యాలయ పూర్వ విద్యార్థి. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ కాలేజీలో బెంగాలీ సాహిత్యాన్ని అభ్యసించారు. బెంగాలీలో బీఏ పూర్తి చేసి.. డమ్ డమ్‌లోని ఆదర్శ శంఖ విద్యా మందిర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేరారు కొద్ది రోజుల పాటు ఉపాధ్యాయుడిగా పనిచేసిన అనంతరం 1966 కమ్యూనిస్ట్ పార్టీ సభ్యత్వం తీసుకున్నారు. బెంగాల్‌లో జరిగిన ఆహార ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు.1968లో వియత్నాం ఉద్యమానికి మద్దతు ఇచ్చారు. 1968లో యువజన విభాగం అయిన డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత డెమోక్రటిక్ యూత్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాలో విలీనమైంది. 1981 వరకు అందులోనే కొనసాగారు.

**కమ్యూనిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగిన నాయకుడు..**

దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆయన సీపీఎం ముఖ్య నేతల్లో ఒకరిగా ఎదిగారు. పార్టీ సీనియర్ నేత ప్రమోద్ దాస్ గుప్తా మార్గదర్శకత్వంలో పనిచేశారు. 1972లో సీపీఐఎం రాష్ట్ర కమిటీకి ఎన్నికయ్యారు. 1982లో రాష్ట్ర సెక్రటేరియట్‌లో చేరారు. 1984 నుంచి పార్టీ కేంద్ర కమిటీకి నిత్య అతిథిగా ఉన్నారు. 1985లో కేంద్ర కమిటీ సభ్యుడిగా.. 2000 నుంచి పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశారు. మొదటిసారి 1977 ఎన్నికల్లో కాశీపూర్-బెల్గచియా స్థానం నుంచి ఎమ్మెల్యేగా విజయం సాధించి అసెంబ్లీలో అడుగుపెట్టారు. ఆతర్వాత రాజకీయాల్లో అంచెలంచెలుగా ఎదిగారు. మొదటి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన తర్వాత, భట్టాచార్జీ 1977 నుండి 1982 వరకు సమాచార, పౌర సంబంధాల మంత్రిగా పనిచేశారు.1982 ఎన్నికల్లో స్వల్ప తేడాతో భట్టాచార్య ఓడిపోగా.. తర్వాత సీపీఐ(ఎం) కేంద్ర కమిటీలో శాశ్వత సభ్యుడిగా నియమితులయ్యారు. 1982లో కాసిపోర్ స్థానం నుంచి ఓడిపోయిన తర్వాత, భట్టాచార్య జాదవ్‌పూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి వెళ్లి 1987 ఎన్నికల్లో జాదవ్‌పూర్ నుంచి గెలిచి.. 2011 వరకూ అదే స్థానానికి ప్రాతినిధ్యం వహించారు.1987లో జ్యోతిబసు క్యాబినెట్‌లో సమాచార, సాంస్కృతిక శాఖ మంత్రిగా చేరారు. అతను బసుతో విభేదాల కారణంగా 1993లో రాజీనామా చేశారు. అయితే కొన్ని నెలల తర్వాత తిరిగి చేరారు. జ్యోతిబసు క్యాబినెట్‌లో పలు శాఖలకు మంత్రులుగా పనిచేసిన సీనియర్ నేత.. 1999లో డిప్యూటీ సీఎం అయ్యారు. 2000లో అనారోగ్యం వల్ల జ్యోతిబసు సీఎం పదవికి రాజీనామా చేయడంతో ఆయన స్థానంలో పగ్గాలు చేపట్టారు. 2002లో సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరోకు ఎన్నికయ్యారు.2001, 2006 ఎన్నికల్లో పార్టీని విజయం దిశగా నడిపించారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించి సీఎంగా పని చేశారు.

**పారిశ్రామీకరణవైపు అడుగులు..**

బెంగాల్‌లో పెట్టుబడులు, ఉద్యోగాల కల్పనకు పరిశ్రమలను తీసుకువచ్చేందుకు ప్రత్యేక డ్రైవ్‌ను ప్రారంభించారు. పారిశ్రామీకరణకు సీపీఎం వ్యతిరేకం అన్న ప్రచారాన్ని తిప్పికొడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికరంగంలో పరుగులు తీయించారు. ఆయన ప్రభుత్వ హయాంలోనే పశ్చిమ బెంగాల్ ఐటీ, సేవల రంగంలో పెట్టుబడులు పెట్టింది. కోల్‌కతా సమీపంలోని సింగూర్ గ్రామంలోనే ప్రపంచంలోనే అత్యంత చౌకైన టాటా నానో కారు ప్రాజెక్టుకు ఆహ్వానం పలికారు. జిందాల్ గ్రూప్ నుంచి పశ్చిమ బెంగాల్ మేదినిపూర్ జిల్లా



సాల్బోనిలో అతిపెద్ద ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్‌ను తీసుకువచ్చారు. అలాగే, నందిగ్రామ్‌లో రసాయన కేంద్రం తీసుకువచ్చేందుకు ప్రతిపాదనలు చేశారు. నానోప్లాంట్, నందిగ్రామ్ రసాయన ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఉద్యమాలు జరగ్గా.. ఆ తర్వాత జరిగిన పరిణామాల నేపథ్యంలో 2011లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో బెంగాల్‌లో కమ్యూనిస్ట్ పార్టీ 34 ఏళ్ల సుదీర్ఘ పాలనకు మమతా బెనర్జీ ముగింపు పలికారు.నందిగ్రామ్‌లో భూసేకరణకు వ్యతిరేకంగా చేపట్టిన ఉద్యమాన్ని మమతా బెనర్జీ ముందుండి నడిపించి.. వామపక్షాలపై అద్భుత విజయానికి బాటలు వేసుకున్నారు. భట్టాచార్య నాయకత్వంలోనే కమ్యూనిస్ట్ పార్టీ ఎన్నికల్లో పోటీచేసి దారుణ పరాజయాన్ని మూటగట్టుకుంది. తృణమూల్ కాంగ్రెస్ ఆ ఎన్నికల్లో విజయం సాధించడంతో కమ్యూనిస్ట్‌ల శకం ముగిసింది. తృణమూల్ కాంగ్రెస్ ఆ ఎన్నికల్లో విజయం సాధించడంతో కమ్యూనిస్ట్‌ల శకం ముగిసింది. భట్టాచార్య విస్తృత పెట్టుబడిదారీ వ్యతిరేక విధానాలకు భిన్నంగా, వ్యాపారానికి సంబంధించి సాపేక్షంగా బహిరంగ విధానాలకు ప్రసిద్ధి చెందాడు. అయితే, భట్టాచార్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, తీవ్ర భూసేకరణ నిరసనలు, నిరసనకారులకు సంబంధించిన ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఇది 2011 ఎన్నికల్లో భట్టాచార్య ఓడిపోవడానికి దారితీసింది.భద్రలోక్‌గా (పెద్దమనిషి) పిలుచుకునే బుద్ధదేవ్ భట్టాచార్య 'వ్యవసాయం మన పునాది.. పారిశ్రామీకరణ మన భవిష్యత్తు' ఆయన ఉద్దేశాలు ప్రగతిశీలమైనవే అయినప్పటికీ.. నాటి ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో 34 ఏళ్ల సుదీర్ఘ సీపీఎం పాలనకు ముగింపు పలికాయి.

**క్రియాశీల రాజకీయాలకు దూరంగా..**

ఓటమి తర్వాత క్రమంగా క్రియాశీల రాజకీయాలకు ఆయన దూరంగా ఉంటూ వచ్చారు. 2011 ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ చేతిలో ఓడిపోయిన బుద్ధదేవ్ 2015లో సీపీఎం వయోభారం రీత్యా పార్టీ అత్యున్నత విభాగం పొలిట్ బ్యూరో, సెంట్రల్ కమిటీ నుంచి వైదొలిగారు. ఆ తర్వాత 2018లో రాష్ట్ర సచివాలయ సభ్యత్వాన్నికూడా వదులుకున్నారు.

1972 నుంచి రాజకీయాల్లో ఒక్కో మెట్టూ ఎక్కుతూ బెంగాల్‌లో కమ్యూనిస్టుల మార్క్‌ను కొనసాగించారు. జ్యోతిబసు తర్వాత 11 ఏళ్లపాటు ముఖ్యమంత్రి పదవిలో అధికకాలం కొనసాగింది బుద్ధదేవ్ భట్టాచార్య మాత్రమే. అలాగే జ్యోతిబసు తర్వాత రెండవ, చివరి సీపీఎం ముఖ్యమంత్రి కూడా ఆయనే. రాష్ట్ర హోమ్ మంత్రి, ముఖ్యమంత్రి వంటి కీలక పదవులు చేపట్టినా చివరి వరకు భార్య మీరు, కుమార్తె సుచేతనాలతో కలిసి దక్షిణ కోల్‌కతాలోని బల్లిగంజ్ ప్రాంతంలో ఒక చిన్న రెండు గదుల ప్రభుత్వ అపార్ట్‌మెంట్లో సాధారణ జీవనాన్ని గడిపారు. 2000 సంవత్సరంలో పార్టీ సీనియర్ నేత జ్యోతిబసు నుంచి బద్ధదేవ్ బెంగాల్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నారు.

**పద్మభూషణ్‌ను తిరస్కరించిన భట్టాచార్య**

2022లో కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మభూషణ్ పురస్కారం ప్రకటించింది. కానీ, బుద్ధదేవ్ భట్టాచార్య ఆ పురస్కారాన్ని తిరస్కరించారు.''పద్మభూషణ్ పురస్కారం గురించి నాకేమీ తెలియదు. దాని గురించి నాకు ఎవరూ చెప్పలేదు. నాకు ఒకవేళ వాళ్లు ఆ అవార్డు ఇస్తే, దానిని తిరస్కరిస్తా'' అని ఆయన అన్నారని సీపీఎం నేత సీతారాం ఏచూరీ అప్పుడు చెప్పారు.

**న్యూమోనియా బారిన పడి కన్నుమూత..**

గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. శ్వాసకోస సమస్యతో తరుచూ అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చేరుతున్న ఆయన.. గతేడాది న్యూమోనియా బారినపడి వెంటిలేటర్‌పై చికిత్స తీసుకున్నారు. కానీ, వైద్యుల ప్రయత్నాలు ఫలించి ఆయన కోలుకుని, ఆరోగ్యంగా ఇంటికి చేరుకున్నారు. అప్పటి నుంచి ఇంటికే పరిమితమైన బుద్ధదేవ్.. బుధవారం ఉదయం కోల్‌కతాలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. దీంతో బెంగాల్ రాజకీయాల్లో ఒక అధ్యాయం ముగిసింది.

**ప్రజాభిమానంగల నేత..**

అందరూ విద్యార్థి దశ నుంచి రాజకీయాలు చేశామని చెబుతారు. కానీ, బుద్ధదేవ్ మాత్రం ఉపాధ్యాయుడిగా ఉంటూ రాజకీయ అరంగేట్రం చేశారు. అది కూడా.. కరడుగట్టిన కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చారు. వాస్తవానికి సంప్రదాయ బెంగాలీ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఆయన కమ్యూనిస్టుగా మారిన తర్వాత.. ఆ సంప్రదాయాలకు దూరమయ్యారు.అత్యంత వినయశీలి, విధేయుడిగా పార్టీ కోసం పనిచేశారు. ఆ సొంతం కమ్యూనిస్టు యోధుడిగా పేరు తెచ్చుకున్న బుద్ధదేవ్.. మితభాషి. కానీ, చేతల్లో మాత్రం ఆయన దూకుడుగా ఉండేవారు. ప్రపంచీకరణ విధానాలకు కమ్యూనిస్టులు వ్యతిరేకంగా. ప్రపంచ బ్యాంకు రుణాలకు కూడా వారు వ్యతిరేకం. జ్యోతి బసు తర్వాత పశ్చిమ బెంగాల్ పాలనను అందిపుచ్చుకున్న ఆయన.. ఎంత తగ్గి జీవించాలో.. ఈ ప్రపంచానికి నేర్పించారు. "కమ్యూనిస్టుగా కంటే.. కర్షకుడిగా జీవించడం చాలా ఇష్టం" అని హేతువాద దృక్పథాన్ని ప్రకటితం చేసిన బుద్ధదేవ్.. సాగులో అనేక సంస్కరణలు తీసుకువచ్చారు.నిజానికి కమ్యూనిస్టు పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు కత్తిమీద సాము చేయాల్సి ఉంటుంది. ఇతర రాష్ట్రాల్లో మాదిరిగా నిర్ణయాలు తీసుకోలేరు. ఇతరులను సమర్థించనూ లేరు. కానీ, బుద్ధదేవ్ మాత్రం దీనిని చాలా సవాల్‌గా తీసుకున్నారు. జ్యోతి బసు వారసత్వాన్నినిలబెడుతూ.. తన దైన పంథాను ఏర్పా టు చేసుకున్నారు. అయితే.. ఈ పంథాలో ఏర్పడిన చిన్నపాటి లోటు పాట్లు తర్వాత కాలంలో మమతా బెనర్జీకి కలిసి వచ్చాయి. ఫలితంగా ఆమె అక్కడ పట్టు సాధించేందుకు అవకాశం ఏర్పడింది.

**వేతనం ఎంతైనా సరే.. పార్టీకే..**

ఇక, ముఖ్యమంత్రిగా బుద్ధదేవ్ తీసుకున్న వేతనం ఎంతైనా సరే.. పార్టీకి వెళ్లిపోయింది. ఆయనకు పార్టీ నుంచి అప్పట్లో 3200 రూపాయలు వేతనంగా లభించేది. దానినే ఆయన తీసుకునేవారు. ఫుల్ టైమర్‌గా పార్టీకి సేవలందించారు. ముఖ్యమంత్రిగా భారీ కాన్వాయ్‌లు ఆయన పెట్టుకునేవారు కాదు. కేవలం రెండు కార్లు, నలుగురు సిబ్బందితో ఆయన పాలనను సాగించారు. ప్రస్తుతం ఉన్న ఇల్లు కూడా డబుల్ బెడ్ రూం వంటిదే. ఒకే ఒక్క ఇల్లు. ఆయనకు ఎక్కడా ఆస్తులు లేవు. విల్లాలు, ప్యాలెస్‌లు అసలే లేవు. 34 ఏళ్ల పార్టీ సేవలో ఆయనకు దక్కింది.. ప్రజాభిమానం మాత్రమే.

-పి.వెంకటరమణ గుప్త,
6304475133

# భక్తితత్వంలో పరవశించిన

# గజల్ కవిత్వం

సరస భావన, చమత్కార ఖేలన, ఇంపు, కుదింపు గజల్ జీవ లక్షణాలనిచెప్పారు డాక్టర్ సింగిరెడ్డి నారాయణ రెడ్డి. ఉర్దూ పారసీ భాషల్లో విశేష ఆదరణ పొందిన గజల్ ప్రక్రియను తెలుగులో కొత్త పుంతలు తొక్కించిన కవులు అనేకులు ఉన్నారు. గజల్ అనే పదానికి 'ప్రియురాలితో సల్లాపం' అనే ఒక అర్థం ఉన్నది. సాధారణంగా గజళ్లు శృంగారం,విరహం, నాయికా నాయకుల ప్రణయం తదితర అంశాలు వస్తువుగా కలిగి ఉంటాయి. కానీ వీటికి బదులుగా గజళ్ళలో భక్తి తత్వాన్ని ప్రవేశపెట్టి నూతన ఒరవడి సృష్టించారు ద్యావరి నరేందర్ రెడ్డి.

ప్రేమ, విరహం, శృంగారం తో పాటు ఇటీవల కాలంలో సామాజికాంశాల ఇతివృత్తంతో కూడా అనేక గజళ్ల సంపుటాలు వచ్చాయి. కానీ పూర్తిస్థాయి భక్తి గజళ్ల సంపుటిగా నాకు తెలిసినంతవరకు తెలంగాణలో తొలి సంపుటి నరేందర్ రెడ్డి 2019లో రాసిన శ్రీ వెంకటేశం.

తాండూరుకు చెందిన వృత్తిరీత్యా ఆంగ్ల ఉపాధ్యాయుడైన నరేందర్ రెడ్డి కేవలం గజల్ మాత్రమే కాక రుబాయిలు, రెక్కలు, శతకాలు, గేయాలు, మినీ కవిత్వం, సినిమా పాటలు ఇత్యాది అనేక ప్రక్రియల్లో రచనలు చేయడం గమనార్హం. శ్రీ అయ్యప్ప స్వామి శతకం, అమృత వర్షిణి శతకం, హంసధ్వని, శ్రీలక్ష్మి నరసింహ శతకం, గీతామృతం శతకం, శ్రీ వెంకటేశ్వర శతకం మొదలైన గ్రంథాలతోపాటు శ్రీ వెంకటేశం, శ్రీ లక్ష్మీనారసింహం అనే రెండు భక్తి గజల్ సంపుటాలను వెలువరించారు. ఇష్ట సఖి, హృదయాంజలి, వినయ బాల శతకం, కోయిలమ్మ పదాలు, బాలల గేయాలు ముద్రణ రూపంలోకి రావలసి ఉంది. ఇటీవల కాలంలో సంచలనం సృష్టించిన విరాటపర్వం సినిమాలో రెండు పాటలు రెండు పద్యాలు రాశారు.

గజల్ నియమ పరంగా చూసినప్పుడు నరేందర్ రెడ్డి గజల్ లలో ఎక్కడ కూడా నియమోల్లంఘన కనిపించదు. ఈ ప్రక్రియ పై ఈ కవికి సాధికారత ఉంది అనడానికి గజల్ ధారాశుద్ధి నిదర్శనంగా నిలుస్తున్నది. సాహిత్య విద్యార్థులకు నూతనంగా గజల్ ప్రక్రియలో అడుగుపెట్టదలుచుకున్న కవులకు ఉపకరించే విధంగా శ్రీ లక్ష్మీ నారసింహం గ్రంథం మొదట్లోనే గజల్ ప్రక్రియ నియమావళిని చక్కగా పొందుపరిచారు.

ఇక గ్రంథంలోని అంశానికి వస్తే అడుగడుగునా శ్రీ లక్ష్మీనరసింహస్వామి పై భక్తి ఉత్తుంగ తరంగమై ఎగిసిపడుతుంది. తన మదికి అన్నివేళలా శాంతి కాంతి లక్ష్మీనరసింహుడే అంటాడు మొదటి గజల్లో. అంతులేని ప్రేమను కురిపించమని వేడుకుంటాడు.

నరసింహుని సన్నిధిని చేరుకోమని తన హృదయాన్ని కోరుకుంటూ అరిషడ్వర్గాలను జయించమని చెప్తాడు. అత్యాశను వదులుకోమని ద్వేషాన్ని విడిచిపెట్టమని సుజ్ఞాన గంధాన్ని నింపుకోమని హృదయానికి ఉపదేశించినా అది మానవాళికి కవి ఇస్తున్న సందేశంగా భావించవచ్చు.

భక్తితో తన్మయుడైన కవి నరసింహుడిని తన హృదయం మందిరంలో నిలుపుకొని మంగళకరమైన స్వరూపాన్ని తలుచుకుంటే తన తలపెట్టిన కార్యమంతా మంగళమే అవుతుంది అంటాడు. హరి నామం సేవించిన భక్తులు ధన్యులవుతారంటాడు. లక్ష్మీదేవి దీవెనల వల్ల తన జీవితంలో శుభం చేకూరినదని, అభయాస్తుడైన శ్రీమంతుడు శ్రీహరిని చూసినప్పుడు తనలోని భయం తొలగిపోతుందంటాడు. ఆరోగ్యం ఆనందం భక్తిలోనే పదిలమవుతాయి అంటాడు.

ఓ రామ నీ నామం ఎంతో రుచిరా అని భక్త రామదాసు గానం చేసినట్లు ద్యావరి నరేందర్ రెడ్డి కూడా అంతే తన్మయత్వంతో హరి నామాన్ని జపిస్తాడు.

- గుండెలోన అనునిత్యం ధ్వనించెను హరినామం
- రగులుతున్న వేదనలను
  కరిగించెను హరినామం
- మోములోన చిరునవ్వును
  చిగురించెను హరినామం
- గమ్యానికి దిక్సూచిగ కనిపించెను హరినామం
- అణువణువున ప్రేమ
  సుధలు ఒలికించెను హరినామం
- మొదలైన పాదాలు

ఈ కవి హరిభక్తికి నిదర్శనాలు.

శబరి భక్తితో రాముడికి ఎంగిలి పళ్ళు తినిపించిన చందంగా ఈ కవి భక్తి పారవశ్యంలో భగవంతుడిని తన స్నేహితుడిగా భావిస్తున్నాడు

ఇలలోన ఇద్దరికీ బంధమే కుదిరింది
చరితలో మన చెలిమి ప్రబంధం అవుతుంది
ఉత్సాహం నీవైతే వాడిపోదు మన బంధం
విశ్వాసం నీవైతే రాలిపోదు మన బంధం
వంటి షేర్లు ఈ సంపుటి
నిండా అనేకం కనిపిస్తాయి.

నరసింహనామం విజయం వైపు నడిపిస్తుంది అనడానికి జయం జయం అంటూ రాసిన గజల్ నిదర్శనంగా నిలుస్తుంది

భరతభూమి లోకములో
వేదాలకు నిలయమాయె
శుభ మస్త ని దీవించే శ్లోకాలకు జయం జయం
భగవన్నామ స్మరణ లో భాగంగా వినిపించే

శ్లోకాలు వేదాలకు నిలయమైన ఈ భరత భూమిలో జయం పొందాలన్న కవి ఆకాంక్ష ఈ గజల్లో కనిపిస్తుంది.

శివుని ఆజ్ఞ లేకుంటే చీమైనా కుట్టదు అని ఓ లోకోక్తి. అట్లాగే నరసింహుడి ఆజ్ఞ లేకపోతే ఏ కార్యమైనా వ్యర్థమవుతుందని బలంగా విశ్వసిస్తున్నారు కవి. అందుకే అహంకారాన్ని వదిలి అర్చించమని కోరుతాడు. క్షణికమైన మోహాన్ని విడిచిపెట్టాలని ఆకాంక్షిస్తాడు. అజ్ఞానుల గుంపుల నుండి వేరు చేయమని శరణు కోరుతాడు తన నడతను సరిదిద్దమని ప్రార్థిస్తాడు.

లక్ష్మీ నరసింహ స్వామి భక్తి సాహిత్యంలో ఎప్పుడూ చెప్పుకోదగిన కొటేషన్స్ గా నిలవగలిగే షేర్లు అనేకం ఈ గజల్ లలో కనిపిస్తాయి.

పూజకై హృదయమే పుష్పమై నిలవాలి
నా ఇంట విష్ణువే దీపమై నిలవాలి

వంటి పాదాలు భక్తి తత్వాన్ని ప్రకటించడమే కాక రెండుగా కవిత్వాన్ని కూడా నింపుకున్నాయి. భగవంతుని సాధారణంగా పుష్పాలతో అర్చిస్తాం. కానీ కవి హృదయాన్ని పుష్పంతో అభేదం చెప్పడం ఇక్కడ గమనించవచ్చు. చక్కని అలంకారిక సొగసు ఈ గజాలలో కనిపిస్తుంది అనడానికి పై షేర్ ఒక నిదర్శనం.

మానవసేవే మాధవసేవ అనే తత్వాన్ని ఈ కవి వంట పట్టించుకున్నారు. అందుకే జీవులలో దేవుడినే దర్శించే మనసు నాది అని ధైర్యంగాప్రకటించుకున్నాడు. మనంచేసే పనిలోనే భగవంతుడు ఉన్నాడని ఈ కవి విశ్వసిస్తాడు. అందుకే work is worship అనే ఆంగ్ల నానుడి లాగా కార్యాన్ని యజ్ఞంగా భావించే మనసు నాది అంటారు.

ఈ కవికి తాత్విక చింతన కూడా ఎక్కువ. భగవంతుని తన మనసు చేరుకోవాలని ఆరాటం ఈ గజళ్లలో స్పష్టంగా కనిపిస్తున్నది.

నీ తోడు కోరుకొని ఎంతయో వేచాను
దయతోడ నీ దరికి చేర్చుకో మనసారా
వంటి షేర్ లు ఇందుకు నిదర్శనాలు.

భగవంతుని అర్చిస్తూనే సామాన్య పాఠకులకు తమ జీవితాన్ని దిద్దుకోవడానికి కావలసిన అనేక సూక్తులను ఈ గజల్స్ ద్వారా అందించారు నరేందర్ రెడ్డి .

గొప్పలేవో చెప్పుకుంటూ
ఎగిసి పడితే అర్థరహితం
సౌఖ్యమేదో దుఃఖమేదో
తెలుసుకొనుట పరమధర్మం
అసహనంతో రగులుతుంటే
దైవకృపయే దరికి చేరదు
స్వార్థ గుణమే ఎదుగుతుంటే పుణ్యమంతా





తరిగిపోవును వంటి మాటలు అందరికీ ఆచరణ యోగ్యమైనవి.

వ్యక్తిత్వ వికాసానికి దోహదపడే అనేక షేర్లు ఈ గజల్స్ లో దర్శనమిస్తాయి. నిస్సత్తువ నిరాశలు దరిచేరనీయవద్దని, చేతలలో కార్యదీక్ష ఉండాలని, అజ్ఞానం తొలగిస్తే మేదస్సు వెలుగు అందుతుందని జ్ఞాన ధార జీవితాన్ని నడుపుతుందని, భగవంతుడి దయ వ్యక్తిత్వాన్ని నిలుపుతుందని చెప్పడంలో కవి పాఠకుల మూర్తిమత్వం సుసంపన్నం చేయడానికి ప్రయత్నించాడు.

శ్రీ లక్ష్మీనారసింహం గజల్ సంపుటిలో ఉన్న 60 గజళ్లలోనూ భగవంతునికి నివేదన భగవంతుని పట్ల ఆరాధన భగవంతుని ధ్యానించడం వంటి భక్తితత్వమే కనిపిస్తుంది కానీ పురాణాలలో భగవంతుని గాథలు వంటి చర్విత చర్వణాలు ఎక్కడ కనిపించవు. కవి తనదైన సొంత వ్యక్తిత్వాన్ని ఈ గజళ్లలో ఆవిష్కరించారు. చక్కని మంగళహారతి తో గజల్స్ ముగించడం కొసమెరుపు. గజల్ ను కూడా మంగళహారతిగా పాడుకోవచ్చు అని నరేందర్ రెడ్డి గారు నిరూపించారు. తెలుగు సాహిత్యంలో ఈ గజళ్లు ఓ కొత్త ప్రయోగం. భక్తి సాహిత్యానికి పద్యం శతకం పదం కీర్తన ఇచ్చేది అనేక ప్రక్రియలు ఉన్నా గజల్ లో కూడా భక్తి తత్వం భక్తి తత్వాన్ని చాటడం ఈ గజల్ సంపుటి ప్రత్యేకత.

ఉత్తరోత్తర నరేందర్ రెడ్డి కలం నుండి మరిన్ని గొప్ప గ్రంథాలు వెలువడుతాయని ఆశించడం అత్యాశ కాదు.



- సాగర్ల సత్తయ్య
7989117415

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

## నేడు అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవం

1982, ఆగస్టు 9న జెనీవాలో అటవీ వనరుల హక్కులకు సంబంధించిన సమస్యలపై 26 మంది స్వతంత్ర మానవ హక్కుల మేధావులతో వర్కింగ్ గ్రూప్‌ల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 140 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఆదివాసీల కోసం కూడా ఒక రోజు ఉండాలని ఐక్యరాజ్య సమితిని కమిటీ కోరగా, ఆదివాసీల సంరక్షణ చట్టాలకు ఐక్యరాజ్య సమితి ఆమోదం తెలిపింది. మేధావుల వర్కింగ్ కమిటీ 1992 నుండి పది సంవత్సరాల పాటు ప్రపంచ వ్యాప్తంగా తిరిగి ఆదివాసీల సమస్యలను సమగ్రంగా అధ్యయనం చేసి విశ్లేషించింది. . ఆదివాసుల హక్కుల పరిరక్షణ కోసం ఏటా ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని 1994లో ప్రకటించింది.ప్రపంచ వ్యాప్తంగా ఆదివాసీలు అంతరించి పోతున్న తరుణంలో వారి సంరక్షణ దిశగా ఐక్యరాజ్య సమితి చర్యలు చేపట్టింది.

1997లో గిరిజనులకు ప్రత్యేక చట్టాలు, హక్కులను కల్పిస్తూ, ప్రపంచ దేశాల ప్రతినిధులను తీర్మానానికి ఆహ్వానించింది. 143 ఐరాస సభ్యదేశాలు ఓటింగ్‌లో పాల్గొనగా 125 దేశాల ప్రతినిధులు తీర్మానాన్ని ఆమోదించారు. 14 మంది తటస్థ వైఖరి తెలపగా.. కేవలం నలుగురు వ్యతిరేకించారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఈ సనాతన ప్రజలను కాపాడవలసిన బాధ్యత మనపై ఉన్నది. అందుకు ప్రతి దేశం కొత్త చట్టాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం, తద్వారా జీవించే హక్కుతో సహా ఆధునిక మానవునికి గల అన్ని హక్కులూ వారికి ఇవ్వవలసి ఉన్నది' అని 1994 డిసెంబర్ 23న ఐక్కరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ 49/214 తీర్మానంలో పేర్కొన్నది. అప్పటి నుంచి గిరిజన హక్కులు, వారికి ప్రభుత్వాలు కల్పిస్తున్న రాయితీల గురించి అవగాహన కల్పించేందుకు ఏటా ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. బ్రతుకు పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడుతుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు కూడా లేవు. ప్రపంచంలో సుమారు ఏడు వేల భాషలు ఉంటే అందులో ఆదివాసీ తెగలు మాట్లాడే బాషలే నాలుగు వేలు ఉన్నట్లు రికార్డులు చెపుతున్నాయి. నేడు అత్యధికులు మాట్లాడే, వాడే ఆరు భాషలు గతంలో అంతరించి పోయిన ఆదివాసీ తెగలు వాడినవే.నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టూ, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, చత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు. మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వ ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారిపోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటికీ ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికీ పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి.

-రామ కిష్టయ్య సంగన భట్ల
9440595494



తెలంగాణా ముఖ్యమంత్రి సోదరుడు ఏనుముల తిరుపతి రెడ్డి జన్మదినం పురస్కరించుకొని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, ముఖ్యమంత్రి సోదరుడిని కలిసి శాలువాతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియ చేశారు. – విశ్వంభర, నార్కెట్‌పల్లి



అమెరికాలో టాక్స్ నగరంలో తెలంగాణ ఓవర్సీస్ కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి తో పాటు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు – విశ్వంభర, కామారెడ్డి




## కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచింది

**విశ్వంభర, మెట్పల్లి:** రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి పిలుపు మేరకు జగ్గసాగర్ రైతు రచ్చబండ కార్యక్రమం బీజేపీ నాయకులు నిర్వహించారు. మార్పు వస్తుందని నమ్మి ఓటు వేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచింది రైతు భరోసా రుణమాఫీ లాంటి హామీలు తుంగలో తొక్కి అన్నదాత బతుకు ఆగం చేసింది తెలంగాణ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ వారికి న్యాయం చేయడం కోసం బీజేపీ రుణమాఫీ కానీ, భరోసా కానీ రాని రైతుల వద్ద సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టింది. ఎద్దు ఏడ్చిన వ్యవసాయం రైతు ఏడ్చిన రాజ్యం బాగుపడినట్టు చరిత్రలో లేదు. అని జగిత్యాల జిల్లా రైతు మోర్చా అధ్యక్షుడు కోడి పెల్లి గోపాల్ రెడ్డి అన్నారు. జాతీయ రాష్ట్ర కిషన్ మోర్చా కార్యవర్గ సభ్యులు కేరళ రాష్ట్ర ఇంచార్జ్ మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ డిసెంబర్ 9 సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా రైతు భరోసా రుణమాఫీ పూర్తిగా చెల్లించి సోనియా గాంధీ పుట్టిన రోజు కానుక ఇస్తానన్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రైతులను మోసం చేసిందే కాక కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీని కూడా మోసం చేశారు అని అన్నారు. జగిత్యాల జిల్లా అధ్యక్షులు మొరపెల్లి సత్యనా రాయణ మాట్లాడుతూ తెలంగాణ రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేస్తున్నామని కాంగ్రెస్ సర్కారు 33 రకాల సాకులు చెప్పి రైతు నోట్లో మట్టి కొడుతుందని కుటుంబంలో ప్రభుత్వ ఉద్యోగి లేదా సర్వీస్ పింఛన్ ఉన్న చెల్లుబాటు కాదని పేరులో స్పెల్లింగ్ మిస్టేక్ ఉన్న చెల్లుబాటు కాదని ఆధార్ కార్డు లేకపోవడం ఇలా ఎన్నో రకాల సాకులు చూపి రుణమాఫీకి ఎగనామం పెడుతుందని రైతులు అన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతు బిడ్డలకు సున్నం పెట్టే పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందని విమర్శిస్తున్నారు. ఆరుగాలం వ్యవసాయం చేస్తే పండిన పంటకు గిట్టుబాటు రాక పేరుతో రైతులను మోసం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు రాజు పాల్ రెడ్డి మాట్లాడు తూ రైతు రెండు చేతులు మట్టిలోకి వెళ్తేనే ప్రజల నోటిలోకి 5 వెళ్ళు వెళ్తాయని అన్నదాతను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని అన్నారు. కార్యక్రమానికి బీజేపీ నాయకులు జగ్గాసాగర్ గ్రామ రైతులు పాల్గొన్నారు.

## 12లక్షల ఆర్థిక సహాయం



**విశ్వంభర, చింతపల్లి:** భారతీయ జనతా పార్టీ ఎస్సీ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు చింతపల్లి ఎస్సీ మోర్చా మండల అధ్యక్షులు ఏర్పుల యాదగిరి ఆధ్వర్యంలో చింతపల్లి డిప్యూటీ తహశిల్దార్ అర్షద్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మండల అధ్యక్షుడు శివర్ల రమేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం 2023 అసెంబ్లీ ఎన్నికల ముందు నేటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేవెళ్ల బహిరంగ సభలో ఎస్సీ డిక్లరేషన్ ప్రకటించడం జరిగిందన్నారు. షెడ్యూల్ కులాలకు ఉపాధి కల్పిస్తామని అన్ని రంగాలలో అవకాశాలు మేము అధికారంలోకి వచ్చిన 100 రోజుల లోపల డిక్లరేషన్ లో పొందుపరిచిన అన్ని హామీలను నూటికి నూరు శాతం అమలు చేస్తామని చెప్పి మోసపూరిత హామీలు, వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వారు ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చి నేటికీ ఎనిమిది నెలలు కావస్తున్నా ఎస్సీలకు ఎలాంటి హామీలు అమలు చేయకుండా నిద్ర మత్తులో ఉందని ఎద్దేవా చేశారు. ఇచ్చిన డిమాండ్లను అంబేద్కర్ అభయ హస్తం పథకం కింద ఎస్సీ కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందజేయాలని అదేవిధంగా ప్రభుత్వ అన్ని కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఇందిరమ్మ పక్క ఇళ్ల పథకం ద్వారా ఇండ్లులేని ప్రతి ఎస్సీ కుటుంబానికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం కోసం 6 లక్షల రూపాయలు అందించాలని బీజేపీ ఎస్సీ మోర్చా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ వినతి పత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించకపోతే బీజేపీ ఎస్సీ మోర్చా ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చ జిల్లా ఉపాధ్యక్షులు గాధరి జంగయ్య, ఓబీసీ సెల్ కార్యదర్శి వెన్నం శేఖర్, జిల్లా నాయకులు మసాని సైదులు, బీజేవైఎం మండల అధ్యక్షుడు శ్రీశైలం, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి గజ్జె అభినవ్, నీల కార్తీక్, శీరమోని రాజు, గంగల వెంకటయ్య, మొగిలమోని మల్లేష్, గడ్డి మహేందర్ పాల్గొన్నారు.

## విధులను బహిష్కరించిన మెట్‌పల్లి న్యాయవాదులు



**విశ్వంభర, మెట్‌పల్లి:** జగిత్యాల జిల్లా మెట్‌పల్లి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు పుప్పల లింబాద్రి ఆధ్వర్యంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా లింబాద్రి మాట్లాడుతూ సిరిసిల్ల, జనగామ పోలీస్ స్టేషన్లలో న్యాయవాదులపై పోలీసుల దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజలకు న్యాయం చేయవలసిన పోలీసులు, న్యాయవాదుల మధ్య సయోధ్య ఉంటేనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా జిల్లా వ్యాప్తంగా పోలీసులు న్యాయవాధులపై దాడులు జరుగుతున్న సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే పోలీసులపై తీవ్ర చర్యలు ఉంటాయని న్యాయవాదులు హెచ్చరించారు. అధ్యక్షుడు పుప్పాల లింబాద్రి, సహచర న్యాయవాదులు పాల్గొన్నారు.

## గుత్తి కోయగూడెంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం



**విశ్వంభర, మహాముత్తారం :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాముత్తారం మండలంలోని మద్దిమడుగు గుత్తి కోయగూడెంలో జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే ఆదేశాల మేరకు పీఆర్పీఎఫ్ 58వ బెటాలియన్ కమాండెంట్ మోహన్ సహకారంతో కాటారం డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, పీఆర్పీఎఫ్ డీఎస్పీ రామకృష్ణ ఆధ్వర్యంలో గుత్తి కోయగూడెంలో సివిక్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. వారికి సింటెక్స్ ట్యాంకులు, సోలార్ లైట్లు, సైకిళ్లను, ఆడవారి కోసం కుట్టు మిషన్లు, వాలీబాల్, క్యారం, బాస్కెట్బాల్ లాంటి ఆట వస్తువులను పిల్లలకు మహిళలకు బట్టలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలను పనులకు తీసుకెళ్లకుండా చదివించాలని ఆరోగ్యం పట్ల శ్రద్ధచూపాలని అసాంఘిక కార్యకాలకు పాల్పడకూడదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో మహా ముత్తారం ఎస్సై మహేందర్ కుమార్, పీఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికుల సమ్మెకు బీజేపీ మద్దతు



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** గ్రామ పంచాయితి వర్కర్స్ సమ్మెకు భారతీయ జనతా పార్టీ నాయకులు బీజేపీ ఆత్మకూరు(ఎం) మండల శాఖ మద్దతు తెలిపింది. గురువారం ఎంపీడీవో కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షులు గజరాజ్ కాశీనాథ్ మాట్లాడుతూ గ్రామ పంచాయితి వర్కర్స్ కి కనీస వేతనం ఇవ్వాలని, మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేయాలని, ఇఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. కారోబార్లను అసిస్టెంట్ కార్యదర్శులుగా నియమించాలని, దాహన సంస్కారాలకు కనీసం 30 వేలు ఇవ్వాలని, వారికి ఇన్సూరెన్స్ ప్రభుత్వమే కల్పించాలని, వారి కోరికలు నెరవేరేవరకు వారికి మద్దతుగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి బండారి సత్యనారాయణ, బీజేవైఎం మండల అధ్యక్షులు పైల ప్రశాంత్, గ్రామ శాఖ అధ్యక్షులు లోడి వెంకటయ్య, బీజేవైఎం నాయకులు బండారు సాయి, బీజేవైఎం మండల అధికార ప్రతినిధి సూర్య పాల్గొన్నారు.

## గుర్రం మల్లేష్‌కి ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ ప్రధానం




**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** గ్రామీణ వైద్యునిగా నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందిస్తూ తన కలం బలంతో వార్త కథనాలు రాస్తూ ప్రజలను, యువతను చైతన్య పరుస్తున్న ఎన్ వీ ఆర్ నేటి సామాన్యుడు దిన పత్రిక విలేకరి గుర్రం మల్లేష్ కి ఉత్తమ జర్నలిస్ట్ గా అవార్డు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన గుర్రం మల్లేష్ కి ఎస్.ఎల్.పీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న, ఎస్.జే.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సామ శ్రీధర్, సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్ చిక్కడపల్లిలోని త్యాగరాయ కళ భవనంలో అథిరథ మహారథుల చేతుల మీదుగా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత గుర్రం మల్లేష్ మాట్లాడుతూ నాకు ఈ అవార్డ్ ప్రదానం చేసిన ఎస్.ఎల్.పీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న, ఎస్.జే.ఆర్ ఫౌండేషన్ చైర్మన్ సామ శ్రీధర్, పంజాల వెంకట్ గౌడ్, మహిళా అభివృద్ధి సంస్థ కార్పోరేషన్ చైర్మన్ బంద్రు శోభారాణి, బహుజన యుద్ధ నౌక ఏపూరి సోమన్న, హైకోర్టు అడ్వకేట్ రాపోలు భాస్కర్, తెలంగాణ మహిళా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గంగపురం పద్మ, ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త డాక్టర్ వంగపల్లి అంజయ్య, ఐ.వీ.ఎఫ్ జిల్లా అధ్యక్షులు కుక్కటపు చంద్రశేఖర్, తెలంగాణ జర్నలిస్ట్ యూనియన్ యాదాద్రి జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షానూర్ బాబాలకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డ్ రావడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ అవార్డ్ రావడం వలన నాకు బాధ్యత మరింత పెరిగిందని అవార్డ్ ప్రదానం చేసిన వారికి జీవిత కాలం రుణపడి ఉంటానని అన్నారు. సామాన్యుడికి అండగా ఎన్ వి ఆర్ నేటి సామాన్యుడు నిరంతరం పనిచేస్తుంది అని సామాన్యుడి కష్టాలను మరియు వారికి జరుగుతున్న అన్యాయాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న తరుణంలో వృత్తి నైపుణ్యాన్ని గుర్తించి ఈ అవార్డ్ ప్రధానం చేశారని తెలిపారు. ఈ అవార్డుని నేను పని చేస్తున్న ఎన్‌విఆర్ నేటి సామాన్యుడు దిన పత్రిక యాజమాన్యానికి, సంస్థలో పనిచేస్తున్న పాత్రికేయ బృందానికి, సిబ్బందికి అంకితం చేస్తున్న అని అన్నారు. ఈ అవార్డ్ వచ్చిన శుభ సందర్భంగా గుర్రం మల్లేష్ కి టీ.జే.యూ సభ్యులు, టీ.జే.యూ మహిళా విభాగం సభ్యులు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## డిండిలో స్వచ్ఛదనం-పచ్చదనం




**విశ్వంభర, డిండి:** డిండి మండలం కేంద్రంలో గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సెక్రెటరీ జంగయ్య మాట్లాడుతూ మన చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటిని నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు, స్థానిక ఎంపీడీవో ఆఫీసు నుండి దేవరకొండ రోడ్డుకు ఇరువైపులా డోజర్ సాయంతో గడ్డి మొక్కలు తొలగించారు. ఈ కార్యక్రమంలో, సెక్రెటరీ జంగయ్య, గ్రామపంచాయతీ సిబ్బంది, యాదగిరి, అంజి, బాలరాజు, గంగాధర్, చెన్నమ్మ, ఈదమ్మ, గంగమ్మ, బాలమ్మ, లక్ష్మమ్మ, సాలమ్మ, గెలువమ్మ, ఆశ వర్కర్ రిక్షాన, శ్రీదేవి, సరిత, జ్యోతి, అంగన్వాడి టీచర్లు చంద్రకళ, లావణ్య, మణెమ్మ, సత్యవాణి, వెలుగు సిబ్బంది మన్నెమ్మ, జ్యోతి, ఆసియా బేగం, తదితరులు పాల్గొన్నారు.




## కలెక్టర్ డీపీతో ఫేక్ అకౌంట్


- అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండండి
- జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**విశ్వంభర, మహబూబ్‌నగర్ :** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి అమాయకులతో అందినకాడికి కాజేస్తున్నారు. అంతేకాకుండా ఏకంగా జిల్లా కలెక్టర్ ల పేర్లతో ఫేక్ వాట్సప్ అకౌంట్ క్రియేట్ చేస్తున్నారు. ఇంతకుముందే మహబూబ్ నగర్ జిల్లా కలెక్టర్ ఫేక్ వాట్సప్ క్రియేట్ చేశారు. దీంతో ఆమె పోలీసులకు తెలపడంతో ప్రస్తుతం దానిపై దర్యాప్తు కొనసాగుతుంది. అదే క్రమంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ వాట్సప్ డీపీతో బుధవారం నకిలీ అకౌంట్‌ను క్రియేట్ చేశారు. పలువురు అధికారులతో చాటింగ్ చేశారు. ఈ విషయాన్ని కొందరు కలెక్టర్ దృష్టికి తేవడంతో స్పందించిన కలెక్టర్ నాగర్ కర్నూల్ జిల్లా సైబర్ క్రైమ్ అధికారులకు తెలిపారు. వెంటనే సంబంధిత అకౌంట్ ఫోన్ నెంబర్‌పై పోలీసులు దృష్టి పెట్టారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 9478 28 54487 నెంబర్‌తో నకిలీ అకౌంట్‌ను సృష్టించారని తెలిపారు. ఈ నెంబర్ నుంచి కాల్ చేసిన, చాటింగ్ చేసిన వెంటనే పోలీసులకు చెప్పాలని కలెక్టర్ కోరారు. సైబర్ నేరాల విషయంలో నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కోరారు.



## 48 క్షణాల్లో.. 47 దేశాల రాజధానుల పేర్లు

**విశ్వంభర, నాంపల్లి :** నలభై ఎనిమిది క్షణాల్లో ఆసియా ఖండంలోని 47 దేశాల రాజదాని ల పేర్లు చెప్పి అబ్బుర పరిచింది ప్రభుత్వ పాఠశాల విద్యార్థి. నల్గొండ జిల్లా,నాంపల్లి మండలం,దామెర గ్రామానికి చెందిన మంగి రాణి నాంపల్లి మండల కేంద్రంలో జెడ్ పి హెచ్ ఎస్‌లో 10వ తరగతి చదువుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులు సామాజిక కార్యకర్త గురిజ మహేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేధాశక్తి,ప్రతిభ కలిగిన విద్యార్థినికి స్ఫూర్తి ఫౌండేషన్ స్థాపకులు శ్రీవ్యాల్ అభినందిస్తూ పదవ తరగతికి సంబంధించిన స్టడీ మెటీరియల్, కొత్త దుస్తులు, నోట్ బుక్స్ అందించారు. కార్యక్రమంలో దామెర గ్రామ మాజీ సర్పంచ్ పొలగోని శ్రీను, మంగి మహేష్, రమేష్, చంటి, రాజు పాల్గొన్నారు.



## తిరుమలలో తెలంగాణ సిఫార్సు లేఖలు చెల్లవు

### టీటీడీ ఈవో శ్యామల రావు

**విశ్వంభర, తిరుపతి:** ఆంధ్రప్రదేశ్ లో ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానం కీలక విషయంపై స్పష్టతనిచ్చింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే భక్తులు తీసుకు వచ్చే సిఫారసు లేఖలను అనుమతించబోమని టీటీడీ ఈఓ శ్యామల రావు తేల్చి చెప్పారు. టీటీడీ నిర్వహించిన డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో ఈవో శ్యామల రావు భక్తులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. తిరుమల దర్శనానికి సంబంధించి తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫారసు లేఖలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. దీనిపై స్పందించిన టీటీడీ ఈఓ శ్యామల రావు శ్రీవారి దర్శనానికి ఆంధ్రప్రదేశ్ కు సంబంధించిన ప్రజాప్రతినిధుల నుండి వచ్చిన సిఫారసు లేఖలు మాత్రమే అనుమతిస్తున్నామని స్పష్టం చేశారు.



# ప్రతి రైతుకు రుణ మాఫీ కాలేదు

**విశ్వంభర, కామారెడ్డి:** కిసాన్ మోర్చా రాష్ట్ర శాఖ పిలుపు మేరకు అర్హులైన రైతులందరికీ 2లక్షల వరకు రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రుణమాఫీ కానీ రైతుల నుండి వివరాలు తీసుకొని సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం చెబుతున్నట్లుగా లక్షా 50 వేల లోపల రుణం అన్న ప్రతి రైతుకు రుణ మాఫీ కాలేదనీ అధికారులు గ్రామాల్లోకి వస్తే ఆ విషయం అర్థం అవుతోందని అన్నారు. రుణ మాఫీ కానీ రైతులు బీజేపీ పార్టీ ఏర్పాటు చేసిన 8886100097 కి ఫోన్ చేసి వివరాలు చెప్తే వారి సమస్య పరిష్కారం కోసం అధికారుల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. రుణమాఫీ అర్హులైన ప్రతి రైతుకు అయ్యేవరకు బీజేపీ అండగా ఉంటుందనీ అన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణ తారా మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం ఎలాంటి షరతులు లేకుండా ఆగస్ట్15 వరకు ప్రతి రైతుకు 2 లక్షల రుణ మాఫీ చేయాలనీ డిమాండ్ చేశారు. సాంకేతిక కారణాల సాకుతో ఇతర సమస్యల్ని చూపించి చాల మంది రైతులకు రుణ మాఫీ కాలేదనీ ఇలాంటి రైతుల సమస్యలు అధికారులు దృష్టిలో ఉంచుకొని రుణమాఫీ అయ్యేలా చూడాలని అన్నారు.

## ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా
# రైతుకు ఎంతో మేలు

**కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణ రెడ్డి**



**విశ్వంభర, కామారెడ్డి:** పిపుల్ ఫర్ ఇండియా అగ్రిటెక్ సీరీస్, కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి ఆధ్వర్యంలో ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ వినియోగం పై అవగాహన కార్యక్రమం రామారెడ్డి రోడ్ గర్గుల్ వద్ద గల పీఎఫ్ఐ డెవలప్మెంట్ సెంటర్ లో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆధునిక వ్యవసాయంలో డ్రోన్ వాడకం గురించి రైతులకు వివరణ ఇవ్వడం జరిగింది. అనంతరం కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా వ్యవసాయంలో టెక్నాలజీని వాడాలనీ రైతులకు సూచించారు. క్రిమిసంహారక మందుల పిచుకారికి డ్రోన్ ను వాడటం వల్ల రైతుకు అనేక లాభాలు ఉన్నాయని, పంటకు తగిన మోతాదులో మందు పడటమే కాకుండా వ్యవసాయ కూలీల వ్యయం కూడా తగ్గుతుందని అన్నారు. ఆధునిక వ్యవసాయ పద్ధతుల ద్వారా రైతుకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు.



అల్ ఇండియా ఫిషర్మెన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వం మత్స్యకారులకు వ్యతిరేకంగా తెచ్చిన బిల్లులకు నిరసనగా జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాలో జాతీయ అధ్యక్షులు ఫర్నేడో, మాజీ ఎంపీ ప్రతాపన్, జాతీయ కార్యవర్గ సభ్యులు, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, తెలంగాణ ఫిషర్మెన్ కాంగ్రెస్ నాయకులు పెద్ద ఎత్తున్న పాల్గొన్నారు.

– విశ్వంభర, న్యూ ఢిల్లీ



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం ఖప్రాయపల్లి గ్రామంలో గురువారం శ్రీ శివ ఆంజనేయస్వామి ధ్వజ స్థంభం ఆవిష్కరణ కార్యాక్రమంలో పాల్గొన్న ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద బిక్షమయ్య గౌడ్, మండల బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)

# విద్యాశాఖ కమిషనర్ ఆకస్మిక తనిఖీ



**విశ్వంభర, చింతపల్లి:** చింతపల్లి మండలంలో డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ నరసింహారెడ్డి శుక్రవారం పర్యటించారు. కురంపల్లి ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి అమ్మ ఆదర్శ పాఠశాల పనులను పర్యవేక్షించారు. పెండింగులో ఉన్న పనులను త్వరగా చేయవలసినదిగా హెడ్మాస్టర్లను ఆదేశించారు. పాఠశాలల్లోని రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలించారు. సమస్యలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులకు సలహాలు, సూచనలు అందించారు. పదవ తరగతి బయో సైన్స్ ఉపాధ్యాయు రాలు శాగం విజిత టీచింగ్ ను 15 నిముషాలు వీక్షించి ఆమె విద్యార్థులకు బోధించే విధానాన్ని చూసి అభినందించారు. అదేవిదంగా పాఠశాల ఆవరణలో ఆట స్థలాన్ని పర్యవేక్షించి పీఈటీ తస్లీమ్ ను అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆటలలో ముందుడేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం శ్రీ సాయి సన్నిధి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ వేద పండితుల మంత్రోచలనతో వారికీ స్వాగతం పలికి శాలువాతో సన్మానించి బాబా చిత్రపటాన్ని అందజేశారు. వారి వెంట అడిషనల్ డైరెక్టర్ మదన్ మోహన్, జాయింట్ డైరెక్టర్ వెంకట నరసమ్మ, రీజనల్ జాయింట్ డైరెక్టర్ విజయలక్ష్మి, కేజీవీబీ ఎస్ఓ వాసవి, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రెహ మున్నీసా బేగం, సీఆర్పీ సైదులు, ఎల్డీప షఫీవుద్దీన్, ఎంఐఎస్ నరేష్ ఉన్నారు.



## ఎలాంటి షరతులు లేకుండా
# రైతు రుణమాఫీ అమలు చేయాలి

**కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** ఎలాంటి షరతులు లేకుండా రైతుల రుణమాఫీ అమలు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆత్మకూరు (ఎం) మండలం పల్లెర్ల గ్రామంలో జరిగిన రైతు సంఘం మండల ముఖ్యుల సమావేశంలో చంద్రారెడ్డి పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రైతు రుణమాఫీ కార్యక్రమం నేటికీ 40 శాతం లోపు రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన షరుతులను ఎత్తివేసి రుణమాఫీకి కావలసిన 31 వేల కోట్ల రూపాయల నిధులను వెంటనే విడుదలచేయాలని అన్నారు. రేషన్ కార్డులు, ఐటీ రిటర్న్స్, రీ షెడ్యూల్ లాంటి నిబంధనలను సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు సంవత్సరానికి 15వేల రూపాయలు రైతు భరోసా కింద వేస్తానని చెప్పినట్లుగా వెంటనే వేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ప్రభుత్వం వచ్చాక రబీ సీజన్లో వేయాల్సిన రైతు భరోసా డబ్బులను వేయలేదన్నారు. అదే విధంగా ఖరీఫ్ సీజన్ కూడా ప్రారంభమై మధ్యలోకి వచ్చిందన్నారు. ఈ రెండు సీజన్ల డబ్బులను రైతుల ఖాతాల్లో త్వరితగతిన జమ చేయాలని అన్నారు. ఈ సమావేశానికి నాయిని కృష్ణారెడ్డి అధ్యక్షత వహించగా వృత్తిదారుల మండల కన్వీనర్ వేముల బిక్షం, రైతు సంఘం మండల నాయకులు నాయిని రాంరెడ్డి, నాయిని యాదిరెడ్డి, గున బోయిన స్వామి, జినుకల బిక్షం, ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులను
# పర్మినెంట్ చేయాలని ఎంపీడీఓకు వినతి



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) ఆగస్టు 08 :** పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని సోమవారం ఎంపీడిఓ కు పంచాయతీ కార్మికులు మండలం అధ్యక్షులు కిష్టయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈసందర్బంగా మాట్లాడుతూ పంచాయతీ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు పెంచాలన్నారు. ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కారోబార్ బిల్ కలెక్టర్ నియమించాలని అన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికులకు టుంబాలకు రూ.10 లక్షల నష్టపరిహారం అందించాల న్నారు. పెండింగ్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ విధానం రద్దుచేసి పాత విధానం కొనసాగించి కార్మికులను ప్రభుత్వ ఉద్యోగుల గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా నాయకులు నోముల స్వామి, మేడి యాదయ్య, కోల మచ్చగిరి, దేవరాజు రాజశేఖర్, యాదమ్మ, అంజయ్య తదితరులు వినతి పత్రం అంద జేసిన వారిలో ఉన్నారు.

# మేడిపల్లి 28వ డివిజన్‌లో స్వచ్ఛదనం- పచ్చదనం



**విశ్వంభర, మేడిపల్లి :** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమం 28వ డివిజన్ కార్పొరేటర్ చీరల నరసింహ ఆధ్వర్యంలో శ్రీ సాయి ఎంక్లేవ్, పెంటరెడ్డి కాలనీలో నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ తోటకూర అజయ్ యాదవ్, డిప్యూటీ మేయర్ కొత్త కిషోర్ గౌడ్ హాజరయ్యారు. ఇంటింటికి మొక్కలు పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో కమిషనర్ రాజులింగం, రెవెన్యూ ఆఫీసర్ విజయేందర్ రెడ్డి, అధ్యక్షులు సంపత్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ వెంకటరమణ, సురేష్, శ్రీ సాయి ఎన్క్లేవ్ కాలనీ మరియు పెంటారెడ్డి కాలనీ అధ్యక్ష, కార్యదర్శులు కాలనీవాసులు, మహిళలు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ కార్మికులను
# పర్మినెంట్ చేయాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం**

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం) :** గ్రామ పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, కనీస వేతనం జీఓ నంబర్ 60 ప్రకారం 18 వేలు ఇవ్వాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం, గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ళ గణపతి రెడ్డిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట కమిటీ ఇచ్చిన ఒక్క రోజు సమ్మె పిలుపులో భాగంగా ఆత్మకూరు (ఎం) మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన సమ్మె శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాలలో తాతల కాలం నుండి గ్రామ అభివృద్ధి కోసం నిరంతరం పనిచేస్తున్నప్పటికీ నేటికి ప్రభుత్వం గ్రామ పంచాయితీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులగా రెగ్యులర్ చేయలేదని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. గత సంవత్సరం సమస్యల పరిష్కారం కోసం 34 రోజులు సమ్మె చేసిన సందర్భగా ఎన్నికల మేనిఫెస్టోలో సైతం రేవంత్ రెడ్డి గ్రామపంఛాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, ఇచ్చిన వాగ్దానాలని అమలు చేయాలని, సమ్మె కాలపు వేతనం నేటికి ఇవ్వలేదని సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, విధినిర్వహణలో చనిపోయిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మె కార్యక్రమా నికి సీపీయం మండల కార్యదర్శి వేముల భిక్షం, సీపీఐ జిల్లా నాయకులు ఉప్పల ముత్యాలు ప్రజాసంఘాల నాయకులు మద్దత్తు తెలియజేసి మాట్లాడారు. ఈ కార్యక్రంలో గ్రామ పంచాయితీ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ళ కిష్టయ్య, ఇంద్రపెల్లి జ్ఞానేశ్వర్, మండల గౌరవాధ్యక్షులు నోముల స్వామి, ఉపాధ్యక్షులు శ్రీను, కోశాధికారి సుదగాని రమేష్, సహాయకార్యదర్శి కూరెళ్ళ సైదులు, నాయకులు కవిత, నర్సిరెడ్డి, తాల్లపల్లి నరసింహ, చారి పాల్గొన్నారు.



# పెద్ద శంకరంపేటలో సురేష్ షట్కర్ జన్మదిన వేడుకలు

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** మెదక్ జిల్లా పెద్ద శంకరం పేట మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జహీరాబాద్ పార్లమెంటు సభ్యుడు సురేష్ షట్కర్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల మధ్య ప్రియతమ నాయకుని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద శంకరంపేట మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాయిని సుధన్, మండల మహిళా అధ్యక్షురాలు హౌసుల భవాని, పట్టణ అధ్యక్షుడు గంగారెడ్డి, రాష్ట్ర ఓ.బీ.సీ సెల్ ప్రధాన కార్యదర్శి జి. జనార్ధన్. మాజీ జెడ్పీటీసీ, పార్టీ సీనియర్ నాయకుడు సురేందర్ రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు ఆర్.ఎన్. సంతోష్ కుమార్, వేణుగోపాల్ గౌడ్, సుభాష్ గౌడ్, సాయి రెడ్డి, కుంట్ల శ్రీను, శ్రీశైలం, పెరుమాళ్ గౌడ్, మల్లేశం, అంజిరెడ్డి, కాశయ్య, విట్టల్ రెడ్డి, వసేం పాల్గొన్నారు.



# ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

**విశ్వంభర, పరిగి:** పరిగి మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ న్యామత్ నగర్ లో స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీజన్ వ్యాధులు, వ్యక్తిగత పరిశుభ్రత, మొక్కల పెంపకం పై వ్యాసరచన పోటీ నిర్వహించినట్లు మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకటయ్య తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లు రవీంద్ర, వెంకటేష్, కృష్ణ, మీర్ తాహేర్ అలీ, ఇన్చార్జ్ వార్డ్ ఆఫీసర్ శ్రీనివాస్, వైద్య సిబ్బంది వెంకన్న, రాఘవేందర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## ఆగస్టు 18న పద్మశాలి సంఘం ఎన్నికలు

**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం రిజిస్టర్ 98/2023 అధ్యక్ష ఎన్నికలు ఆగష్టు 18న జరగనున్నాయి. ఎన్ని కల నేపథ్యంలో అభ్యర్థులు పెద్ద ఎత్తున ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నారు. తెలంగాణ రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా ఒక బ్యాలెట్ పేపర్‌తో ఎలక్షన్లు జరగబోతున్నాయని తెలిపారు. రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థిగా పోటీల్లో ఉన్నవల్లకాటి రాజకుమార్ కి మద్దతుగా తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షులు గోశిక యాదిగిరి , మ్యాడం బాబురావు ,24 జిల్లాల అధ్యక్షులు సీనియర్ పద్మశాలి పెద్దలు అందరూ కూడా సంపూర్ణ మద్దతు తెలిపారు. కావున తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కుల బాంధవులు అందరూ కూడా మగ్గం గుర్తుకు ఓటు వేసి తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష అభ్యర్థిగా ఉన్న వల్లకాటి రాజకుమార్ ని అత్యధిక మెజారిటీ తో గెలిపించాలని పద్మశాలి నాయకులు కోరారు. భారతదేశ చరిత్రలోనే ఒక సంఘం లో 48 వేల ఓట్లతో ఎన్నికలు జరగడం ఇదే మొదటిసారి అని పలు సంఘాల నాయకులూ తెలిపారు.

ఈ పద్మశాలీలంతా ఈ యొక్క (టీఆర్పీఎస్) 98/2023 సభ్యత్వం పొందిన అందరూ కూడా ఈ ఎన్నికలలో పాల్గొని వల్ల కాటి రాజ్ కుమార్ గెలిపించాలని కోరారు.



## నిజాం కాలేజ్ యూజీ స్టూడెంట్స్ ధర్నా

**విశ్వంభర, హైద్రాబాద్ :** నిజాం కాలేజ్ లో ధర్నా చేస్తున్న యూజీ స్టూడెంట్స్ ను కలిసి సమస్యలను ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ తెలుసుకున్నారు. యూజి స్టూడెంట్స్ ఎమ్మెల్సీ తో హాస్టల్ లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. హాస్టల్ మొత్తం తమకే కేటాయించాలనీ యూజి స్టూడెంట్స్ డిమాండ్ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మాట్లాడుతూ హాస్టల్ సమస్యలను పరిష్కరిస్తాం అని హామీ ఇచ్చారు. యూజి-పీజీ స్టూడెంట్స్ కూడా పంథాలకి పోకుండా సమస్యల పరిష్కారం కోసం సహకరించాలని అన్నారు

## అన్నపూర్ణ నగర్‌లో డ్రైనేజ్ పనులకు శంకుస్థాపన



**విశ్వంభర, అంబర్ పేట్:** గోల్నాక డివిజన్ అన్నపూర్ణ నగర్ లో 8.90 లక్షల వ్యయంతో చేపట్టిన నూతన డ్రైనేజ్ పైప్ లైన్ పనులకు అంబర్పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ శంకస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దూసరి లావణ్య గౌడ్ బీఆర్ఎస్ నాయకులు, బస్తీ నాయకులు ప్రజలు పాల్గొన్నారు.

## కళాకారులకు గుర్తింపు,
## హెల్త్ కార్డులు అందించాలి

### తెలంగాణ ప్రజా నాట్య మండలి



**విశ్వంభర, హైద్రాబాద్ :** తెలంగాణ ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుకి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర సమితి తరపున కళాకారుల సమస్యల పరిష్కరిం చాల ని కోరారు. కళాకారులకు గుర్తింపు కార్డులు, ఆరోగ్య హెల్త్ కార్డులు ఇవ్వాలని, క్రీడా రంగానికి ఇచ్చే ప్రాధాన్యతను. కళాకారులకు ఇవ్వాలని కోరారు. తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ కళాకారులకు సంఖ్యతో నిమిత్తం లేకుండా అర్హులైన వారికి ఉద్యోగాలు ఇవ్వాలని పలు సమస్యల వినతి పత్రాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావుకి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కళాకారుల సమస్యల పరిష్కా రం కోసం కృషి చేస్తామని అన్నారు. త్వరలోనే కళాకారులు , కవులుతో సమావేశం ఏర్పాటు చేసి తగు చర్యలు చేపడుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఈటి నరసింహ, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ, రాష్ట్ర అధ్యక్షులు కురిమిద్ద శ్రీనివాస్, కన్నం లక్ష్మీనారాయణ, కేతరాజు ఉప్పలయ్య, గన్నారపు రమేష్, సైదులు, పద్మ వెంకటేష్, సబ్బు రాజమౌళి పాల్గొన్నారు

# ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

### ఎస్పీ కిరణ్ ఖరే



**విశ్వంభర, భూపాలపల్లి:** ర్యాగింగ్‌కు పాల్పడి విద్యార్థులు బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవదద్దని జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే అన్నారు. ర్యాగింగ్ చేయడం నేరమని, ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే చట్టపర మైన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని గురువా రం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సీనియర్స్, జూనియర్స్ అనే తేడా లేకుండా స్నేహ పూర్వకంగా కలిసి మెలిసి విద్యనభ్యసించాలని సూచించారు. ర్యాగింగ్ లాంటి కేసుల్లో ఇరుకుంటే వారి బంగారు భవిష్యత్తు కోల్పో తారని, వ్యసనాలకు బానిసై విద్యార్థులు తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని కోరారు. తల్లిదండ్రులు మీపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ సూచించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ చేస్తూ దోషులుగా నిలవద్దని కోరారు. ర్యాగిం గ్ కు పాల్పడే వారి వివరాలను డయల్ 100 కు తెలియ జేసి పోలీసుల సహాయం పొందాలని ఎస్పీ కిరణ్ ఖరే పేర్కొన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమైందని అన్ని విద్యాసంస్థల్లో యాంటీ ర్యాగింగ్ అవగాహన సదస్సులు జిల్లా పోలీసులు నిర్వహిస్తున్నారని, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్టు ఎస్పీ తెలిపారు. యా జమాన్యాలు విద్యార్థుల అలవా ట్లను, నడవడికను గమనిం చాలని తెలిపారు. ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్య లు తప్పవని, సీనియర్లు, జూనియర్లు అని కాకుండా సీని యర్లు జూనియర్లకు గైడ్‌లా వ్యవహరిస్తూ, స్నేహితులుగా పెద్దన్న పాత్ర పోషిస్తూ, జూనియర్లకు మార్గదర్శకంగా, విద్యార్థులు ర్యాగింగ్ వంటి మహమ్మారికి దూరంగా ఉండాలని, ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఎస్పీ పిలుపునిచ్చారు.

# రైతు రుణమాఫీలో దేశానికే తెలంగాణ రోడ్ మోడల్

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**విశ్వంభర, భూపాలపల్లి:** రైతు రుణమాఫీలో దేశానికే మన తెలంగాణ రాష్ట్రం ఒక రూల్ మోడల్ అని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి నియోజకవర్గం మొగుళ్ళపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించారు. ముందుగా మండలంలోని ఆకినపల్లి, పెద్దకోమటిపల్లి గ్రామాలలో నూతనంగా నిర్మించిన పల్లె దవాఖానాలను ప్రారంభించారు. ములకలపల్లి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు టై, బెల్ట్ లను అందజేశారు. మొగుళ్ళపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే చేతుల మీదుగా చెక్కులను అందజేశారు. అనంతరం మొగుళ్లపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన పీఎసీఎస్ గోదామును, కార్యాలయాన్ని రాష్ట్ర సహకార అపెక్స్ బ్యాంకు(టెస్కాబ్) చైర్మన్ మార్నేని రవీందర్ రావు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు టెంకాయ కొట్టి, రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఇస్సిపేట గ్రామంలో పీఎసీఎస్ గోదామును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ దేశంలోనే నెంబర్ వన్ గా తెలంగాణ నిలిచిందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ కార్యక్రమాన్ని అమలు చేసిందని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులు ఊబిలోకి నెట్టిందని అన్నారు. గత ప్రభుత్వంలో కేసీఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పులు చేశాడని ఆరోపించారు. కష్టకాలంలో ఉండి కూడా సీఎం రేవంత్ రెడ్డి పైసా పైసా పోగేసి రైతు రుణమాఫీ చేయడానికి అహర్నిశలు కష్టపడి పని చేశారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో ఐదు రోజులపాటు ప్రజలు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. ఈ కార్యక్రమాలలో మొగుళ్ళపల్లి మండల ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే




**విశ్వంభర, మీర్ పెట్:** మీర్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో 20 మంది లబ్ధిదారులకు రూ .10 లక్షల సీ.యం.ఆర్.యఫ్ చెక్కులను జిలెల్లగూడ క్యాంప్ కార్యాలయంలో మహేశ్వరం శాసనసభ్యులు పటోళ్ల సబితా ఇంద్రారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మీర్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ యం.దుర్గా దీప్ లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మీర్పేట్ బీ.ఆర్.యస్ పార్టీ అద్యక్షుడు అర్కల కామేష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



## బాంబు పేలుళ్ల ఉధృతిని పరిశీలించిన కలెక్టర్ రాహుల్ శర్మ

**విశ్వంభర, భూపాలపల్లి:** ఓపెన్ కాస్ట్ ఉపరితల గని బాంబు పేలుళ్ల ఉద్రుతిని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. గురువారం గుర్రంపేట ఎస్సీ కాలనీ లో జిల్లా కలెక్టర్ పర్యటించారు. సింగరేణి ఓపెన్ కాస్ట్ ఉపరితల గనిలో జరుగుతున్న బాంబు పేలుళ్ల వల్ల తమ ఇండ్లు ధ్వంసం అవుతున్నాయని తమ గ్రామాన్ని తరలించాలని గ్రామస్థులు కలెక్టరు కు విన్నవించగా జిల్లా కలెక్టర్ నేరుగా గుర్రం పేట ఎస్సీ కాలనిలో సింగరేణి అధికారులతో కలిసి పర్యటించి పేలుళ్ల ఉదృతిని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు కలెక్టర్ రాక సందర్భంగా తక్కువ మోతాదులో బాంబులు పేల్చారని తెలుపగా, మళ్ళీ ఒక రోజు ఆకస్మిక తనిఖీ చేస్తామని పేలుళ్ల ఉదృతినీ తనిఖీ చేసి గ్రామస్థులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఓ నారాయణరావు, తహసిల్దార్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ నుండి బీజేపీలో చేరిక



**విశ్వంభర, మహాదేవపూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీకి చెందిన భీముని వెంకటస్వామి, జల్లారపు పాపయ్యలు పలువురు నాయకులు, కార్యకర్తలు బీజేపీ పార్టీలో చేరారు. వారికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు నిషిధర్ రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపయ్య, మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్కా మోహన్ రావు, మండల అధ్యక్షుడు ఆకుల శ్రీధర్ తో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోలీసులపై చర్యలు
## చేపట్టే వరకు విధుల బహిష్కరణ



**విశ్వంభర, ఆమనగల్లు:** జనగాం జిల్లాలో ఇటీవల న్యాయవాద దంపతులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు చేపట్టే వరకు విధుల బహిష్కరణ కొనసాగిస్తున్నట్లు ఆమనగల్లు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు గురువారం తెలిపారు. న్యాయవాదులపై పోలీసుల దాడిని నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా న్యాయస్థానాల్లో న్యాయవాదులు విధులు బహిష్కరించినట్లు పేర్కొన్నారు. దాడి చేసిన సంబంధిత పోలీసులపై శాఖ పరంగా, చట్టపరంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పోలీసుల తీరును మార్చుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, ఉపాధ్యక్షులు సుధాకర్ రెడ్డి సీనియర్, జాయింట్ సెక్రెటరీ రామకృష్ణ, ట్రెజరరీ మధు, లైబ్రరేయన్ శేఖర్, న్యాయవాదులు కొప్పు కృష్ణ, మల్లేష్, సంతోష్ కుమార్, జయంత్ కుమార్ జగన్ గౌడ్, శ్రీనివాస్, మురళి, సర్దార్, తదితరులు పాల్గొన్నారు.



## మహిళ అదృశ్యం

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహిళ అదృశ్యమైన సంఘటన చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం నారాయణగూడలో మున్సిపల్ కార్మికురాలుగా పనిచేసే శోభ (45) జూన్ 5న నారాయణగూడలో పనికి వెళుతున్నాను అని చెప్పి తిరిగి రాలేదు. తెలిసిన వారిని, తోటి మిత్రులను, ఉద్యోగులను, ఇరుగుపొరుగు వారిని అడిగిన సమాచారం లేకపోవడంతో కుటుంబ సభ్యులు చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## పేటలో పంచాయతీ కార్మికుల సమ్మె

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఇచ్చిన పిలుపుమేరకు పెద్ద శంకరంపేటలో గురువారం ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో పేట పంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు పి రాములు, వివేక్, భూమయ్య, చాకలి రాములు, మానయ్య, లచ్చుమ్మ, సాయమ్మ, సుశీల, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

## కట్ట మైసమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ట



**విశ్వంభర, ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని సురసముద్రం చెరువు కట్ట పైన వెలసిన కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, శ్రీ నారాయణి ప్రత్యంగిరాదేవి మహా యజ్ఞం సంబంధించిన కార్యక్రమాల కరపత్రాన్ని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. కార్యక్రమంలో మొక్తాల వెంకటయ్య, తల్లోజు వెంకటయ్య, మొక్తాల అంజయ్య, తట్టేపల్లి వెంకటయ్య, ఎర్రవోలు రాజు, ఎర్రవోలు శ్రీను కెకె, ఎర్రవోలు మహేష్, బొల్లు శివ, గంజి వెంకటయ్య, యాట మల్లేష్, మొక్తాల చిన్నా వెంకటయ్య, బోల్లు రమేష్, ఎం. మహేష్, శ్రీశైలం, నరేష్, ఊరటి వెంకటయ్య, మొక్తాల సాయి తదితరులున్నారు.

## రాడార్ స్టేషన్ నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి



**విశ్వంభర, వికారాబాద్:** రాడార్ స్టేషన్ నిర్వహణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వికారాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీ.ఓ.డబ్ల్యు జిల్లా కన్వీనర్ వై గీత, ఏ.ఐ.కె.ఎమ్.ఎస్ జిల్లా కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లా పూడూరు మండలం దామగుండం అడవిలో 2900 ఎకరాల భూమిని రాడార్ స్టేషన్ వీ.ఎల్.ఎఫ్ నిర్మాణానికి కేటాయించడం జరిగిందని, ఈ అడవిలో 12 లక్షల చెట్లను తొలగించడానికి జరుగుతున్న ప్రయత్నాలు వెంటనే రద్దు చేయాలని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా చెట్లను నాటాలని పిలుపునివ్వడం సంతోషకరం కానీ ప్రాజెక్టుల పేరుతో అనేక ఔషధ గుణాలు కలిగిన 12 లక్షల చెట్లను తొలగించడం కోసం తీసుకున్న నిర్ణయం చాలా బాధాకరం అని తమ ఆవేదనను వ్యక్తం చేశారు. అదేవిధంగా వీ.ఎల్.ఎఫ్ వల్ల 60 నుండి 70 కిలోమీటర్ల దూరంలో రేడియేషన్ ప్రభావం ఉండటం చేత వికారాబాద్ జిల్లా భవిష్యత్తు ప్రమాదంలో పడనుందని అన్నారు. ఈ ప్రాంతంలో నేవీ రాడార్ స్టేషన్ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకు ఇచ్చిన అనుమతులను అన్నింటిని రద్దు చేసి దామగుండం అడవిని కాపాడగలరని కోరారు. ఈ కార్యక్రమంలో దామగుండం అడవి నివాసి సత్యానంద స్వామి, ఏఐకెఎమ్ఎస్ నాయకులు రాము లు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్, పీఓడబ్ల్యు నాయకులు ప్రభావతి పాల్గొన్నారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వనమహోత్సవం



**విశ్వంభర, ఆత్మకూర్ (ఎం) :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పచ్చదనం-స్వచ్ఛదనం కార్యక్రమంలో భాగంగా నాలుగవ రోజు మండల స్పెషల్ ఆఫీసర్ రాజారాం, ఎంపీడీఓ రాములు నాయక్ పాల్గొని ఆరోగ్య కేంద్రంలో మొక్కలు నాటారు. అనంతరం గ్రామంలో పచ్చదనం - స్వచ్ఛదనం కార్యక్రమంలో వన మహోత్సవ పనులను పరిశీలించి ఫిట్టింగ్ ప్లాంటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, సీహెచ్ఓ కరుణాకర్, హెల్త్ సూపర్వైజర్ సాంబులమ్మ, ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఉపాధి హామీ ఏపీఓ బొడిగ రమేష్, టీఏ యాదిరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి తుమ్మల ఆనంద్ కుమార్, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాకార్యకర్తలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి రవాణా ముఠా అరెస్ట్



**విశ్వంభర, కాటారం:** నిషేధిత గంజాయి రవాణాకు పాల్పడుతున్న ముఠాను కాటారం పోలీసులు అరెస్ట్ చేశారు. కాటారం పోలీస్ స్టేషన్ లో ఇంచార్జ్ సీఐ రామచందర్ రావు తెలిపిన వివరాల ప్రకారం కాటారం పోలీస్ లకు వచ్చిన నమ్మదగిన సమాచారం మేరకు కొందరు వ్యక్తులు అక్రమంగా నిషేధిత గంజాయి రవాణా చేస్తున్నట్టు సమాచారం రాగ కాటారం ఎస్ఐ మ్యాక అభినవ్, సిబ్బందితో కాటారం మండలంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంపు సమీపంలో మాటు వేసి గంజాయి రవాణాకు పాల్పడుతున్న కాటారం చెందిన దుర్గం నంద కిషోర్ (23), బయ్యారంకు చెందిన జగజంప్పుల విష్ణు (23), కొత్తపల్లికి చెందిన పెద్ది నిఖిల్ రాజ్(19), కాటారం చెందిన కడారి కార్తీక్ (20), మారుపాక రిశ్వంత్ (21), మెరిజాల రోహిత్ (20), ఎర్రగుంటపల్లికి చెందిన జక్కు రాజేష్ (23) అనే వ్యక్తులకు దుర్గం నంద కిషోర్ తన వెంట తెచ్చిన నిషేధిత గంజాయి ఇస్తుండంగా కాటరం పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. వారి దగ్గర నుండి 1.8 కేజీల నిషేధిత గంజాయి పోలీస్ వారు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఇట్టి నిషేధిత గంజాయిని భూపాలపల్లికి చెందిన లావుడ్య సిద్దు అనే వ్యక్తి దగ్గర రూ.36,0000/-లు ఇచ్చి 1.8 కేజీల గంజాయి తీసుకున్నట్లు దుర్గం నంద కిషోర్ విచారణలో ఒప్పుకున్నట్లు సీఐ తెలిపారు. వారిని అరెస్టు చేసి రిమాండ్ కు పంపినట్లు వివరించారు. ఇట్టి కార్యక్రమం లో కాటారం ఎస్ఐ అభినవ్, కానిస్టేబుల్స్ లక్మిరాజం, హరికుమార్, జంపన్న, సాంబశివరావు, లవన్, నరేష్, హొంగార్డు తిరుపతి పాల్గొన్నారు. యువత గంజాయి విక్రాయాలు, రవాణా లాంటి వాటికి పాల్పడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఇంచార్జ్ సీఐ రాంచందర్ రావు, ఎస్ఐ మ్యాక అభినవ్ తెలిపారు. యువత గంజాయికి దూరంగా వుండాలని, తల్లిదండ్రులు తమ పిల్లల నడవడిక పై ఎప్పటికప్పుడు నిఘా ఉంచాలని సూచించారు. యువత గొడవల జోలికి వెల్లి అనవసరంగా కేసుల పాలై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెలిపారు. శాంతి భద్రతలకు విఘతం కలిగేలా వ్యవహారిస్తే కేసులతో పాటు రౌడీ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు.

## మున్సిపాలిటీ ఆధ్వర్యంలో వసతి గృహాల్లో శానిటేషన్



**విశ్వంభర, ఆమనగల్లు:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న స్వచ్ఛతనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా అమంగల్ మున్సిపాలిటీ కమిషనర్ వసంత, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ప్రభుత్వ వైద్యశాల ఆధ్వర్యంలో గిరిజన హాస్టల్ లో ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం పట్టణంలోని వివిధ హాస్టల్లో సానిటేషన్ కార్యక్రమం నిర్వహించి పరిశుభ్రత పట్ల డెంగ్యూ మలేరియా వంటి రోగాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఈఓ తిరుపతిరెడ్డి, వైద్యులు, మున్సిపాలిటీ కమిషనర్ వసంత, ఆశ వర్కర్లు అంగన్వాడి కార్యకర్తలు, మున్సిపాలిటీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## నేర నియంత్రణకు మెడికల్ అసోసియేషన్ విరాళం


**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్ పట్టణంలో నేరనియంత్రణకు గాను సీసీ కెమెరాల ఏర్పాటు, పునరుద్ధరణకు తమ వంతు సహాయంగా ఆమనగల్ మండల మెడికల్ అసోసియేషన్ సభ్యులు లక్ష రూపాయల ఆర్థిక సహాయం గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ సీఐ ప్రమోద్ కుమార్, ఎస్సై వెంకటేష్ ను కలిసి చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నటరాజ్ యాదయ్య, ఉప్పు రాములు, పాపిశెట్టి అరవింద్, రవీంద్ర, శ్రీనివాస్, శేఖర్, యాదయ్య, గణేష్, సభ్యులు పాల్గొన్నారు.



## ఆరోగ్యం, పరిశుభ్రం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

### సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ శ్యామ్సన్

**విశ్వంభర, వికారాబాద్:** విద్యార్థుల ఆరోగ్యం పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ శ్యామ్సన్ అన్నారు. స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం సీడీఎంఏ అడిషనల్ డైరెక్టర్ శ్యామ్సన్ తో కలిసి వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగులపల్లి మంజుల రమేష్ వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డు సంఘం లక్ష్మీబాయి పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛదనం - పచ్చదనం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థుల ఆరోగ్యం పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అలాగే కుక్కల బెడదపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్, స్థానిక నాయకులు వెంకట్ రెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ప్రిన్సిపల్ వేణుగోపాల్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం తహశీల్దార్ కార్యాలయంలో బదిలీపై వెళ్ళుతున్న సర్వేయర్ సమీర్ గురువారం మాజీ జెడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, డిప్యూటీ తహశీల్దార్ తదితరులు సన్మానించారు.

– విశ్వంభర, ఆత్మకూరు(ఎం)



## గత పదేళ్లలో చేనేత రంగానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం

**విశ్వంభర, న్యూఢిల్లీ :** గత పది సంవత్సరాలుగా చేనేత కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. హ్యాండ్లూమ్, హస్తకళా జాతీయ సమాఖ్య రౌండ్ టేబుల్ సమావేశం గురువారం నాడు డిల్లీలోని కాన్స్టిట్యూషనల్ క్లబ్ హాల్ లో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ కిరణ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి చేనేత, హస్తకళ కార్మికులకు నిర్లక్ష్యం చేయడమే కాక ఈ ఆర్థిక సంవత్సరం కోసం ప్రవేశ పెట్టిన బడ్జెట్ లోను అన్యాయం చేశారని అన్నారు. అలాగే వారిని పట్టించుకోలేదని, గత 10 ఏళ్లుగా కేటాయింపుల్లో న్యాయం జరగలేదన్నారు. వారి సమస్యలు పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని సభలో వారి సమస్యల పట్ల కాంగ్రెస్ ఎంపీల తరపున పోరాటం చేస్తానని హామీ ఇచ్చారు.

## ఉపాధ్యాయులకు ఘనంగా సన్మానం




**విశ్వంభర, చివ్వేంల:** చివ్వేంల మండలలోని వట్టి ఖమ్మం పహాడ్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు విమల, శ్రీదేవి, జయశ్రీ ప్రమోషన్ లో బదిలీపై వెళుతున్న సందర్భంగా వట్టి ఖమ్మం పహాడ్ గ్రామ ప్రజలు, బాలల హక్కుల పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ జంపాల వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు దయానిధి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం చేశారు. అనంతరం జంపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి అనేది చాలా పవిత్రమైనది దీనిని అంకితభావంతో పనిచేస్తున్న వారికి అభినందనలు తెలియజేస్తూ ఎంతోమంది విద్యార్థులను ఉన్నత విద్య కోసం తయారు చేసిన ఉపాధ్యాయులకు సన్మానం చేసుకోవటం ఒక మంచి సాంప్రదాయమని అన్నారు. సుదీర్ఘకాలం గ్రామంలో పనిచేసిన ఉపాధ్యాయులకు గ్రామ ప్రజల తరపున ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పద్మశ్రీ, మోహన్ రెడ్డి, రామకృష్ణ నాయక్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

# పులకింతల అరకు

## ప్రకృతి అందాలతో పర్యాటకులకు ఆహ్వానం

## భారీ ఏర్పాట్లు చేసిన పర్యాటక శాఖ

**మన్యం ప్రకృతి సొగసుల నిలయం. ఎటుచూసినా పచ్చందాల కనువిందే. జలపాతాల గలగలలు.. కొండ కోనల్లో సాగే ప్రయాణాలు.. పలకరించే కాఫీతోటలు.. ఆకట్టుకునే గిరిజనుల సంప్రదాయాలు.. ఇలా ఒక్కటేమిటి ఎన్నో అందాల సమాహారం. అందుకే అరకులోయ ఆంధ్రాఊటీగా ఖ్యాతిగాంచింది. ప్రపంచ స్థాయి పర్యాటకుల మది దోచుకుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రా ఊటీ అందాలపై ప్రత్యేక కథనం.**





# ఈ రోగాలుంటే గ్రీన్ టీ తాగకూడదు..

లేదంటే చిక్కుల్లో పడతారు!

**నార్మల్ టీ కన్నా గ్రీన్ టీ ఆరోగ్యానికి ఎంతో మంచిదని అందరూ దాన్నే అలవాటుగా మార్చుకున్నారు. గ్రీన్ టీ తాగడం వల్ల బరువు తగ్గుతారని తేలడంతో మరింత మంది తాగేందుకు మగ్గు చూపుతున్నారు. కానీ గ్రీన్ టీ కొందరు తాగితే అనారోగ్యం బారిన పడడం ఖాయం. మరి గ్రీన్ టీ ఎవరెవరు తాగకూడదో ఒకసారి చదివి తెలుసుకోండి.**

### ఇన్సోమ్నియా

ఈ రోజుల్లో ప్రతిఒక్కరూ నిద్రలేమి సమస్యతో బాధపడుతున్నారు. రాత్రులు ఎక్కువ సేపు మేల్కోవడం వల్ల నిద్ర తక్కువగా పోతున్నారు. ఇలాంటి వారు గ్రీన్ టీ అసలు తాగకూడదు. అలాగే ఇన్సోమ్నియాకు బాధపడుతూ చికిత్స తీసుకుంటున్నవారు కూడా గ్రీన్ టీకు దూరంగా ఉండాలి. ఇలాంటి వాళ్లు గ్రీన్ టీకు బదులుగా గోరువెచ్చని నీరు తాగడం ఉత్తమం అంటున్నారు.

### మధుమేహం

దయాబెటీస్‌తో బాధపడుతున్నవారు షుగర్ లేకుండా కాఫీ, టీ తాగుతుంటారు. ఇదంతా ఎందుకులే అని గ్రీన్ టీ తాగుతున్నారు. వారికి ఇది కూడా అంత మంచిది కాదు. ఎందుకంటే ఇది రక్తంలోని చక్కెర స్థాయిలపై ప్రభావం చూపుతుంది. అయినా పట్టించుకోకుండా తాగడం వల్ల దురదలు, ఆందోళన, గుండెల్లో మంట వంటి సమస్యలు ఎదురవుతాయి.

### ఐరన్ సమస్య

చాలామంది ఐరన్ సమస్యతో బాధపడుతుంటారు. ఆహారం నుంచి పొందే ఐరన్ శక్తిని గ్రీన్ టీ క్షీణించేలా చేస్తుంది. దీనివల్ల శరీరానికి కావాల్సిన ఐరన్ అందదు.

### గర్భిణీ మహిళలు

పిల్లలకోసం ఎదురుచూసేవాళ్లు గ్రీన్ టీ అతిగా తాగకూడదు. అలాగే గర్భంతో ఉన్న మహిళలు గ్రీన్ టీ అసలు తాగకూడదు. ఎందుకంటే ఇందులోని కెఫీన్ ఉద్దీపన రక్తంలోకి చేరి జీవక్రియ సమస్యలు ఏర్పడవచ్చు.


### రక్తపోటు

గ్రీన్‌టీలో ఉండే ఉత్తేజిత లక్షణం బీపీపై ప్రభావం ఎక్కువగా చూపుతుంది. రక్తపోటు సమస్య గనుక ఉంటే గ్రీన్‌టీ అసలు తాగకూడదు. వీలైనంత వరకు గ్రీన్ టీకి దూరంగా ఉండేలా చూసుకోండి.



## గుహల అందాల చూడతరమా..

అనంతగిరి మండలంలోని బొర్రాగుహలు ప్రపంచ ఖ్యాతిగాంచాయి. వీటిని సందర్శించేందుకు విదేశీ పర్యాటకులు అధికంగా వస్తుంటారు. సహజసిద్ధంగా ఏర్పడిన బొర్రాగుహలు అరకులోయ అందాలకు ప్రధాన ఆకర్షణ. గుహలలో విభిన్న ఆకృతుల్లో శిలలు పర్యాటకుల్ని ఆలోచింపజేస్తాయి. పర్యాటక శాఖ ఈ గుహల్లో విద్యుత్ వెలుగుల్ని కూడా ఏర్పాటు చేసింది. పూర్వం బొర్రాగుహల అందాలను కాగడాల వెలుతురులో వీక్షించేవారు.



## జలపాతాల హొరు.. పర్యాటకుల హుషారు...

అనంతగిరి, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల్లో జలపాతాలు పర్యాటకుల్ని ఆహ్వానిస్తున్నాయి. ఎత్తైన కొండల నుంచి జాలువారుతున్న నీటి ధారలు సందర్శకులకు వింత అనుభూతిని మిగులుస్తున్నాయి.

**కటికి జలపాతం**

- బొర్రాగుహలకు సమీపంలో ఉంది ఈ జలపాతం.
- దీని ఎత్తు 300 మీటర్లు.
- రైలు ప్రయాణంలో కూడా ఈ జలపాతం అందాల్ని వీక్షించొచ్చు.
- కటికి జలపాతం వద్ద తరచూ ట్రెక్కింగ్ క్యాంప్‌లు జరుగుతుంటాయి.

**తాడిగుడ:** అనంతగిరి మండల కేంద్రానికి సమీపంలో ఉంది తాడిగుడ జలపాతం.

**అమ్మ:** అనంతగిరి-హుకుంపేట మండలాల సరిహద్దులోని వేలమామిడి సమీపంలో ఎత్తైన అమ్మ జలపాతం ఉంది. మారుమూల ప్రాంతంలో ఉండడం.. రవాణా సౌకర్యాలు అంతంతమాత్రంగానే ఉండడంతో పర్యాటకులు అంత దూరం వెళ్లలేకపోతున్నారు. అరకులోయ మండలంలోని రణజిల్లెడ, డుంబ్రి గుడ మండలంలోని కొల్లాపుట్టు, చాపరాయి జలపాతాలు కూడా పర్యాటకుల్ని రా..రమ్మంటున్నాయి.

## బాగు.. యాపిల్ సాగు

యాపిల్ సాగు అంటే అందరికీ కాశ్మీర్‌లోయ గుర్తొస్తుంది. అరకులోయ కూడా యాపిల్ సాగుకు అనుకూలంగా ఉంది. పాడేరు ఐటీడీఏ, హార్టీకల్చర్ శాఖలు ప్రయోగాత్మకంగా అరకులోయ మండలంలోని పద్మాపురం, చినలబుడులో మూడేళ్ల క్రితం యాపిల్ సాగుకు గిరిజన రైతులను ప్రోత్సహించాయి. అరకులోయలోని చల్లని వాతావరణం యాపిల్ సాగుకు అనుకూలంగా ఉండడంతో రెండేళ్ల నుంచి ఇక్కడ సిమ్లా యాపిల్స్ విరగ్గాస్తున్నాయి. అలాగే స్టాబెర్రీ పంటకు అరకులోయ ఖ్యాతిగాంచింది.

### ఘాట్ రోడ్‌లో అందాలు భలే...

విశాఖపట్నం నుంచి అరకులోయకు ఉన్న రోడ్డు మార్గంలో కూడా ప్రకృతి అందాలు పర్యాటకుల్ని పలకరిస్తాయి. కొండల నడుమ ఘాట్‌రోడ్డులో ప్రయాణం ఆహ్లాదకరంగా సాగుతుంది. ఎత్తైన గాలికొండ ప్రధాన ఆకర్షణ. అలాగే దారి మధ్యలో కాఫీతోటలు కనువిందు చేస్తాయి. ఈ తోటల్లో చల్లని వాతావరణం మధ్య ప్రయాణం ఒత్తిడిని దూరం చేస్తుంది.

### సంప్రదాయాలకు ప్రతీకలు...

- అరకులోయను సందర్శించే పర్యాటకులు, చిన్నారులకు గిరిజన మ్యూజియ, పద్మాపురం గార్డెన్‌లు ఘన స్వాగతం పలుకుతాయి.
- గిరిజన మ్యూజియంలో గిరిజన ఆచార సంప్రదాయాలను ప్రతిబింబించే కళాకృతులు ఉన్నాయి.
- ఇక్కడ బోటు షికారు కూడా ఏర్పాటు చేశారు.
- పద్మాపురం బొటానికల్ గార్డెన్‌లో పూలు, పండ్ల జాతుల మొక్కలతో పాటు ఔషధ మొక్కలు ఇక్కడ ప్రత్యేకం.
- ఇక్కడ టాయ్‌ట్రైన్‌లో ప్రయాణం చిన్నారులను ఆకట్టుకుంటుంది.



## రైలు ప్రయాణం ఓ అద్భుతం...

అరకులోయకు రైలు ప్రయాణం అద్భుతంగా సాగుతుంది. బోలెడు జ్ఞాపకాల్ని మిగులుస్తుంది. విశాఖలో ఉదయం 7 గంటలకు విశాఖ-కిరండోల్ పాసింజర్ రైలు బయల్దేరుతుంది. ఇందులో ప్రయాణమంటే పర్యాటకులకు అమితమైన ఇష్టం. కొండల నడుమ సాగే ఆహ్లాదకర ప్రయాణంతో పర్యాటకులు పరవశిస్తారు. విజయనగరం జిల్లా ఎస్.కోట సమీపంలోని బొడ్డవర ప్రాంతం నుంచి అరకులోయ సమీపంలోని కరకవలస వరకు రైలు ప్రయాణం ఎత్తైన కొండల నడుమ సాగుతుంది. కొండలను చీల్చి గుహలలో నిర్మించిన రైలు మార్గం పర్యాటకులను మరింత ఆకట్టుకుంటుంది. చిన్నారులు, విద్యార్థులంతా టన్నెల్స్ మధ్య రైలు ప్రయాణాన్ని చూసి తెగ సంబరపడతారు. పగలు కూడా ఈ కొండల మధ్య టన్నెల్స్ దాటే సమయంలో చీకటి ఆవరిస్తుంది. ప్రయాణికులకు ప్రత్యేక అనుభూతిని మిగులుస్తుంది.

### ప్రత్యేకతలివే...

- ఈ మార్గంలో మొత్తం 52 టన్నెల్స్ ఉన్నాయి.
- బొర్రా-చిమిడిపల్లి స్టేషన్‌ల మధ్య 900 మీటర్ల పొడవైన భారీ టన్నెల్ ఉంది.
- ఈ టన్నెల్‌ను రైలు దాటేందుకు 20 నిమిషాలు పడుతుంది.
- మిగతా టన్నెల్స్ 200 మీటర్ల లోపునే ఉంటాయి.
- ఘాట్ మార్గం కావడంతో రైలు ప్రయాణం నెమ్మదిగా సాగుతుంది.
- బొర్రా గుహలు మీదుగానే రైలు పట్టాలు ఉండడం మరో ప్రత్యేకత.
- రైలు ప్రయాణమంతా దట్టమైన అటవీ ప్రాంతం గుండా సాగుతుంది.
- ఎత్తైన కొండలు, ప్రకృతి అందాలు, అక్కడక్కడా దర్శనమిచ్చే జలపాతాలను చూస్తూ పర్యాటకులు మంత్ర ముగ్ధులవుతారు.





## ఎండు కొబ్బరితో ఆరోగ్య ప్రయోజనాలెన్నో..

ఎండుకొబ్బరిలో ఫైబర్, కాపర్, సెలీనియం వంటి పోషకాలుంటాయి. అందు కోసమే అనేక రకాలుగా ఎండుకొబ్బరిని వినియోగిస్తారు. రోజూ చిన్న ఎండుకొబ్బరి ముక్క తింటే... అందులోని ఫైబర్ వల్ల... గుండె కు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. పురుషులు రోజూ 38 గ్రాములు, మహిళలు రోజూ 25 గ్రాములు తినాలి. రోజూ ఎండుకొబ్బరి తింటే... ఓ వారం తర్వాత మంచి మార్పు కనిపిస్తుంది. బ్రెయిన్ బాగా పనిచేస్తుంది. మతిమరపు సమస్యలు దూరమవుతాయి. ఎండుకొబ్బరి రకరకాల వ్యాధుల్ని రాకుండా చేస్తుంది. ఎందుకంటే అది వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుంది. స్పెర్మ్ కౌంట్ పెంచుతుంది. వంధత్వాన్ని నివారిస్తుంది. ఇందుకు కారణం డ్రై కోకోనట్‌లోని సెలీనియమే. కాన్సర్ వ్యాధి ఎప్పుడు ఎవరికి ఎలా వస్తుందో చెప్పలేం. కానీ... రోజూ ఎండుకొబ్బరి తినేవాళ్లకు కాన్సర్ రావట్లేదు. ఆల్రెడీ వ్యాధి సోకిన వాళ్లు కూడా ఎండుకొబ్బరి తింటే... ఉత్తమ ఫలితాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా పేగుల్లో కాన్సర్, ప్రొస్టేట్ కాన్సర్‌కి ఎండుకొబ్బరి చక్కటి మందులా పనిచే స్తుంది. కీళ్ల నొప్పులు, ఎముకలు పెళుసుబారిపోవడం లాంటి సమస్యలు ఉంటే...ఎండుకొబ్బరి సరైన పరిష్కార మార్గం. మలబద్ధకం, అల్సర్ వంటి పొట్ట సంబంధిత సమస్యలు ఏవి ఉన్నా సరే... రోజూ చిన్న ముక్క ఎండుకొబ్బరి తినేయాలి. కచ్చితంగా మంచి ఫలితం కనిపిస్తుంది.



విశ్వంభర V3 NEWS


# చంద్రబాబు అధ్యక్షతన తొలి సారి టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం

**విశ్వంభర, అమరావతి :** టీడీపీ పొలిట్ బ్యూరో సమావేశం గురువారం నిర్వహించారు. ఈ భేటీలో తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనే దానిపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు చర్చించారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి పొలిట్ బ్యూరో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, టీడీపీ నేతలకు చంద్రబాబు పలు కీలక విషయాలపై దిశానిర్దేశం చేశారు. రెండున్నర గంటలపాటు ఈ సమావేశం సాగింది. నామినేటెడ్ పదవులపై చంద్రబాబు చర్చించారు. వీలైనంత త్వరగా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. పొలిట్ బ్యూరో సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాలను మీడియాకు మంత్రి అచ్చెన్నాయుడు వెల్లడించారు. "దక్షిణ భారతదేశంలో జనాభా నిష్పత్తి రోజురోజుకూ తగ్గుతుంది. జనాభా నిష్పత్తి తగ్గడంతో కేంద్రం నుంచి వచ్చే నిధులు సైతం తగ్గుతాయి. తెలంగాణలో టీడీపీ పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలి. పార్టీ సభ్యత్వ రుసుం రూ.100లతో ప్రారంభిస్తాం. సభ్యత్వం తీసుకున్న వారు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి రూ.5 లక్షలు



వచ్చే విధంగా పరిహారం ఇవ్వాలని నిర్ణయించారు. పేదరిక నిర్మూలనపై ప్రధానంగా చంద్రబాబు చర్చించారు. త్వరలో పేదరిక నిర్మూలనపై విధివిధానాలు రూపొందిస్తాం. విదేశాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వారిని పేదరిక నిర్మూలన కార్యక్రమంలో భాగస్వాములుగా చేయాలని నిర్ణయం తీసుకున్నాం. ఎస్సీ వర్గీకరణకు జిల్లాను యూనిట్‌గా తీసుకుంటాం. జన్మభూమి కార్యక్రమాలు తిరిగి ప్రారంభించాలని చంద్రబాబు నిర్ణయించారు. జన్మభూమి 2 గా ఈ కార్యక్రమానికి నామకరణం చేయాలని భావించారు. మొన్నటి ఏపీ సార్వత్రిక ఎన్నికల్లో సరిగ్గా దృష్టి పెడితే వైసీపీ గెలిచిన సీట్లలో మరో నాలుగు నుంచి ఐదు సీట్లు టీడీపీ గెలిచేది'' అని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

పొలిట్ బ్యూరోలో ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత 55 రోజుల పాలనపై అధినేత చంద్రబాబు చర్చించారని టీడీపీ పోలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. "త్వరలో జన్మభూమి 2 ప్రారంభం కాబోతుంది. జన్మభూమి 2 కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి ఎన్నారైలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. వర్షాలతో ప్రాజెక్టులన్ని నిండుకుండలా ఉన్నాయి. ప్రాజెక్టులు నిండటంతో మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి గుండె నీరు కారుతోంది. నామినేటెడ్ పోస్టులను అతి త్వరలో భర్తీ చేస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇసుకలో అక్రమాలు సహించబోనని అధినేత మరోసారి హెచ్చరించారు జనాభా నియంత్రణతో డీలిమిటేషన్‌లో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతోంది. ఒక యూపీలో 140 పార్లమెంటు స్థానాలు వస్తే దక్షిణ భారతదేశంలో160 మాత్రమే ఉంటాయి. జనాభా తగ్గడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు కూడా తగ్గిపోతాయి'' అని సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి వెల్లడించారు. విశాఖ ఎమ్మెల్సీ అభ్యర్థి ఎవరనే దానిపై మంత్రులు, టీడీపీ ఎమ్మెల్యేలతో చంద్రబాబు మాట్లాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ తొలి పొలిట్ బ్యూరో సమావేశం ఇది. ఈ భేటీకి మంత్రులు నారా లోకేష్, కొల్లు రవీంద్ర, అచ్చెన్నాయుడు, పార్టీ సీనియర్ నేతలు వర్ల రామయ్య, యనమల రామకృష్ణుడు, నిమ్మకాయల చినరాజప్ప, బొండా ఉమామహేశ్వర రావు, పల్లా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు తదితరులు హాజరయ్యారు. ఈ భేటీలో చంద్రబాబు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.



## నిండుకుండల్లా జలాశయాలు

**విశ్వంభర, విజయవాడ :** కృష్ణా నది పరివాహకంలోని జలాశయాలు నిండు కుండలను తలపిస్తున్నాయి. ఆల్మట్టి నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. విజయవాడలోని ప్రకాశం బ్యారేజీ నుంచి 3 లక్షల 10 వేల క్యూసెక్కులకు మించి నీరు దిగువకు విడుదలవుతోంది. మొత్తం 70 గేట్లను తెరిచారు. 60 గేట్లు నుంచి ఏడు అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తుంటే 10 గేట్లను ఎనిమిది అడుగుల మేర ఎత్తి నీరు దిగువకు వదులుతున్నారు. కేఈబీ, రైవస్, బందరు కాల్వలకు 13,768 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారు.

ఆ తర్వాత అనూహ్యంగా వరద నీటి ప్రవాహం పెరుగుతుండడంతో ముందస్తు ప్రణాళికల్లో భాగంగా వచ్చిన నీటిని వచ్చినట్లేగానే దిగువకు వదులుతున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్, ఉజ్జయిని, జూరాల, తుంగభద్ర నుంచి శ్రైశైలం వరకు ఎగువ అన్ని జలాశయాల్లోను నీటి నిల్వ సామర్థ్యం గరిష్ట స్థాయికి చేరుకుంది. శ్రీశైలం జలాశయం నుంచి 215.81 టీఎంసీల నీరు నిల్వ సామర్థ్యానికి 203.42 టీఎంసీల నీరు నిల్వ ఉంది. అక్కడి నుంచి నాగార్జునసాగర్‌కు 4లక్షల 2 వేల క్యూసెక్కుల నీరు వదులుతున్నారు. నాగార్జునసాగర్ వద్ద 312.05 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి 296.28 టీఎంసీల నీరు చేరింది. సాగర్ నుంచి 2,70,000 వేల క్యూసెక్కుల నీటిని పులిచింతల ప్రాజెక్టుకు వదిలారు. పులిచింతల వద్ద 45.77 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యానికి ప్రస్తుతం 33.56 టీఎంసీల నీరు ఉంది. పులిచింతల ప్రాజెక్టు నుంచి 3,71000 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతుండడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద అదే పరిమాణంలో నీటిని దిగువకు పంపిస్తున్నారు. గత రెండు రోజులతో పోలిస్తే నీటి విడుదల పరిమాణం ఎక్కువైంది. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగానే ప్రకాశం బ్యారేజీ ఎగువ, దిగువ ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.

## విశాఖ సముద్ర తీరంలో ముక్కలైన ఫిషింగ్ బోట్



**విశ్వంభర, విశాఖపట్నం :** విశాఖపట్నం సముద్ర తీరంలో ఓ ఫిషింగ్ బోటు తునాతునకలైంది. అలల ధాటికి కొట్టుకుని వచ్చి రాళ్ల మధ్య చిక్కుకుపోయింది. దీనిని తరలించేందుకు ప్రయత్నించగా పూర్తిగా మునిగిపోయింది. దీంతో తీరం వెంబడి బోట్ శకలాలు చెల్లాచెదురుగాపడ్డాయి. ఉదయం ఫిషింగ్ హార్బర్ నుంచి వేటకు వెళ్లిన బోటు.. తిరుగు ప్రయాణంలో సాంకేతిక ఇబ్బందులు తలెత్తాయి. ఇంజిన్ మొరాయించడంతో విశాఖ తీరానికి సమీపంలో నిలిచిపోయింది. మరమ్మతుల కోసం మరో రెండు బోట్లతో ఒడ్డుకు తరలించేందుకు చేసిన ప్రయత్నం విఫలం అయింది. లంగరు తెగిపోవడంతో అదుపు తప్పి కొట్టుకుని వచ్చేసిందని యజమాని చెప్పారు. ప్రమాదం జరిగే సమయంలో ఐదుగురు మత్స్యకారులు వుండగా వాళ్ళంతా సురక్షితంగా ఒడ్డుకు చేరుకున్నారు. ఆస్థినష్టం విలువ 20 లక్షలు అంచనా వేస్తున్నారు. కాగా, ఆ మధ్య విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో ఓ బోటులో చెలరేగిన మంటలు.. ఆ తర్వాత చాలా బోట్ల దగ్ధానికి కారణమైన ఘటన కలకలం సృష్టించిన విషయం విదితమే.

## పడిపోయిన సినిమా చెట్టును చూసి భావోద్వేగానికి గురైన డైరెక్టర్ వంశీ

**విశ్వంభర, తూర్పుగోదావరి :** గోదావరి నది వరద ఉధృతికి సినిమా చెట్టు (కుమారదేవం చెట్టు) ఇటీవల నేలకొరిగిన విషయం తెలిసిందే. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవం గ్రామంలో గోదావరి నది తీరాన ఉన్న 150 సంవత్సరాల చరిత్ర కలిగిన గన్నేరు చెట్టు ఇది. టాలీవుడ్‌లో దాదాపు 300కి పైగా సినిమాలు ఈ చెట్టు కింద షూటింగ్ జరుపుకున్నాయని.. దిగ్గజ దర్శకులు వంశీ, కె విశ్వనాథ్, జంధ్యాల, బాపు, రాఘవేంద్ర రావు తమ సినిమాల్లో ఈ చెట్టుని వాడినట్లు స్థానికులు చెబుతుంటారు. చివరిగా ఇక్కడ రామ్ చరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ షూటింగ్ ఇక్కడ జరుపుకున్నట్లు సమాచారం. చాలా సినిమాలను ఈ చెట్టు కింద తీయడం వలన దీనిని సినిమా చెట్టు అంటారని.. నిర్మాతలకు, దర్శకులకు వారి సినిమాలో ఈ చెట్టును చూపించినట్లయితే ఆ సినిమా విజయం సాధిస్తుందని అప్పట్లో నమ్మకం ఉండేదని సమాచారం. అయితే ఈ చెట్టు కూలిపోవడంతో కుమారదేవం ప్రజలతో పాటు సినీ ప్రియులు ఆవేదన చెందుతున్నారు. ఆధునిక పద్ధతులను ఉపయోగించి చెట్టుని ఎలాగైనా బ్రతికించండి అంటూ ఏపీ ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఇక దర్శకుడు వంశీకి అయితే ఈ చెట్టుతో ప్రత్యేక అనుబంధం ఉంది. చిన్నప్పుడు ఇక్కడే వంశీ అడుకునేవాడని గ్రామస్థులు చెబుతున్నారు. అయితే తాజాగా ఈ చెట్టు కూలిన విషయాన్ని తెలుసుకున్న దర్శకుడు వంశీ చెట్టుని సందర్శించాడు. గోదావరి వరద ఉధృతికి చెట్టు కూలిపోవడంతో వంశీ బోరుమని ఏడ్చినట్లు సమాచారం. ఈ చెట్టు దగ్గరే చిత్రీకరణ జరిపి 18 సినిమాలు హిట్టు కొట్టినట్లు తెలిపారు. ఎంతో చరిత్ర కలిగిన సినిమా చెట్టు కూలిపోవడం దరదృష్టకరమని వంశీ వాపోయారు. అయితే తాను చెట్టు చివరచూపు కోసం ఇక్కడికి వచ్చానని చెట్టు కూలిపోవడం చాలా బాధగా ఉందని వంశీ తెలిపాడు.



## నాటి హీరోలు అడవులను కాపాడితే నేడు నరికేస్తున్నారు: పవన్ కళ్యాణ్

- కర్ణాటక సీఎంతో పవన్ కళ్యాణ్ కీలక భేటీ



**విశ్వంభర, బెంగళూరు :** ఆనాటి హీరోలు అడవులను కాపాడేవారిగా ఉండేవారని...ఇప్పటి హీరోలు ఆ ఆడవులను నరికే వారిగా నటిస్తున్నారంటూ వ్యాఖ్యానించారు పవర్ స్టార్, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ బెంగుళూరు పర్యటనలో గురువారం షాకింగ్ కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు బెంగళూరు వెళ్లారు. ఈ సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్యతో భేటీ అయ్యారు. వన్యప్రాణి, అటవీ సంరక్షణ అంశాలపై సిద్ధరామయ్యతో పవన్ చర్చలు జరిపారు. ప్రధానంగా ఎర్రచందనం అక్రమ రవాణా నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఏనుగుల గుంపు రైతుల పొలాలను ధ్వంసం చేస్తున్న అంశం వారి మధ్య చర్చకు వచ్చినట్లు సమాచారం. ఈ క్రమంలోనే కర్ణాటక నుంచి 6 కుంకీ ఏనుగులను ఏపీకి ఇవ్వాలని పవన్ కోరారు.

పంట పొలాలను నాశనం చేసే ఏనుగుల మందను తరమడానికి కుంకీ ఏనుగులు అవసరమని పవన్ తెలిపారు. ఏపీలో రెండు కుంకీ ఏనుగులు అందుబాటులో ఉన్నాయని అధికారులు వివరించారు. కుంకీ ఏనుగుల కొరత ఉందని, అందుకే ఏనుగుల్ని తరమలేకపోతున్నామని చెప్పారు. కర్ణాటక నుంచి కుంకీ ఏనుగుల్ని తీసుకుంటే మంచిదని అభిప్రాయపడ్డారు. ఈ చర్చల్లో కర్ణాటక బయో ఎనర్జీ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన పవన్ కల్యాణ్ సినిమా ఇండస్ట్రీపై సంచలన వ్యాఖ్యలు చేశారు. 40 ఏళ్ల క్రితం హీరో అనేవాడు అడువులను సంరక్షించేవాడని, కానీ ఇప్పుడు ఆ అడవుల్లోని చెట్లను నరికి స్మగ్లింగ్ చేస్తున్నాడని వ్యాఖ్యానించారు. తనకు చాలా నచ్చింది ఏంటి అంటే దివంగత కన్నడ నటుడు రాజ్ కుమార్ నటించిన చిత్రం గంధడగుడి. ఈ సినిమా థీమ్ ఏంటి అంటే అడవులను కాపాడడం. నాకు కూడా ఇలాంటి సినిమాల్లో నటించాలా అనిపించేది. ఇంతకుముందు సినిమాల్లో హీరోలు అడవులని కాపాడేవారు. కానీ ఈరోజుల్లో గొడ్డళ్లు పట్టుకొని, స్మగ్లింగ్ చేయడం అడవులను నరికివేయడం హీరోయిజం అయిపోయింది. నేను ఆ పరిశ్రమలో ఉన్నానని అప్పుడప్పుడు బాధగా అనిపిస్తుంటుంది. ఇలాంటివి తగ్గి మళ్లీ అడవుల ప్రాముఖ్యత తెలిసేలా సినిమాలు రావాలని పవన్ కళ్యాణ్ అభిప్రాయపడ్డారు.

అయితే పవన్ కల్యాణ్ ఈ వ్యాఖ్యలు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌ను ఉద్దేశించి చేశారని మెజార్టీ నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు. కొంతకాలంగా మెగా వర్సెస్ అల్లు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతున్నాయనే సంగతి తెలిసిందే. ఏపీలో జరిగిన ఎన్నికల్లో అల్లు అర్జున్ వైసీపీ అభ్యర్థికి మద్దతు ప్రకటించారు. అప్పటి నుంచి మెగా ,అల్లు కుటుంబాల మధ్య మాటల్లేవనే చర్చ సాగుతోంది. మెగా ,అల్లు ఫ్యామిలీల మధ్య విభేదాలు తారస్థాయికి చేరుకున్నాయి. పైకి అంతా బాగానే ఉందని చెబుతున్నప్పటికి, లోలోపల మాత్రం వివాదాలు ఈ రెండు ఫ్యామిలీల మధ్య గట్టిగానే సాగుతున్నట్టు కనిపిస్తోంది.

మెగా వర్సెస్ అల్లు అభిమానుల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి కనిపించింది. అల్లు అర్జున్ నటించిన పుష్ప 2 సినిమా విడుదలకు మెగా ఫ్యామిలీ అడ్డుగా నిలుస్తోందని అల్లు అభిమానులు ఆరోపిస్తున్నారు. మెగా ఫ్యామిలీ వాట్సప్ గ్రూప్ నుంచి అల్లు అర్జున్ ఎగ్జిట్ అయ్యారనే వార్త సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తోంది. తాజాగా ఈ విభేదాలు కుటుంబ సభ్యుల వరకు వెళ్లినట్టు తెలుస్తోంది. జులై 20న మెగా కోడలు, రామ్ చరణ్ భార్య ఉపాసన పుట్టిన రోజు సందర్భంగా అల్లు అర్జున్ భార్య స్నేహారెడ్డి బర్త్ డే విషెష్ చెప్పకపోవడం కూడా హాట్ టాపిక్‌గా మారింది.

## తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాల్లో కర్ణాటక భూములు : పవన్ కల్యాణ్

**విశ్వంభర, బెంగళూరు :** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నేడు కర్ణాటకలో పర్యటించారు. బెంగళూరులో పవన్ మీడియాతో మాట్లాడారు. తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాల్లో కర్ణాటక రాష్ట్ర భూములు ఉన్నాయని, వాటి పునరుద్ధరణ (రెన్యువల్)కు సంబంధించిన అంశం తన దృష్టికి వచ్చిందని తెలిపారు. ఈ అంశాన్ని సీఎం చంద్రబాబుకు వివరిస్తానని, త్వరగా పరిష్కారం అయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. తిరుపతి, శ్రీశైలం పుణ్యక్షేత్రాలు భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్ లో



ఉన్నప్పటికీ, అవి భారతదేశం మొత్తానికి చెందిన వారసత్వ సంపద అని స్పష్టం చేశారు. మనం రాజకీయ పార్టీలుగా వేర్వేరు కావచ్చు... కానీ మనం అంతా ఒకే దేశ ప్రజలం, ఒకే సంస్కృతికి చెందినవాళ్లం అని పవన్ కల్యాణ్ వివరించారు.

భూమి అనేది కేవలం మనుషులదే కాదు అన్ని జంతువులది, జీవ జాతులకు కూడా చెందినది, వసుధైక కుటుంబం అంటే కేవలం మనుషులు మాత్రమే కాదు అనే విషయాన్ని అందరూ అర్థం చేసుకుని పర్యావరణాన్ని, అడవులను పరిరక్షించుకోవాలని అన్నారు. తాను డిప్యూటీ సీఎం పదవిలోకి రాకముందు నుంచి ప్రకృతి సంరక్షకుడ్నని, ఇప్పుడు అటవీశాఖ మంత్రిగా తనపై మరింత బాధ్యత ఉందని భావిస్తానని తెలిపారు. ఇక, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం ఉందని పవన్ కల్యాణ్ వెల్లడించారు. తనకు కన్నడ భాష అంటే చాలా ఇష్టం అని, సరిహద్దులు పంచుకుంటున్నప్పటికీ కన్నడ భాషలో మాట్లాడలేక పోతున్నందుకు బాధగా ఉందని అన్నారు. కన్నడ భాష నేర్చుకుని హృదయం లోతుల్లోంచి మాట్లాడాలని ఉందని పేర్కొన్నారు.

## పవన్ కామెంట్స్‌పై నాదెండ్ల క్లారిటీ



**విశ్వంభర, అమరావతి :** జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఏపీలో చిత్తూరు, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఏనుగుల సమస్య పరిష్కారం కోసం కర్నాటకలో దొరికే కుమ్కీ ఏనుగులు తెచ్చేందుకు ఇవాళ బెంగళూరు వెళ్లారు. అక్కడి మంత్రి ఈశ్వర్ తో ఈ సమస్యపై చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇందులో అడవుల నరికివేతపై చేసిన వ్యాఖ్యలు పరోక్షంగా అల్లుఅర్జున్ ను ఉద్దేశించి చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

కన్నడ కంఠీర రాజ్ కుమార్ నటించిన 'గంధద గుడి' సినిమాలో అటవీ పరిరక్షణ గురించి చెబుతుందని, అడవులకు రక్షణగా ఉండే డి.ఎఫ్.ఓ.పాత్రను హీరోగా ఆ చిత్రంలో చూపారని పవన్ బెంగళూరులో తెలిపారు. ఇప్పుడు సినిమాల్లో ఆ తీరు మారిందని, అడవులు కొట్టేవారు హీరోగా కనిపిస్తున్నారంటూ తెలిపారు. దీంతో ఈ వ్యాఖ్యలు పుష్ప సినిమాలో ఎర్రచందనం దొంగగా నటించిన అల్లు అర్జున్ ను ఉద్దేశించి చేసినవే అన్న వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో జనసేన కీలక నేత, మంత్రి నాదెండ్ల మనోహర్ పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై స్పందించారు. పవన్ వ్యాఖ్యలపై జరుగుతున్న ప్రచారంపై మాట్లాడుతూ.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వ్యక్తిగతంగా ఎవరిపై కామెంట్స్ చేయరని తెలిపారు. చెట్లు పెంచితే సమాజానికి మంచిది అనేది పవన్ కళ్యాణ్ ఆలోచన అని క్లారిటీ ఇచ్చారు. తద్వారా పవన్ చేసిన కామెంట్స్ కేవలం అడవుల నరికీవేతపై మాత్రమేనని, అల్లు అర్జున్ నో, మరొకరినో ఉద్దేశించి కాదని పార్టీ నాయకులు చెబుతున్నారు.

## అక్టోబర్ నుంచి కొత్త మద్యం పాలసీ

**విశ్వంభర, అమరావతి :** అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ అందుబాటులోకి తీసుకురావాలని క్యాబినెట్ నిర్ణయించింది.తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక నుంచి నాన్ డ్యూటీ లిక్కర్ అక్రమంగా ఏపీలోకి రావడంతో ఖజానాకు రూ.18వేల కోట్లు నష్టం వచ్చినట్లు మంత్రి పార్థసారథి తెలిపారు. 'నాణ్యత లేని మద్యం అమ్మకాలతో గత ప్రభుత్వం ప్రజల జీవితాలతో ఆటలాడింది. వారి వ్యసనాన్ని ఆసరాగా తీసుకుంది. ప్రజలకు అందుబాటు ధరల్లో మద్యం అమ్మకాలు చేపడతాం' అని చెప్పారు. ఇక ఇప్పటికే నూతన ఇసుక పాలసీని తీసుకువచ్చిన ఏపీ ప్రభుత్వం.. కొత్త ఎక్సైజ్ పాలసీని అమలు చేసేందుకు దృష్టి సారించింది. ఇక ఇప్పటికే ఈ కొత్త మద్యం పాలసీ రూపకల్పనపై కసరత్తు చేస్తోంది. ఈ నూతన మద్యం విధానాన్ని తయారు చేసేందుకు.. ఏపీకి పొరుగున ఉన్న రాష్ట్రాల్లో అమలు అవుతున్న మద్యం పాలసీలను అధ్యయనం చేసేందుకు 4 బృందాలను నియమించింది. ఒక్కో బృందంలో ముగ్గురు సభ్యులు ఉండగా.. వారు తెలంగాణ, కర్ణాటక, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల్లో పర్యటించి అక్కడి మద్యం పాలసీని అధ్యయనం చేస్తున్నాయి. వీటన్నింటినీ సమగ్రంగా పరిశీలించి.. ఈ నెల 12లోగా ఈ బృందాలు తమ నివేదికలను ఏపీ ప్రభుత్వానికి అందించనున్నాయి. వీటిని పరిశీలించి కొత్త మద్యం పాలసీపై సర్కార్ ఓ నిర్ణయానికి రానుంది. ఆ తర్వాత అక్టోబర్ 1 వ తేదీ తేదీ నుంచి.. ఆ కొత్త మద్యం పాలసీ అమలులోకి రానుంది.



## 4గంటల్లో 2కేజీలు తగ్గిన మేరీకోమ్

# మరి వినేశ్ ఎందుకిలా?

**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ 100 గ్రాముల అధిక బరువు ఉండడం వల్ల పారిస్ ఒలింపిక్స్ లో అనర్హత వేటు పడడంపై దేశవ్యాప్తంగా అభిమానులు షాక్ కు గురయ్యారు. ఈ నేపథ్యంలో రెజ్లింగ్ నిబంధనలు ఏంటనే దానిపై చర్చ జరుగుతోంది. అథ్లెట్లు చాలా తక్కువ సయమంలో బరువు తగ్గుంచుకోగలరని, ఇలా చాలా సార్లు జరిగిందని వాదనలు వినిపిస్తున్నాయి. ఆరేళ్ల క్రితం భారత స్టార్ బాక్సర్ మేరీ కోమ్ కేవలం 4 గంటల్లోనే 2 కిలోల బరువు తగ్గడాన్ని గుర్తు చేసుకుంటున్నారు. 2018లో పోలండ్ వేదికగా జరిగిన సిలేసియన్ బాక్సింగ్ టోర్నీలో 48 కేజీల విభాగంలో పోటీపడిన మేరీకోమ్, ఫైనల్ మ్యాచ్ ప్రారంభానికి ముందు 50 కిలోలు ఉంది. అంటే కచ్చితంగా పోటీల్లో అనర్హతకు గురవుతుంది. అయితే ఆటకు ముందు బరువు పరిశీలించే కార్యక్రమానికి మరో 4 గంటలే సమయం ఉంది. వెంటనే బరువు తగ్గించు కోవడంపై మేరీకోమ్ దృష్టి సారించింది. కేవలం 4 గంటల్లోనే 2 కిలోల బరువు తగ్గింది. అంతేకాదు ఈ టోర్నీలో స్వర్ణం



గెలిచింది. రెండు కిలోల బరువు తగ్గడానికి మేరీకోమ్ చాలా కష్టపడింది. ఒక గంటపాటు స్కిప్పింగ్ చేసింది. అలాగే బరువు తగ్గడానికి ఇతర వ్యాయామాలు చేసింది. దీంతో బరువు తూకం సమయానికి మేరీకోమ్ 50 నుంచి 48 కిలోలకు తగ్గింది. దీంతో ఆమె అనర్హత వేటు నుంచి తప్పించుకుని దేశానికి బంగారు పతకాన్ని అందించింది. అథ్లెట్లు తమ కేటగిరీలో ఉండాల్సిన బరువు కన్నా ఎక్కువ ఉంటే భారీ వ్యాయామాలు చేస్తారు. చెమటలు పట్టడానికి ప్రత్యేకమైన ఎఫ్ బీటీ షూట్ ను ధరిస్తారు. దీంతో చెమట రూపంలో శరీరంలో ఉన్న నీరు ఎక్కువగా బయటకు పోయి బరువు తగ్గుతారు. క్రీడాకారిణి ఆయా కేటగిరిలో ఉన్నారని నిర్ధరించేందుకు పోటీ జరిగే రోజు ఉదయం బరువును కొలుస్తారు. అప్పుడు ఎక్కువ బరువు ఉన్నట్లు తేలితే అనర్హతకు గురవుతారు. ప్రతి బరువు కేటగిరిలో రెండు రోజులపాటు టోర్నమెంట్ జరుగుతుంది. వినేశ్ పోటీపడే 50 కిలోల విభాగంలో పోటీలు మంగళవారం, బుధవారం జరుగుతున్నాయి. క్రీడాకారులను బరువు తూచే సమయంలో వారికి 30 నిమిషాల వ్యవధి ఇస్తారు. ఈ వ్యవధిలో వారు ఎన్నిసార్లైనా తమ బరువును కొలుచుకోవచ్చు. ఇక రెండో రోజు కూడా పోటీపడే వారికి బరువు కొలతలకు 15 నిమిషాలే కేటాయిస్తారు. ఆ సయమంలోనే నిర్ణీత బరువు ఉంటే ఫర్వాలేదు. లేదంటే అనర్హత వేటు తప్పదు. ఈ క్రమంలో బుధవారం వినేశ్ పై అనర్హత పడింది.

## వినేశ్‌కు హరియాణా

# గవర్నమెంట్ సత్కారం

**విశ్వంభర, స్పోర్ట్స్ :** అధిక బరువు కారణంగా ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం గెలిచే అవకాశం కోల్పోయిన స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్‌ను హరియాణా ప్రభుత్వం విజేతగానే పరిగణించి స్వాగత, సత్కారాలు చేయనుంది. ఈ మే-రకు హరియాణా సీఎం నయాబ్‌సింగ్ షైనీ ఓ ప్రకటన చేశారు. ఒలింపిక్స్‌లో రజత పతకం సాధించిన వారికి ఇచ్చే రివార్డ్‌ను ఆమెకు కూడా ఇవ్వనున్నట్లు తెలిపారు. హరియాణా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా విధానం ప్రకారం ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించిన వారికి రూ. 6కోట్ల నగదు, రజతం అయితే రూ. 4కోట్ల రివార్డ్, కాంస్య పతకం సాధించిన వారికి రూ. 2.5 కోట్ల నగదు పురస్కారం ఇస్తారు. ఇప్పుడు హరియాణా ప్రభుత్వం కూడా వినేశ్ ఫొగాట్‌ను రజత పతక విజేతగా పరిగణించి, ఆమెకు రూ. 4 కోట్ల నగదు పురస్కారాన్ని అందజేయనుంది. ఇక వినేశ్ రిటైర్మెంట్‌పై రియాక్ట్ అయిన ఆమె ఆమె పెద్దనాన్న మహావీర్ ఫొగాట్ తన ఈ నిర్ణయం గురించి మరోసారి ఆలోచించాలని కోరారు. అవసరమైతే తాను ఆమెతో



కూర్చొని మాట్లాడతానంటూ మహావీర్ తాజాగా మీడియాకు వెల్లడించారు. అనర్హత వేటు పడిన వెంటనే వినేశ్‌కు మద్దతు తెలిపిన ఆయన వచ్చే ఒలింపిక్స్‌కు తనను సిద్ధం చేస్తానంటూ హామీ కూడా ఇచ్చారు. "రెజ్లింగ్‌కు వీడ్కోలు పలుకుతున్నట్లు ఆమ ఈ రోజు ఉదయం 5 గంటలకు నాతో చెప్పింది. పతకం సాధించేందుకు ఇంత చేరువగా వచ్చి దాన్ని కోల్పోవడం తనను మానసికంగా ఇబ్బందికి గురిచేసింది. దీంతో ఆమె ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పింది. అయితే, ఈ రిటైర్మెంట్ నిర్ణయం నుంచి ఆమె వెనక్కి రావాలని చెబుతున్నాను.

## అమన్ సెరావత్‌కు కాంస్యం సాధించే ఛాన్స్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత రెజ్లర్ అమన్ సెరావత్ కు పారిస్ ఒలింపిక్స్ 2024లో చుక్కెదురైంది. తొలి రెండు రౌండ్లలో అదరగొట్టి సెమీస్ కు చేరిన అమన్.. అదే ప్రదర్శనను పునరావృతం చేయలేకపోయాడు. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో జరిగిన సెమీస్ పోరులో జపాన్ రెజ్లర్ రె హిగూచి చేతిలో టెక్నికల్ సుపి రియారిటీతో ఓడిపోయాడు. ఈ మ్యాచ్ లో అమన్ 0-10 పాయింట్ల తేడాతో జపాన్ రెజ్లర్ చేతిలో ఓడాడు. సెమీస్ లో ఓడినప్పటికీ కాం స్య పతకం గెలిచే అవకాశం అమన్ కు ఇంకా ఉంది. శుక్రవారం జరిగే బ్రాంజ్ మెడల్ బౌట్ లో అతడు మరోసారి బరిలోకి దిగతాడు. అంత కుముందు జరిగిన తొలి రౌండ్ బౌట్ లో అమన్ సెరావత్ ప్రత్యర్థిపై టెక్నికల్ సూపిరియా రిటితో విజయాన్ని అందుకున్నాడు. నార్త్ మెసడోనియా రెజ్లర్ వ్లాదిమిర్ ఇగొరొవ్ పై అమన్ ఏకపక్ష విజయాన్ని అందుకున్నాడు. ఏకంగా 10-0





పాయింట్లతో మట్టికరిపిం చాడు. అనంతరం జరిగిన క్వార్టర్ ఫైనల్ బౌట్ లో అల్బేనియా రెజ్లర్ అబకరోవ్ పై కూడా టెక్నికల్ సూపిరియారిటితో విజయాన్ని అందు కున్నాడు. ఈ బౌట్ లో అమన్ 12-0 పాయిం ట్ల తేడాతో విజయాన్ని అందుకుని సెమీస్ లోకి ప్రవేశించాడు.

# అందమే ఆమెకు శాపమైంది

### కెరీర్‌కు గుడ్‌బై చెప్పిన పరాగ్వే స్విమ్మర్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పరాగ్వేకి చెందిన లువానా అలాన్సో అనే 20 ఏళ్ల స్విమ్మర్ పారిస్ ఒలింపిక్స్‌లో తన దేశం తరపున పాల్గొనడానికి వచ్చింది. చిన్న వయసులోనే బటర్‌ఫ్లై ఈవెంట్లో అనేక రికార్డులు కలిగి ఉంది. టోక్యో ఒలంపిక్స్‌లో కూడా లువానా పాల్గొన్నది. కానీ పతకం దక్కలేదు. ఇక ఈ సారి ప్యారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించాలనే పట్టుదలతో తన దేశ అథ్లెట్లతో కలిసి వచ్చింది. ఒలింపిక్ విలేజ్‌లో అందరితో పాటే కలిసి ఉన్నది. 100 మీటర్ల బటర్‌ఫ్లై కేటగిరీలో క్వార్టర్ ఫైనల్స్ కూడా గెలిచి.. సెమీస్‌కు చేరుకుంది. కానీ దురదృష్ట వశాత్తు సెమీస్‌లో వెనుదిరిగింది. కానీ కథ ఇక్కడితో ఆగిపోలేదు. ఒలింపిక్ విలేజ్‌లోనే తోటి పరాగ్వే అథ్లెట్లతో కలిసి ఉంటోంది. తనకు ఇక ఎలాంటి పోటీ లేకపోవడంతో అందరితో కలివిడిగా తిరుగుతోంది. అయితే లువానా అలాన్సో అందం కారణంగా తాము పోటీలపై కాన్సన్‌ట్రేషన్ చేయలేకపోతున్నామని తోటి పరాగ్వే మేల్ అథ్లెట్లు కంప్లైంట్ చేశారు. తన అందంతో ఆమె చాలా డిస్టబ్ చేస్తోందని.. అంతే కాకుండా తమ ఏకాగ్రత దెబ్బతినేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు.





ఆమె ఉంటే మేము ఆటల్లో సరిగా పాల్గొనలేమని మేనేజ్‌మెంట్‌కు చెప్పారు. పరాగ్వే జట్టు మేనేజ్‌మెంట్ కూడా మేల్ అథ్లెట్ల మాటే విన్నది. వెంటనే విషయాన్ని తమ దేశంలో ఉన్న ఉన్నతాధికారులకు చేరవేశారు. ఇంకేముంది.. లువానా అందం కారణంగా పరాగ్వే ఆటగాళ్లు సరైన ప్రదర్శన చేయలేకపోతున్నారని డిసైడ్ అయ్యారు. వెంటనే ఆమెను దేశానికి తట్టాబుట్టా సర్దుకొని వచ్చేయా లని హుకుం జారీ చేశారు. వాస్తవానికి ఓడిపోయిన ఆటగాళ్లు ఒలింపిక్స్ ముగిసే వరకు విలేజ్‌లో ఉండటానికి అర్హులే. కానీ స్వయంగా పరాగ్వే టీమ్ మగ ఆటగాళ్లే కంప్లైట్ చేయడంతో ఆమెను బయటకు పంపించక తప్పలేదు. స్విమ్మింగ్‌లో ఎంతో భవిష్యత్ ఉన్న లువానా ఈ ఘటనతో తీవ్రమైన ఆవేదన చెందింది. కేవలం 20 ఏళ్ల లువానాకు ఇంకా ఎంతో కెరీర్ మిగిలి ఉంది. కానీ తోటి అథ్లెట్ల కారణంగా స్విమ్మింగ్‌కు గుడ్ బై చెప్పింది. తాను ఇకపై దేశం తరపున ప్రొఫెషనల్ స్విమ్మింగ్ చేయనని చెప్పింది. సొంత దేశపు ఆటగాళ్లే తనపై తప్పుడు ఆరోపణలు చేసి.. తానే వారిని ఏదో చేసినట్లు పుకార్లు పుట్టించడం చాలా బాధగా ఉందని ఆమె పేర్కొన్నది. పాశ్చత్య మీడియా కూడా అంటూ తన అందాన్ని వర్ణిస్తూ వార్తలు రాయడంపై మండిపడింది. ఒక అథ్లెట్ ఆట గురించి చర్చించాలి. అంతే కానీ.. ఇలా అందంపై చర్చ చేయడం అంటే వాళ్లను అవమానించడమే అని బాధపడింది.

# వడ్డీ రేట్లపై ఆర్‌బీఐ కీలక నిర్ణయం

**విశ్వంభర, బిజినెస్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తీసుకున్న రెపోరేట్ల నిర్ణయంతో రుణ గ్రహీతలు బేజారయ్యారు. ఆర్బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ నేడు మానిటరీ పాలసీ కమిటీ సమావేశాల అనంతరం కీలక ప్రకటన చేశారు. అందులో భాగంగా రెపోరేట్లను 6.50 శాతం వద్ద స్థిరంగా ఉంచుతున్నట్లు ప్రకటించారు. పూర్తి వివరాల్లోకి వెళితే ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ నేడు ఎంపీసీ సమావేశాల అనంతరం కమిటీ నిర్ణయాలను గురువారం ప్రకటించారు. ఎంపీసీ రెపో రేటును 6.5 శాతం వద్ద కొనసాగించేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ద్రవ్యోల్బణం 5 శాతం కంటే ఎక్కువగా ఉన్నందున, రెపో రేటును మార్చకూడదని ఎంపీసీలోని సభ్యుల్లో 4:2 మెజారిటీ మంది నిర్ణయించా రని దాస్ చెప్పారు. ద్రవ్యోల్బణాన్ని 4 శాతం దిగువకు తీసుకురావడమే మా లక్ష్యమని ఈ సందర్భంగా తెలిపారు. ఏప్రిల్, మే నెలల్లో ద్రవ్యోల్బణం 4.8 శాతంగా ఉందని, ఆహార ఉత్పత్తుల ధరల కారణంగా జూన్‌లో ద్రవ్యోల్బణం 5.1 శాతానికి తగ్గిందని ఆయన అన్నారు. ధరల స్థిరత్వం లేకుండా, వృద్ధి దీర్ఘకాలం కొనసాగదని ఆయన అభిప్రాయ



పడ్డారు. మూడో త్రైమాసికంలో దేశంలో ద్రవ్యోల్బణం తగ్గుతుందని అంచనా వేస్తున్నట్లు గవర్నర్ తెలిపారు. దేశీయ స్థాయిలో వృద్ధి కొనసాగిందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపి వృద్ధి రేటు అంచనాను 7.2 శాతంగా ఉంచింది. అదే సమయంలో, 2024-25 ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణం రేటు అంచనా 4.5 శాతంగా నిర్ణయించారు. బ్యాంకింగ్ వ్యవస్థ లో ఎక్కువ డబ్బు అందుబాటులోకి రావాలి. మరిన్ని ఉద్యోగాలు సృష్టించవలసి వచ్చినప్పుడు ద్రవ్య విధానం వైఖరి అనుకూలమైనదిగా ఉంచబడుతుంది. దేశ ఆర్థిక వ్యవస్థలో ద్రవ్యోల్బణం క్రమంగా తగ్గుతోందని గవర్నర్ అన్నారు. అయితే, మధ్య కాలంలో కొన్ని సవాళ్లు మిగిలి ఉన్నాయి. పెరుగుతున్న డిమాండ్ కారణంగా, దేశంలో తయారీ రంగం కార్యకలాపాలు పెరుగుతున్నాయన్నారను. ఆర్‌బిఐ చివరిసారిగా రెపో రేటును ఫిబ్రవరి 2023లో సవరించిం ది. అప్పట్లో రెపో రేటును 6.5 శాతానికి పెంచారు. ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే లక్ష్యంగా ఆర్బీఐ రెపోరేటును అప్పట్లో సవరించింది. ఇదిలా ఉంటే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రెపోరేట్లను స్థిరంగా ఉంచడంతో బ్యాంకుల్లో రుణాల కోసం ఎదురుచూస్తున్న కస్టమర్లు నిరాశలో కూరు కు పోతున్నారు. రెపోరేట్లు తగ్గినట్లయితే, పాము పొందే రుణాలపై వడ్డీ కూడా తగ్గుతుందని భావించారు. వారి ఆశలపై నిజరూ బ్యాంక్ ఆఫ్ ఇండియా నీళ్లు చల్లింది.




## యూపీఐ పేమెంట్స్ వాడేవారికి

# గుడ్ న్యూస్

**విశ్వంభర, బిజినెస్ :** ప్రస్తుతం యూపీఐ పేమెంట్స్ భారీగా పెరిగాయి. దేశంలో డిజిటల్ చెల్లింపులకు రోజురోజుకీ డిమాండ్ పెరుగుతోంది. చిన్న చిన్న మొత్తాలు మొదలు పెద్ద అమౌంట్స్ వరకూ యూపీఐ పేమెంట్ విధానాన్నే ఉపయోగిస్తున్నారు. దీంతో యూపీఐ చెల్లింపుల విషయంలో తాజాగా గవర్నర్ శక్తికాంత దాస్ కీలక ప్రకటన చేశారు. యూపీఐ ట్రాన్సాక్షన్స్ విషయంలో ముఖ్యమైన ప్రతిపాదనలు చేపట్టినట్లు వెల్లడించారు. గురువారం ఆర్‌బీఐ ద్వైమాసిక ద్రవ్య పరపతి విధాన నిర్ణయాల వెల్లడి సందర్భంగా గవర్నర్ శక్తికాంత దాస్ ఈ విషయమై కీలక ప్రకటన చేశారు. యూపీఐ ద్వారా ట్యాక్స్ చెల్లించే వారికి శుభవార్త తెలిపారు. యూపీఐ ద్వారా చేసే పన్ను చెల్లింపుల పరిమితిని పెంచనున్నట్లు ఆర్బీఐ గవర్నర్ ప్రకటించారు. ప్రస్తుతం ఉన్న రూ. 1 లక్షను రూ. 5 లక్షలకు పెంచుతున్నట్లు వెల్లడించారు. ఫలితంగా వ్యక్తిగత ఆదాయపు పన్ను, ఆస్తి పన్ను, ముందస్తు పన్ను చెల్లింపులు చేసేవారు ఒక లావాదేవీలో రూ. 5లక్షల వరకు చెల్లించే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఇప్పటివరకు రూ. లక్షకు మించి పన్ను చెల్లించాల్సిన వారు క్రెడిట్ లేదా డెబిట్ కార్డులను ఉపయోగించేవారు. లేదా బ్యాంకుకు వెళ్లి పే చేసేవారు. దీంతో ఓటీపీ వివరాలు అందించడం, కార్డు వివరాలను ఎంటర్ చేయాల్సి ఉండేది. అయితే.. యూపీఐ చెల్లింపుల వల్ల అలాంటి ఇబ్బందులేవీ ఉండవు. కేవలం పిన్ ఎంటర్ చేసి ట్యాక్స్ పే చేసే అవకాశం లభిస్తుంది. 2023 డిసెంబరులోనే వైద్య ఖర్చులు, విద్యా సంస్థల్లో ఫీజులను యూపీఐ ద్వారా రూ. 5 లక్షల వరకు చెల్లించే అవకాశాన్ని కల్పించింది. అంతకుముందు క్యాపిటల్ మార్కెట్లు, బీమా, విదేశాల నుంచి వచ్చే రెమిటెన్స్‌ల చెల్లింపుల పరిమితిని సైతం రూ. 2 లక్షలు చేసింది. మరోవైపు ఐపీఓల్లో పెట్టుబడి, రిటైల్ డైరెక్ట్ స్కీముల్లోనూ ఒక్క లావాదేవీకి యూపీఐ రూ. 5 లక్షల వరకు చెల్లించే అవకాశం ఉంది.

# మహీంద్రా క్లాసిక్ లెజెండ్స్ 15న ఆవిష్కరణ

**విశ్వంభర, బిజినెస్ :** దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం 'మహీంద్రా అండ్ మహీంద్రా తాజాగా మోటారు సైకిల్ ను దేశీయ మార్కెట్లోకి తీసుకొస్తోంది. బర్మింగ్ హాం స్మాల్ ఆర్మ్స్ (బీఎస్ఏ) బ్రాండ్ మద్దతుతో క్లాసిక్ లెజెండ్స్, వింటేజ్ మోటారు సైకిల్స్‌లతో భాగస్వామ్య ఒప్పందం కల మహీంద్రా అండ్ మహీంద్రా ఈ మోటారు సైకిల్ తీసుకొస్తున్నది. ఇందులో మహీంద్రా అండ్ మహీంద్రాకు 60 శాతం వాటా ఉంది. 'బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650' పేరుతో వస్తున్న ఈ మోటార్ సైకిల్ ఈ నెల 15న దేశీయ మార్కెట్లో ఆవిష్కరిస్తారు. ఇప్పటికే ఇంటర్నేషనల్ మార్కెట్లో సేల్స్ జరుగుతున్నాయి. క్రోమ్ అసెట్స్, రౌండ్ హెడ్ ల్యాంప్, టియర్ డ్రాప్ షేప్డ్ ఫ్యుయల్ ట్యాంక్, ఫ్లాట్ సీట్, వైర్ స్పోక్డ్ వెహికల్స్, ఇంప్రూవ్డ్ పెర్ఫార్మెన్స్ అండ్ హ్యాండ్లింగ్ కోసం మోడ్రన్ ఫీచర్లు జత చేశారు. ట్యూబులర్ స్టీల్ డ్యుయల్ క్రెడిల్ ఫ్రేమ్‌తో వస్తున్న మహీంద్రా బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650 మోటారు సైకిల్ అప్ ఫ్రంట్ 41ఎంఎం టెలిస్కోపిక్ ఫోర్క్స్, అడ్జస్టబుల్ ప్రీలోడ్‌తో రేర్‌లో ట్విన్ గ్యాస్ చార్జ్ షాక్స్, ఫ్రంట్‌లో 320 ఎంఎం డిస్క్ బ్రేక్స్, రేర్‌లో 255 ఎంఎం డిస్క్ బ్రేక్స్ ఉంటాయి. బ్రెంబో కాలిపర్స్, డ్యుయల్ చానెల్ ఏబీఎస్, వంటి ఫీచర్లు ఉంటాయి. అంతే కాదు.. ఈ మోటారు సైకిల్ ఫ్యుయల్ ట్యాంక్ 12 లీటర్ల కెపాసిటీ కలిగి ఉంటుంది. మహీంద్రా బీఎస్ఏ గోల్డ్ స్టార్ 650 మోటారు సైకిల్ లిక్విడ్ కూల్డ్, సింగిల్ సిలిండర్, 652 సీసీ ఇంజిన్ తో వస్తుంది. ఎఫిషియెంట్ కంబుస్టన్ కోసం డీఓహెచ్సీ లేఔట్ విత్ ఫోర్ వాల్వ్స్, ట్విన్ స్పార్క్ ప్లగ్స్ జత చేశారు. ఈ ఇంజిన్ గరిష్టంగా 45 బీహెచ్పీ



విద్యుత్, 55 ఎన్ఎం టార్క్ వెలువరిస్తుంది. క్లచ్ ఎఫర్ట్ తగ్గింపు, స్మూత్‌గా గేర్ మార్పిడి కోసం '5-స్పీడ్ గేర్ బాక్స్ విత్ ఏ స్లిప్ అండ్ అసిస్ట్ క్లచ్' ఉంటుంది.



# చైతూకి మళ్లీ పెళ్లి

## నాగ చైతన్య-శోభిత ధూళిపాళ ఎంగేజ్‌మెంట్ నాగార్జున అధికారిక ప్రకటన

**విశ్వంభర, సినిమా :** టాలీవుడ్ హీరో అక్కినేని నాగచైతన్య, నటి శోభిత దూళిపాళ రిలేషన్‌షిప్‌లో ఉన్నారని వచ్చిన రూమర్స్‌కు తెరదించుతూ ఈ లవ్ బర్డ్స్ ఎట్టకేలకు పెళ్లి పీటలెక్కబోతున్నారు. గురువారం నాగార్జున నివాసంలో ఈ జంటకు సింపుల్‌గా నిశ్చితార్థం అయింది. ఎంగేజ్‌మెంట్‌కు సంబంధించిన ఫొటోలను కింగ్ అక్కినేని నాగార్జున సోషల్ మీడియాలో షేర్ చేశారు. అయితే ఈ జంట నిశ్చితార్థం గురించి నాగార్జున చెబుతూ "శోభిత ధూళిపాళతో మా కుమారుడు నాగచైతన్య నిశ్చితార్థం ఇవాళ ఉదయం 9:42 గంటలకు జరిగింది. శోభిత ధూళిపాళను మా కుటుంబంలోకి ఆహ్వానిస్తూ.. హ్యాపీ కపుల్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాం. ప్రేమానురాగాలు, సుఖసంతోషాలతో జీవించాలి. ఇద్దరిపై దేవుడి ఆశీస్సులు ఉండాలని కోరుకుంటున్నాం.. శోభితను మా కుటుంబంలోకి ఆహ్వానించడం చాలా సంతోంగా ఉంది 8.8.8. అనంతమైన ప్రేమకు ఇది ఆరంభం" అంటూ నిశ్చితార్థం విషయాన్ని అందరితో షేర్ చేసుకున్నారు నాగార్జున.


**8.8.8 ప్రత్యేకత**

అయితే 8.8.8. ఎంటా అని చర్చనీయాంశంగా మారింది. దీనిలో మొదటి 8 ఈరోజు డేట్, రెండవ 8 ఈ నెలను సూచిస్తుంది. ఇక చివరి 8 ఏంటి అని ఆలోచిస్తున్నారు. 2024(2+0+2+4) కలిపితే 8 వస్తుంది. అలా లక్కీగా భావించి 8.8.8 పెట్టినట్లు అర్థమవుతుంది. ఈ 8.8.8కు జ్యోతిష్యం, సంఖ్యాశాస్త్రం ప్రకారం ఈ రోజుకు ఓ ప్రాముఖ్యత ఉందని, దీనిని లయన్స్ గేట్ పోర్టల్ అంటారని. ఈ రోజు శుభకార్యాలకు అన్ని విధాలా అనుకూలంగా ఉంటాయని పలువు చెబుతున్నారు. సంఖ్యాశాస్త్రం పరంగా ఆధ్యాత్మికంగా, మానసికంగా, శారీరకంగా బలపడేందుకు ఈ రోజు అనువుగా ఉంటుందని చెబుతుంటారు. న్యూమరాలజీ ప్రకారం ఎనిమిది సంఖ్య అదృష్టం, సంపద, పాజిటివ్ ఎనర్జీకి చిహ్నంగా సూచిస్తారు. అలానే ఇది అంతులేని శక్తివంతమైన రోజుగా చెబుతారు. అందుకే నాగార్జున అలా చెప్పివుండవచ్చు. అందుకే చైతన్య, శోభిత నేడు(ఆగస్ట్ 8) నిశ్చితార్థం జరుపుకున్నారని నెటిజనులు అంటున్నారు. ఈ నిశ్చితార్థానికి ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరైయ్యారు. అయితే ఈ పెళ్లిపై కొందరూ నాగ చైతన్యకు సపోర్ట్ చేస్తుండగా.. మరికొందరూ సమంతను నాగ చైతన్య మోసం చేశాడంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరికొందరు అక్కినేని కుటుంబానికి తొలి పెళ్లి కలిసి రాలేదేమో? నాగార్జునది రెండో పెళ్లే. సుమంత్ పెళ్లి కూడా డిస్టర్బ్ అయింది. నాగచైతన్య విషయంలోనూ అదే జరిగింది అంటూ సోషల్ మీడియాలో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు.

2017లో నటి సమంతను నాగచైతన్య ప్రేమించి పెండ్లి చేసుకున్నాడు. అయితే ఇద్దరి మధ్య విభేదాలు రావడంతో కొంతకాలం దూరంగా ఉన్నారు. అనంతరం 2021 అక్టోబర్‌లో విడిపోతున్నట్టుగా ప్రకటించారు. అప్పటినుంచే చైతూ-శోభిత జంటపై రూమర్స్ చక్కర్లు కొడుతున్నాయి. అయితే ఇప్పుడంతా సమంత మీదే దృష్టి పెట్టారు. మరి సమంత మాటేమిటి? సమంత కూడా మరో పెళ్లి చేసుకొంటుందా? అసలు చై రెండో పెళ్లి విషయంపై సామ్ ఎలా రియాక్ట్ అవుతుంది అన్న చర్చ నడుస్తోంది. అయితే సమంత నాగచైతన్యతో విడాకులు తీసుకున్నాక ఇద్దరూ హుందాగానే వ్యవహరించారు. ఒకరి మీద ఒకరు ప్రత్యక్షంగా ఎక్కడా కామెంట్స్ చేసుకోలేదు. అయితే సమంత కుదిరిన ప్రతిసారీ పరోక్షంగా తన ఫీలింగ్స్‌ని కొటేషన్స రూపంలోనో, ఇంకోలాగానో సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకునేది. మరి ఈసారి సమంత ఎలా స్పందిస్తుందన్నది ఆసక్తికరంగా మారింది.

# పవన్ ఒక అద్భుతం

## స్టార్ హీరోయిన్ శ్రియా శరణ్ షాకింగ్ కామెంట్స్



**విశ్వంభర, సినిమా :** సౌత్ ఇండస్ట్రీని తన అందం, నటనతో ఒక ఊపారు శ్రీయా శరణ్. టాప్ స్టార్స్‌తో పాటు యంగ్ హీరోల సరసన నటించి ప్రేక్షకులను అలరించారు. మోడలింగ్‌తో కెరీర్ ప్రారంభించిన శ్రీయ.. సినీ రంగంలోకి అడుగుపెట్టారు. ఇష్టం సినిమాతో తెలుగు వారికి పరిచయమయ్యారు. ఆ మూవీ నిరాశపరిచినా.. ఆమె తన అందం, క్యూట్ లుక్స్, మదినిదోచే నవ్వుతో ప్రేక్షకులను తనవైపు తిప్పుకున్నారు. దాంతో ఆమెకు టాప్ స్టార్స్ సరసన నటించే అవకాశం దక్కింది. చిరంజీవి, బాలకృష్ణ, నాగార్జున, వెంకటేష్ వంటి అగ్రనాయకులతో పాటు పవన్ కళ్యాణ్, మహేశ్ బాబు, జూనియర్ ఎన్టీఆర్, ప్రభాస్‌లతో కూడా నటించి విజయాలు దక్కించుకుని నటనలో శభాష్ అని పించుకుంది. కథ బాగుంటే హీరో ఎవ్వరనేది ఆలోచించేదికాదు. తరుణ్, రాజా, ఉదయ్ కిరణ్, వేణు వంటి హీరోలతోనూ నటించి మెప్పించారు. టాలీవుడ్ లోనే కాకుండా కోలీవుడ్, బాలీవుడ్‌లోను తాను ఎంటో నిరూపించుకుంది. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి నటి శ్రియ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. హైదరాబాదులోని ఓ షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన ఆమె పవన్ రానున్న రోజుల్లో అద్భుతాలు చేస్తారని, అయనే ఓ అద్భుతమని అన్నారు. ఆమె మాట్లాడుతూ ''ఇటీవల జరిగిన ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ అద్భుతమైన విజయం అందుకున్నారు. ఆయన విషయంలో సహ నటిగా నేనెంతో గర్వంగా ఉన్నా. మేమిద్దరం గతంలో 'బాలు' కోసం కలిసి వర్క్ చేశాం. ఎప్పుడు నిశ్శబ్దంగా ఉంటారు. శ్రమపడే మనస్తత్వం కలిగిన వ్యక్తి. ఆ సినిమాలోని ఓ పాట చిత్రీకరణ సమయంలో పవన్ కాలికి గాయమైంది. పాట షూట్ పూర్తయ్యే వరకూ ఆ విషయాన్ని ఎవరితోనూ చెప్పలేదు. ప్రజలకు మంచి చేయాలని ఎప్పుడూ తాపత్రయపడే వారు. ప్రజలు ఆయన్ని ఎన్నుకోవడం సంతోషంగా ఉంది. ఆయన అద్భుతాలు సృష్టిస్తారని నేను నమ్ముతున్నా'' అని శ్రియ అన్నారు. అలాగే చిరంజీవితో కలిసి మరోసారి వర్క్ చేయాలనుకుంటున్నానని అన్నారు. చిరంజీవి, శ్రియ సూపర్‌హిట్ చిత్రం 'ఠాగూర్'లో నటించిన సంగతి తెలిసిందే.

# నవ్వుల పూలంగి రేలంగి

## నేడు హాస్య చక్రవర్తి రేలంగి జయంతి ప్రత్యేకం

కమెడియన్‌గా, విలన్‌గా, క్యారెక్టర్ నటుడిగా, తన ప్రతిభను అన్ని కోణాల్లో ఆవిష్కరించిన హాస్య చక్రవర్తి రేలంగి. తెలుగు సినీ హాస్యనటుల్లో తొలి పద్మశ్రీ పురస్కారం అందుకున్న కామెడీ కింగ్. తెలుగు సినీ హాస్య సామ్రాజ్యాన్ని దాదాపు రెండు దశాబ్దాలు ఏకఛత్రాధిపత్యంగా ఏలిన హాస్య రారాజు రేలంగి.

తెలుగు ప్రజల ఆదరాన్ని చూరగొన్నారు. 'మా రేలంగోడు' అని అభిమానంగా పిలిపించు కున్నారు. చెప్పులు లేకుండా నడచిన పాండీ బజారులో ఏనుగు అంబారీమీద ఊరేగాడు. పుట్టి పెరిగిన నేలమీద ఆయన గజారోహణం చేయించు కున్నారు. అసాధ్యాలను సాధ్యాలుగా మలుచు కున్నారు. అగ్రశ్రేణి హీరో రామారావు చేత బావా' ' అని ప్రేమతో, ఆదరంగా పిలిపించు కున్నారు. నటీనటుల చేత, జర్నలిస్టుల చేత సత్కారాలు పొందారు. దేశాధ్యక్షుని చేతిమీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకొని తొలి హాస్య నటుడిగా చరిత్ర పుటల కెక్కారు... పుట్టిన నేల తల్లిని మరవకుండా చివరి దశలో అక్కడే తనువు చాలించారు. అంతటి గొప్ప పాత తరం నటుడైన రేలంగి వెంకట రామయ్య (9 ఆగస్టు 1910 - 26 నవంబర్ 1975) జయంతి సందర్భంగా ఆయన జీవన ప్రస్థానంలో ప్రత్యేకతల గురించి తెలిపే చిరు ప్రయత్నం ఇది. రేలంగి వెంకట్రామయ్య తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ సమీపంలోని రావులపాడులో 1910, ఆగష్టు 9వ తేదీన జన్మించారు. తొలి రోజుల్లో తనపాటలు తనే పాడుకునేవారు. 'పాతాళభైరవి'లో 'వినవే బాలా నా ప్రేమ గోలా', 'తాళలేనే నే తాళలేనే అమ్మలారా ఓయమ్మలారా', పాటలు; విప్రనారాయణ సినిమాలో 'ఆడది అంటే లయం లయం ఆ నీడంటేనే భయం భయం' పాట; మిస్సమ్మ సినిమాలో 'ధర్మం చెయ్ బాబూ కాణీ ధర్మం చెయ్ బాబూ', 'సీతారాం సీతారాం, సీతారాం జై సీతారాం'; ఎత్తుకు పైఎత్తు చిత్రంలో 'ఎవడను కున్నావు' పాటలు వాటిలో కొన్ని మాత్రమే. సినిమాలన్నిటిలోనూ వైవిధ్యమైన పాత్రలు పోషిస్తూ, పాత్రోచితంగా సంభాషణలు నొక్కి వక్కాణించడం హాస్యనటుడిగా ఒక్క రేలంగికే సాధ్యమైంది. అందుకే హీరోతో సమాన ప్రాధాన్యంగా ఉండేలా రచయితలు రేలంగి పాత్రలను తీర్చిదిద్దారు. ఒక హీరో మరియు హీరోయిన్‌కు లభించే జీతం వలె రేలంగి వెంకట రామయ్యకు భారీ మొత్తాన్ని అందించారు. జెమినీ వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1942) చిత్రంలో తలారి రాముడు పాత్ర పోషించిన రేలంగి మళ్ళీ పదిహేడు సంవత్సరాల తరువాత శ్రీవేంకటరామణా వారు నిర్మించిన 'బాలనాగమ్మ' (1959) చిత్రంలో అదే పాత్రను పోషించడం విశేషం. అలాగే 'గొల్లభామ' (1947) చిత్రంలో ధరించిన విదూషకుడి పాత్రనే ఇరవై ఏళ్ల తరవాత 'భామా విజయం' (1967) చిత్రంలో తిరిగి పోషించారు.

రేలంగి పోషించిన ఏ పాత్రైనా కథలో ప్రధాన భాగంగా ఉండేదే కానీ, అతికించినట్లు వుండేది కాదు. 'చెంచులక్ష్మి' చిత్రంలో నారదునిగా 'నీలగగన ఘన శ్యామా దేవా' అనే హరినామ కీర్తన చేస్తూ నటిస్తుంటే ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. రేలంగి కోసం 'సరదా సరదా సిగిరెట్టు ఇది దొరల్ తాగు బల్ సిగిరెట్టు' (సిరి సంపదలు), 'అయ్యయ్యో చేతిలో డబ్బులు పోయెనే' (కులగోత్రాలు), 'హరి గోవింద గోవింద' (వెలుగు నీడలు), 'ఇంగ్లీషులోన మ్యారేజి' (ఆరాధన), 'గనగజా తనయం సహృదయం' (వాగ్దానం), 'చెక్కిలి మీద చెయ్యి జేర్చి చిన్నదానా' (మాంగల్య బలం), 'ఆ దేవుడు మనిషిగ పుట్టాలిరా' (అంతస్తులు), 'నీసోకు చూడకుండ నవనీతమ్మో' (తోడి కోడళ్ళు), 'భలేచాన్సులే బలే చాన్సులే' (ఇల్లరికం) వంటి ఎన్నో సరదా పాటలు ఆరోజుల్లో సినిమాల్లో పెడితే ప్రేక్షకులు ఎంతబాగా ఆదరించారో చెప్పాల్సిన పనే లేదు. రేలంగి నటించిన చివరి సినిమా ఎన్టీఆర్ నటించిన 'నిప్పులాంటి మనిషి.

1970లో భారత ప్రభుత్వం రేలంగికి 'పద్మశ్రీ' అవార్డు ఇచ్చి సత్కరించింది. పద్మ పురస్కారం అందుకున్న తొలి హాస్య నటుడు రేలంగి కావడం విశేషం. శ్రీవేంకటేశ్వర విశ్వ విద్యాలయానికి రేలంగి సెనేట్ సభ్యుడుగా వ్యవహరించారు. ఆంధ్రనాటక కళాపరిషత్తు, హైదరాబాదు వారు 1955లో రేలంగికి ఘనసత్కారం చేశారు.

తనవద్ద పనిచేసిన డ్రైవరుకు వృద్ధాప్యం వలన కళ్లు కనుపించక పోతే, అతనికి ఒక ఇల్లు కట్టించి నెలనెలా పింఛను వచ్చేలా కొంత పెద్ద మొత్తాన్ని బ్యాంకులో వేసి ఆదుకున్న మానవతా మూర్తి ఆయన. రేలంగి వృద్ధిలోకి వచ్చాక కష్టాలను, కష్టాలలో ఆదుకున్న మిత్రులను మరచిపోలేదు. తను తిండితిప్పలు లేకుండా అవస్థపడిన వాడు కనుక, తను భోజనం చేసేటప్పుడు కనీసం పాతిక మందికి భోజనం పెట్టే సదాచారాన్ని పాటించారు.

నాటి అగ్ర కథా నాయకులు రామారావు, నాగేశ్వరరావు కన్నా ముందే చిత్రసీమలో అడుగు పెట్టినవాడు కావడంతో ఇద్దరూ రేలంగిని ఎంతగానో గౌరవించేవారు. వరవిక్రయం' సినిమాలో భానుమతి నటించడానికి కారకులు రేలంగి. అలాగే అంజలీదేవి 'గొల్లభామ'లో నటించడానికి ఆమెను పుల్లయ్యకు పరిచయం చేసిన వ్యక్తి రేలంగి.

రేలంగి కాస్టింగ్ ఏజంటుగా పనిచేస్తుండడంతో కృష్ణవేణి, పుష్పవల్లి, హైమవతి, భానుమతి, అంజలీదేవి వంటి నటీమణుల్ని సినిమాల్లో పరిచయం చేసే గొప్ప అవకాశం రేలంగికి దక్కింది.1910లో జన్మించి, 65 వ ఏట 1975 సంవత్సరంలో మరణించిన రేలంగి తెలుగు సినిమా మనగలిగినంత కాలం హృదయాలలో చిరస్థాయిగా నిలిచి పోతారు.



# డెంగ్యూ ప్లేట్‌లెట్ల సమస్యకు పరిష్కారం

**విశ్వంభర, ఫిచర్:** ప్రస్తుతం వర్షాకాలం కొనసాగుతోంది. వర్షాకాలం అంటే దోమల సమస్య, దోమల వల్ల వ్యాధులు పెరుగుతాయి. డెంగ్యూ-మలేరియా ప్రాణాపాయం. వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా ఎక్కువగా వస్తుంటాయి. ఎందుకంటే వర్షం నీరు పేరుకుపోవడంతో దోమల వృద్ధి పెరుగుతుంది. ఏడిస్ దోమల వల్ల డెంగ్యూ వస్తుంది. ఈ దోమ కుట్టడం వల్ల డెంగ్యూ వ్యాపిస్తుంది. డెంగ్యూ కారణంగా, శరీరంలో ప్లేట్‌లెట్ కౌంట్ వేగంగా తగ్గడం ప్రారంభమవుతుంది, ఇది రోగి మరణానికి కూడా దారితీస్తుంది. కాబట్టి డెంగ్యూ సమస్యలో ప్లేట్ లెట్ కౌంట్ తగ్గకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ఆహారంలో చేర్చుకోవాల్సినవి

డెంగ్యూ కారణంగా ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉండటం ప్రాణాంతకం. కాబట్టి డెంగ్యూ చికిత్స సమయంలో మందులతోపాటు కొన్ని పండ్లు, కూరగాయలను ఆహారంలో చేర్చుకోవాలి. ఇది ప్లేట్‌లెట్ కౌంట్‌ను పెంచడంలో సహాయపడుతుంది. డెంగ్యూ వ్యాధిగ్రస్తులకు బొప్పాయి ఆకుల రసం ఎంతో మేలు చేస్తుంది. ఇది ప్లేట్‌లెట్స్ వేగంగా పెరగడానికి సహాయపడుతుంది. మీరు డెంగ్యూ నుండి త్వరగా కోలుకోవాలంటే, బొప్పాయి ఆకు రసం త్రాగండి, ఈ రెమెడీ ప్రయోజనకరంగా ఉంటుంది. డెంగ్యూ సమస్యకు కివీ పండు చాలా మేలు చేస్తుంది. కివిలో విటమిన్ సి మరియు పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. అంతే కాదు, శరీరంలో ఎలక్ట్రోలైట్ల సమతుల్యతను కాపాడుకోవడంలో కూడా ఇది సహాయపడుతుంది. కాబట్టి డెంగ్యూ నుండి ఉపశమనం పొందడానికి కివీని మీ ఆహారంలో చేర్చుకోండి. దానిమ్మలో



విటమిన్లు, మినరల్స్ మరియు యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి, ఇవి రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి మరియు ప్లేట్‌లెట్ ఉత్పత్తికి తోడ్పడతాయి. దానిమ్మ రసం తీసుకోవడం లేదా గింజలు తినడం వల్ల డెంగ్యూ రోగులకు అవసరమైన పోషకాలు అందుతాయి. అరటిపండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అరటిపండ్లలో విటమిన్ బి6, ఐరన్ మరియు పొటాషియం పుష్కలంగా ఉన్నాయి. ఇది డెంగ్యూ నుండి త్వరగా ఉపశమనం కలిగిస్తుంది. అంతే కాదు అరటిపండ్లు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. కాబట్టి డెంగ్యూ రోగులకు అరటిపండు ఎంతో మేలు చేస్తుంది. బొప్పాయి ఆకు రసంతో పాటు బొప్పాయిని తీసుకోవడం కూడా డెంగ్యూ వ్యాధికి మేలు చేస్తుంది. బొప్పాయిలో యాంటీ ఆక్సిడెంట్లు మరియు యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి. రోగనిరోధక శక్తిని పెంపొందించడంతో పాటు ఇన్ఫెక్షన్ వల్ల కలిగే మంటను తగ్గించడంలో బొప్పాయి వినియోగం ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది డెంగ్యూ ఇన్ఫెక్షన్ వల్ల వచ్చే జీర్ణ సమస్యలను కూడా నయం చేస్తుంది. పాలకూర విటమిన్ ఎ, సి మరియు కెలు పుష్కలంగా ఉండే ఆకుకూర. ఈ విటమిన్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. అంతే కాకుండా పాలకూరలో ఐరన్ కూడా పుష్కలంగా ఉంటుంది, ఇది హిమోగ్లోబిన్‌ను పెంచడంలో బాగా సహాయపడుతుంది. కాబట్టి డెంగ్యూ వ్యాధిగ్రస్తులు పాలకూరను ఆహారంలో చేర్చుకోవాలి.

# జుట్టు రాలడానికి కరివేపాకుతో చెక్

**విశ్వంభర, ఫిచర్:** మారుతున్న వాతావరణ పరిస్థితులు జుట్టు రాలడాన్ని పెంచుతాయి. జుట్టు రాలడం అనేది పిల్లల నుండి పెద్దల వరకు చాలా మందిని వేధిస్తున్న సమస్య. స్త్రీలైనా, పురుషులైనా ప్రతి ఒక్కరూ ఈ సమస్యను ఎదుర్కోవలసి ఉంటుంది. అదేవిధంగా కెమికల్స్ ఉన్న హెయిర్ ప్రొడక్ట్స్, నూనెలను వాడటం వల్ల జుట్టు రాలడం ప్రారంభమవుతుంది. జుట్టు డల్ గా కనిపిస్తుంది. దీని వల్ల స్కాల్ప్ డ్రైగా మారి జుట్టు ఎక్కువగా రాలిపోతుంది. రోజూ వాడే కొన్ని ఆకులను జుట్టుకు రోజూ వాడితే జుట్టు ఆరోగ్యం బాగుంటుంది. కరివేపాకులను ఆహారంలో సువాసన, రుచి కోసం మసాలాగా చేయడానికి ఉపయోగిస్తారు. కరివేపాకు జుట్టుకు చాలా ప్రయోజనాలను కలిగి ఉంది. కరివేపాకుల్లో ఉండే పోషకాలు మీ జుట్టు మరియు తలకు రెండింటికీ మేలు చేస్తాయి. కరివేపాకులో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ సి, కాల్షియం మరియు ఐరన్ పుష్కలంగా ఉన్నాయి. ఈ మూలకాల వల్ల జుట్టుకు తగినంత పోషణ లభిస్తుంది. దీని ఆకులు యాంటీ ఫంగల్, యాంటీ ఆక్సిడెంట్, యాంటీ ఇన్ఫ్లమేటరీ మరియు యాంటీ బాక్టీరియల్ లక్షణాలను కలిగి ఉంటాయి. దీని వల్ల కాడిపట్ట జుట్టుకే కాదు మన చర్మానికి కూడా ఉపయోగపడుతుంది. కాబట్టి జుట్టుకు కరివేపాకు వల్ల కలిగే ప్రయోజనాలు.. కరివేపాకు యాంటీ ఆక్సిడెంట్లకు మంచి మూలం. ఇందులో అమైనో ఆమ్లాలు ఉంటాయి. ఈ ఆకుల నూనె జుట్టు కుదుళ్లకు మేలు చేస్తుంది మరియు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తుంది. కరివేపాకుతో జుట్టుకు మసాజ్ చేయడం వల్ల జుట్టు పెరుగుతుంది. జుట్టు చిన్న వయస్సులోనే గ్రే కలర్ లోకి మారదు మరియు అకాల జుట్టు రాలడాన్ని ఆపవచ్చు. కరివేపాకు నూనె తయారు చేయడానికి, ఒక కప్పు కొబ్బరి నూనెలో కొన్ని కరివేపాకులను వేసి ఉడికించాలి. ఈ నూనె ఉడికిన తర్వాత, చల్లారనివ్వండి తర్వాత బాటిల్లోకి వడగట్టుకోవాలి. తర్వాత ఈ నూనెతో రోజుమార్చి రోజు తలకు పట్టించి మసాజ్ చేసుకోవచ్చు. మీరు కరివేపాకు నూనెను జుట్టుకు 2 నుండి 3 సార్లు అప్లై చేయవచ్చు. కరివేపాకును తయారు చేసేటప్పుడు మీరు మెంతులు వేయవచ్చు. ఇది నూనె నాణ్యతను బాగా ఉంచుతుంది. మీరు మీ జుట్టుకు కరివేపాకు హెయిర్ మాస్క్‌ను అప్లై చేయవచ్చు.

తెలుగు దినపత్రిక
రిపోర్టర్స్ కావలెను V3 NEWS లక్ష్యం సమాజహితం విశ్వంభర అక్షరం సాక్షిగా...
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాల వారిగా
V3 న్యూస్ ఛానల్ & విశ్వంభర తెలుగు దిన పత్రికలో
పనిచేయుటకు స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్స్,
కెమెరామెన్స్, సబ్-ఎడిటర్లు, మార్కెటింగ్ ఎక్జిక్యూటివ్స్ కావలెను.
Wanted Reporters & Marketing Executives
Contact: 9441222429 | 8885402108

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com